సెప్టెంబర్ 2019
రూ. 20

# చైతన్యం

## సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక

వినాయక చవితి శుభాకాంక్షలు




BASEL 2019
TOTAL
ONGC
GoSports





# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -8 సెప్టెంబర్ 2019 సంచిక -12

వ్యవస్థాపక సంపాదకురాలు

తీగవరపు శాంతి

## ఈ సంచికలో

### ధారావాహికములు:

| | |
|---|---|
| మానససరోవర యాత్ర | 6 |
| అంకెలు,....: నాలుగు | 22 |
| ప్రేమంటే ఇంతే | 26 |
| తెలుగు పద్య రత్నాలు | 33 |
| మా ఊరి నందుల కథ | 37 |
| ప్రహేళిక | 47 |

### ప్రత్యేక ఆకర్షణలు

| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| శరణు శరణు గణాధిపా | 9 |
| పట్టిందల్లా బంగారం | 14 |
| మన రెండవ రాష్ట్రపతి ........ | 17 |
| దురాశే ...పిశాచం | 35 |
| శ్రావణ శోభలు | 39 |
| దేవుడు దెయ్యం | 40 |
| అవును ఈ చీర నాదే | 44 |
| రసాయనాలు- పరిసరాలపై ..... | 48 |

రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# నేషనల్ మెడికల్ కమిషన్ (NMC)

వైద్య రంగంలో పెనుమార్పులు కోసం కేంద్ర ప్రభుత్వం 'NMC' అనే పేరుతో చట్టం తీసుకు వచ్చింది. ఆరు దశాబ్దాలుగా 'మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' అనే పేరు మీద చట్టం ఉంది. ఈ చట్టం స్థానంలోనే 'NMC' పేరుతో 'MCI' లో ఉండే అవినీతిని అంతం చేస్తామని, లోపాలను సరిదిద్దుతూ చట్టాన్ని తీసుకు వచ్చామంటోంది కేంద్రం. లోపాలను సరిదిద్దుతుంటే, డాక్టర్లు దేశవ్యాప్తంగా సమ్మె చేసి, పెద్ద రగడ జరుపుతూ రోగులను కూడా పట్టించుకోకుండా  ఆందోళన చెయ్య వలసిన అవసరం ఏముంది?

. 'NMC' కి స్వతంత్రత ఉండదని అంతా కేంద్రమే పెత్తనం చేస్తుందని డాక్టర్ల వాదన. ఎగ్జిట్ టెస్ట్, బ్రిడ్జ్ కోర్స్, కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్స్, మెడికల్ సీట్ల భర్తీలో ప్రయివేటు పెత్తనం అనే అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అర్హత లేనివారి వైద్యంతో ప్రజలు ఇంకా ఇబ్బందులు పడతారనేది డాక్టర్ల  ఆందోళన. RMP, PMP డాక్టర్లను దేశ వ్యాప్తంగా MBBS డాక్టర్లతో కంపిటీషనుగా మందులు వ్రాసే అర్హత వారికి ఇచ్చి, హెల్త్ ప్రొవైడర్లుగా నియమిస్తే ప్రజల ఆరోగ్యం ఏమైపోవాలి? వారు ఆరునెలలు అలా అతి కొద్ది కాలం, కొద్ధి అనుభవం సంపాదించిన వారు ఇష్టం వచ్చినట్లు మందులు వ్రాసేస్తే, వాళ్లకి రెసిస్టన్స్ పవర్ తగ్గిపోదా? వారికి సరియైన మందులు ఇస్తున్నారా?  లేదా? అని పట్టించుకునేదెవరు? అలాగే ఆరు సంవత్సరాలు కష్టపడి చదివిన మాతో, అతి కొద్ది కాలమే అనుభవం సంపాదించిన వారు మాతో సమానం ఎలా అవుతారు? MBBS చదివి ప్రాక్టీస్ చేయాలనుకునేవారు ఒక్కసారే పరీక్షకు అర్హులన్న నిబంధన పైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు జూనియర్ డాక్టర్లు. ఒకసారి ఎంట్రన్స్ లో  రాకపోతే వారు పీజీకి అనర్హులనడం సరికాదు అని డాక్టర్ల వాదన. ర్రాష్ట్ర ప్రభుత్వాలు సయితం వ్యతిరేకిస్తున్నాయి అది సరియైనది కాదు, మేముకూడా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతాము అని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అంటున్నాయి. అందుకోసం తెలంగాణా వైద్య శాఖామంత్రి 'ఈటెల రాజేంద్ర' కూడా చెప్పారు. ఎంట్రన్స్ లో ఒక్క సారి రాకపోతే, రేండో సారి, మూడో సారి కూడా వ్రాసే అర్హత ఉండాలని కేంద్రంతో మాట్లాడతామని మంత్రి అన్నారు. 'MCI' లో  అవినీతి పేరుకుపోయింది. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సదుపాయానికి ఇబ్బంది అవుతోంది కాబట్టే ఈ చట్టం తీసుకువస్తున్నామని కేంద్రం అంటోంది.

63 సంవత్సరాల క్రితం 1956 లో MCI పేరుతో  100 మంది సభ్యులతో ఈ చట్టం వచ్చింది. 'MCI'  లో  పెద్ద ఎత్తున  అవినీతి ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. అందుకని 'NMC' పేరుతో 25 మంది సభ్యులతో  కొత్త చట్టం తీసుకురావడం జరిగింది. అందులో 16 మందిసభ్యులుండాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రాలనుండి  ఆరుగురు, మెడికల్ నేపధ్యం నుండి 5 గురు సభ్యులు ఉంటారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు మెంబర్ షిప్ రావాలంటే 12 సంవత్సరాలు పడుతుంది. చైర్మన్ ను, సభ్యులను ఏ సమయంలోనైనా తొలగించే అధికారం కేంద్రానికే ఉంటుంది. అదే పెద్ద ఎత్తున అభ్యంతరాలు వస్తున్నాయి. 'NMC' ఇండిపెండెంట్ వ్యవస్థగా పని చేయకుండా కేంద్రం తన గుప్పెట్లో పెట్టుకుంటోందని వ్యతిరేకిస్తున్న వాళ్ళు ఉన్నారు. అతి పెద్ద సంస్కరణ చేయడం ద్వారా వైద్య రంగాన్ని, ఆరోగ్య రంగాన్ని  పేద ప్రజలకు గ్రామీణ ప్రాంత ప్రజలకు దగ్గరగా తీసుకు వెళ్లాలని అనుకుంటున్నామని కేంద్రం చెపుతోంది.

ఈ సంస్కరణలతో పేద ప్రజల దగ్గరకు, గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల దగ్గరకు వైద్యం చేరుతుందా? అలాగే RMP, PMP డాక్టర్లకు అటువంటి ట్రైనింగులు ఇచ్చి అర్హత ఇస్తే, ప్రజలకు  వారు చేసే వైద్యం సరిపోతుందా? పేద ప్రజలకైతే  'RMP లు, PMP' ల వైద్యం సరిపోతుందా? అదే మేము ఓట్లు వేసి, మేము అధికారాలిచ్చి, మేము పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులు జీతాలుగా తీసుకుంటున్న వారైతే ఇండియాలో వైద్యం కూడా చాలక, అమెరికా వెళ్లి వైద్యం చేయించుకుంటారా? అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ఇదేనా! మీరు మాకు చేసేది? మా గ్రామాలు బాగు చేసి, పెద్ద పెద్ద ఆసుపత్రులు కట్టి, మంచి మంచి స్కూల్స్ ఏర్పాటు చెయ్యండి. పల్లెటూళ్ళకి వెళ్లి పని చేసే వైద్యులకు సిటీ లో ఉన్న వారికన్నా అధికంగా సదుపాయాలూ, జీతాలూ ఇవ్వండి. అంతేకాదు ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులు అభివృద్ధి చేయండి. ఎంతగా చేయాలంటే, ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులతో సహా ప్రభుత్వ ఆసుపత్రులలో మాత్రమే ట్రీట్మెంట్ చేయించుకోవాలి అనే చట్టాలను తీసుకు రండి అనేది ప్రజల అభిలాష. పెద్ద పెద్ద ఆసుపత్రులు కోట్లు  ఖర్చు పెట్టి కట్టి, డాక్టర్లకు లక్షల్లో జీతాలు ఇవ్వవలసి వస్తుంది కాబట్టి డాక్టర్లు పేషంట్లకు అవసరం ఉన్నా లేకపోయినా అనేక టెస్టులు వ్రాస్తూ ఉంటే, వాటి ద్వారా వేలకు వేలు ప్రజల నుండి గుంజడానికి స్వస్తి పలికించండి ప్రభుత్వాలూ.  ఇక డాక్టర్లు కోట్లు పెట్టి సీటు కొనుక్కుని చదివి, దానికి పది ఇంతలు ప్రజల దగ్గరనుండి పిండాలనే దానికి స్వస్తి పలికించండి. డాక్టర్లుగా ఉండి, అనేక అన్యాయాలకు, అరాచకాలకు పాల్పడుతున్నారు వారుకూడా  లేకపోలేదు. అటువంటి వారి మీద ప్రభుత్వం ఇంకా కఠిన చర్యలు  తీసుకోవలసిన అవసరం కూడా ఉంది నిజంగా ప్రభుత్వం సంస్కరణలు చేయదలచుకుంటే, మంచి మార్గాన్ని ఎన్నుకుని ప్రజలకు అండగా ఉండాలని, శరీరం, ప్రాణం అందరిదీ ఒకటే కాబట్టి అందరికీ ఒకే రకమైన ట్రీట్మెంట్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుకుంటోంది చైతన్యం సంకల్పబలం.

తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

చైతన్యం ఆగస్ట్ సంచిక ఎప్పటిలాగానే చాలా బావుంది. ముఖ్యంగా కష్మీర్ మీద మీ సంపాదకీయం మంచి విశ్లేషణ తో మరీ బావుంది. ఇంతటి మంచి పత్రిక ని ఇన్నేళ్ళగా ఆసక్తికరంగా నిర్వహిస్తూ, మాకు ఉచితంగా పంపిస్తున్నందుకు నా అభివాదాలు. అభినందనలు.

వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, యు ఎస్ ఎ

ఆర్టికిల్ 370, 35ఎ మీద మీరు వ్రాసిన సంపాదకీయం బహు రమ్యంగా వున్నది.

సూరి శర్మ, కుకట్ పల్లి, హైదరాబాదు

మీ సంపాదకీయం ఆగస్టు నెల పత్రికకే వన్నె తెచ్చింది. కాశ్మీర్ సమస్యపై మీరు చేసిన విశ్లేషణ చాలా బాగుంది. ఇంత మంచి పత్రిక నడుపుతున్నందుకు మీకు అభినందనలు.

రఘురామ శర్మ, గవర్నర్ పేట, విజయవాడ.

మానససరోవర యాత్ర చదువుతుంటే వొళ్ళు గగుర్పొడుస్తోంది. చాలా సాహసపూరితమైన యాత్ర ఇది. భవిష్యత్తులో ఈ యాత్ర చెయ్యబోయేవారికి ఇది ఒక మార్గదర్శకం లాగా పనిచేస్తుందని నేను నమ్ముతున్నాను. ఈ యాత్ర అంతా ఒక పుస్తకరూపంలో తీసుకువచ్చే ఆలోచన ఏదైనా ఉందా?

శంభుప్రసాద్, ఆదినారాయణ, బెంగుళూరు

మానససరోవర యాత్ర విడియో చూసాను. చాలా క్లియర్ గా వుంది. చాలా మంచి క్వాలిటీ విడియో పెడుతున్నారు. మీ వ్యాఖ్యానం సూపర్బ్! మీ పత్రికకు మా ధన్యవాదాలు.

సీతామహాలక్ష్మి, చింతలపూడి

పోడూరిగారి మువ్వన్నెల రెపరెపలు సమయోచితంగా ఉంది. బాగా వ్రాసారు.

బాలకృష్ణ, నల్లకుంట, హైదరాబాద్

బాబూ రాజేంద్రప్రసాద్ గారి గురించి బుచ్చిరాజు గారు వ్రాసిన వ్యాసం బాగుంది. అలాంటి మహనీయుడిని స్వాతంత్ర్యదిన సందర్భంగా తలుచుకోవటం మనసుకి ఆనందాన్నిచ్చింది.

కృష్ణమూర్తి, విమల, మల్కాజిగిరి, హైదరాబాద్

మూడు అంకె మీద వేమూరిగారి వ్యాసం చాలా ఇంటరెస్టింగ్ గా వుంది. ఆయనకు ధన్యవాదాలు.

పరమేశ్వరరావు, కొండపల్లి, విజయవాడ

దక్షయజ్ఞం నేపథ్యంలో పోతన గారు వ్రాసిన పద్యానికి దంతుర్తివారి భాష్యం బావుంది.

సుబ్రహ్మణ్య శాస్త్రి, గుంటూరు

పెండ్యాల వామన్ రావు గారి గురించి ఎన్నో తెలియని విషయాలు మాకు తెలిసాయి తుమ్మూరి వారి రచన ద్వారా. ఆయనకు ధన్యవాదాలు.

యాదగిరి, వరంగల్

'ఒకటే వృత్తి' కథగమ్మత్తుగా వుంది. భగవంతుని ప్రేమకు స్వ పర భేదాలుండవని ఆదూరి హైమవతి గారు చక్కగా వ్రాసారు. అలాగే ఇంద్రగంటి వారి 'ప్రేమంటే ఇంతే' రొమాంటిక్ గా వుంది.

కె అప్పారావు, అనకాపల్లి

క్రీ.శ. 2800లో ఇలా జరగవచ్చు అనే కల్పనతో పింగళి గోపి గారు చేసిన రచన ఆసక్తికరంగా వుంది. రచయితకు ధన్యవాదాలు.

రవికుమార్, కల్పన, అనంతపురం

ప్రకృతిలో మమేకమైపోవడమే మోక్షం అని చక్కగా చెప్పారు భువనచంద్ర గారు. చక్కటి కథనం.

శేషసాయి, పద్మ, రాజమహేంద్రవరం

'కృష్ణం వందే జగద్గురుం' ద్వారా మాకు ఉడుపి దేవాలయం గురించి మాకు బాగా వివరించారు కొత్త రామానందం గారు. ఆయనకు మా నమస్కారాలు. అలాగే 'ప్రహేళిక' బావుంటోంది. మీకు ధన్యవాదాలు ఇలాంటివి ప్రచురిస్తున్నందుకు.

వామనరావు, లక్ష్మి, చెన్నై

# కల నిజమాయె - ముక్తినాథ్ మానస సరోవర యాత్ర



సాగా అనే పట్టణం జేరాము కదా. కొంచెం ఆల్టిట్యూడ్ సిక్ నెస్ మొదలయిందా అనిపించింది. షెర్పాలు వచ్చి అందరికీ 'డయామాక్స్' మాత్రలు ఇచ్చి వేసుకోమన్నారు. చెక్ పోస్ట్ దగ్గర ఫోటోలు తియ్యవద్దు,ఇక్కడ చాలా స్ట్రిక్ట్ గా ఉంటారని చెప్పారు మర్నాడు చూడబోతున్న మానససరోవరం గురించి కలలుకంటూ నిద్రపోయాం.

పొద్దున్నే లేచి తయారయిపోయి వచ్చి బస్సులో కూర్చున్నాము. జయజయ మహాదేవ నినాదాలతో బస్సు బయలుదేరింది. సాగా ఊరినుంచి మానససరోవరం సరస్సు దూరం 450 కిలోమీటర్లు ఉంటుంది. రోడ్డు బాగుంటుంది కాబట్టి సుమారు 7 గంటలలో చేరుకోగలం. అందరికీ ఎంతో ఉత్సాహంగా ఉంది. ఇంత కష్టపడి, ఇంత డబ్బు వెచ్చించి చేస్తున్న ప్రయాణం గమ్యం ఇవాళ చేరుకోబోతున్నాం అని ఆలోచన రాగానే మనసు పులకించిపోతోంది.

ఈ మానససరోవరం విశేషాలు కొన్ని ముచ్చటించుకుందాం. ఇది హిమాలయాలలో ఉన్న ఒక పెద్ద మంచినీటి సరస్సు. బ్రహ్మదేవుడు తన మనసులో సంకల్పించి సృష్టించిన సరస్సు అని ప్రతీతి. ఈ సరస్సు వైశాల్యం సుమారు 400 చదరపు కిలోమీటర్లు. దీని చుట్టుకొలత 88 కిలోమీటర్లు. సముద్రమట్టం నుంచి 4,590 మీటర్లు అంటే 15,060 అడుగుల ఎత్తులో ఉంటుంది. కైలాష్ హిమానీనదం (గ్లేషియర్) నుంచి దీనికి నీరు వస్తుంది. ఈ సరస్సు హిందువులకు, బౌద్ధులకు, జైనులకు ఎంతో పవిత్రమైనది. ఈ సరస్సులో స్నానం చేసినా, సరస్సులోని నీరు తాగినా మానవులు తమ జన్మజన్మల పాపాలనుంచి విముక్తి పొందుతారని, మరణానంతరం శివ సాయుజ్యం పొందుతారని, పునర్జన్మ ఉండదని గాఢ నమ్మకం. ఆ నమ్మకం తోటే ఎన్నో ప్రయాసలకోర్చైనా జీవితంలో ఒక్కసారైనా ఈ యాత్రకి ప్రజలు వస్తువుంటారు. అంత ముఖ్యమైన యాత్ర చేసేందుకు శారీరక శక్తి, మానసిక శక్తి మరియు ఆర్థిక శక్తి



ఇచ్చిన ఆ భగవంతుడికి ఎన్నో కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు!

ఈరోజు ప్రయాణం చాలా సాఫీగా సాగిపోతోంది, ఆహ్లాదకరమైన ప్రకృతి, చుట్టూ కొండలు, పక్కనే తోడు వస్తున్న బ్రహ్మపుత్రా నది యొక్క ఉపనది, బస్సులోని తోటి భక్తులు చేసే రుద్ర నమక పారాయణం, జీవితంలో ఇంతకన్నా ఇంకేం కావాలి చెప్పండి.

ఈరోజు ప్రయాణంలో ఒక ఆసక్తికరమైన సంఘటన జరిగింది. ప్రయాణం మధ్యలో ఒక చెక్ పోస్ట్ వచ్చింది. అక్కడ బస్సు స్లో అయ్యింది. మా బ్యాచ్ లో ఉన్న ఒక యాత్రికుడు పొరపాటున ఆ చెక్ పోస్ట్ ఫోటో తన కెమేరాతో క్లిక్ అనిపించాడు. అది కాస్తా వాళ్ళు చూసేశారు. ఇంకేముంది, యాత్రికుడ్ని దింపి, అతని కెమెరా 'సీజ్' చేసారు. కెమెరా లేకుండానే వెళ్లిపొమ్మన్నారు. మీకు గుర్తు ఉండేవుంటుంది, అస్సలు వాళ్ళ చెక్ పోస్ట్ లదగ్గర ఫోటోలు తీస్తే వాళ్ళు ఊరుకోరని, కెమెరాలు లాగేసుకుంటారని. ముందుగానే చెప్పారు. గత్యంతరం లేక ఆ కెమెరా లేకుండానే మా బస్సు బయలుదేరింది. ఓ పావుగంట అలా వెళ్ళామో లేదో మా వెనుక లైట్లు ఫ్లాష్ చేసుకుంటూ పోలీసు జీపు వస్తూ కనపడింది. మా డ్రైవరు బస్సును పక్కకి తీసి ఆపాడు. ఆ జీపు కూడా మా పక్కనే ఆగింది. వాళ్లకు జాలి



వేసిందో ఏమో, ఆ యాత్రికుడికి తిరిగి కెమెరా ఇచ్చేసి, తిరిగి వాళ్ళ జీప్ లో వెళ్ళిపోయారు. హమ్మయ్య! కెమెరా ఇచ్చేశారు అని అందరం ఆనందించాం. ఈ విషయం మీరందరూ గుర్తు పెట్టుకోండి. వాళ్ళ చట్టాలు ఉల్లంఘించడం మంచిది కాదు. వాళ్ళు కెమెరా తిరిగి ఇవ్వకపోతే మనం చేసేదేమీ లేదు కదా! అన్నారు మా గైడ్లు.

దారి మధ్యలో ఒక చోట ఫ్యూయల్ నింపుకోటానికి డ్రైవర్ ఆపాడు. మామూలుగానే అక్కడే మా ప్యాక్డ్ లంచ్ ని షెర్పాలు ఇచ్చారు. లంచ్ తరవాత బస్సు మళ్ళీ బయలుదేరింది.

సాయంత్రం సుమారు 4 గంటల 30 నిముషాలకి మాకు మానససరోవర దర్శనం అయ్యింది. ఆహా! ఏమి మా ఆనందం, వర్ణనాతీతం!

మా మానససరోవర పరిక్రమ ఇప్పుడు ప్రారంభం అవబోతోంది. ఒక చెక్ పోస్ట్ దగ్గర మా బస్సు ఆపి, మమ్మల్నందర్నీ



ఇంకో బస్సులోకి మారమన్నారు. ఈ బస్సు ఇంకా ముందుకి వెళ్ళటానికి పర్మిట్ లేదట. అలా బస్సు మారుతున్నప్పుడు, అక్కడికి కొందరు ఆడవాళ్ళు ప్లాస్టిక్ క్యాన్లు (డబ్బాలు) అమ్మటానికి వచ్చారు. అందరం రెండు రెండు డబ్బాలు కొనుక్కున్నాం, మానససరోవరం నీళ్ళు నింపుకుందామని.

మారిన బస్సులో మానససరోవర పరిక్రమ మొదలయ్యింది. ఈ పరిక్రమ సుమారు రెండు గంటలు పడుతుంది. మానససరోవర పరిక్రమ చేస్తే ఎంతో పుణ్యమని భక్తుల ప్రగాఢ నమ్మకం. అంటే ఈ పరిక్రమ సరోవరం చుట్టూ బస్సులో తిరగడం అన్న మాట.

రోడ్డు మాత్రం చాలా అధ్వాన్నంగా ఉంది. రాళ్ళు రప్పలతో ఉన్న కచ్చా రోడ్డు. బస్సు అటూ ఇటూ ఊగిపోతూ వెళ్తోంది. అందరూ తమతమ సెల్ ఫోన్లలో సరోవర అందాలను బంధించుకుంటున్నారు. ఈ కుదుపులకి విడియో అంత బాగా రాకపోవచ్చు. కానీ ఇవేమీ మా ఫోటో సెషన్లకు అడ్డు కాలేదు.

ఆగస్టు నెల కావటంతో ఆకాశం మబ్బులు కమ్మి 'క్లియర్'గా లేదు. దాంతో అక్కడ నుంచి దూరాన కనపడవలసిన కైలాష పర్వతం కానరాలేదు. కొంచెం నిరాశ చెందాం అని చెప్పక తప్పదు.




పరిక్రమ మధ్యలో ఒకచోట సరస్సు ఒడ్డున బస్సు ఆపాడు డ్రైవర్. అందరూ బిలబిలమంటూ బస్సు దిగి సరస్సు దగ్గరకి పరుగులు దీశాం. తృప్తిగా దోశిళ్ళతో మానససరోవర నీరు తాగాం. నెత్తి మీద చల్లుకున్నాం. మా దగ్గర ఉన్న ప్లాస్టిక్ క్యాన్లలో నింపుకున్నాం. తనివితీరా ఫోటోలు తీసుకున్నాం. ఓ పావుగంట దాకా అక్కడ గడిపాం.

ఇంక చాలు రండి అన్నట్టుగా మా బస్సు డ్రైవర్ హారన్ కొట్టాడు. వదలలేక వదలలేక వచ్చి బస్సు ఎక్కాము. సుమారు రాత్రి 8.30 గంటల దాకా మా పరిక్రమ కన్నుల పండువుగా సాగింది. ఆ పరిక్రమ ముగించి సుమారు రాత్రి 10 గంటల ప్రాంతంలో మేము డార్చేన్ ఊరు చేరాం. ఈ ఊరు కైలాష్ పర్వతానికి ముఖద్వారం లాంటిది. రాత్రికి ఇక్కడే బస చేయాలి. రూములు ఒక మోస్తరుగా ఉన్నాయి. ఇక్కడ కూడా నలుగురికి కలిపి ఒక రూము ఇచ్చారు.

కొంచెం దూరం అంటే సుమారు ఓ అర కిలోమీటర్ దూరంలో ఉన్న హిమాలయ కైలాష్ హోటల్ లో మాకు భోజనాలు ఏర్పాటు చేయబడ్డాయి. అక్కడ మధుబన్ వాళ్ళ భోజనశాల ఉంది. వెళ్లి వేడి వేడిగా వడ్డించిన భోజనాలు చేసాం. ఆఫ్ కోర్స్, మనమే వెళ్లి బఫే భోజనాలు వడ్డించుకోవాలి అనుకోండి. నిజంగా ప్రాణం లేచి వచ్చింది అనిపించింది ఈ బోజనాలు చేసింతర్వాత. అన్నదాతా సుఖీభవ అని అందరం ఆ 'మధుబన్' సంస్థని ఆశీర్వదించాము. తప్పక మా దీవెనలు వారికి చేరేవుంటాయి.

తిరిగి మా హోటల్ రూమ్ కి వచ్చి నిద్రకి ఉపక్రమించాం.

(మళ్ళీ వచ్చే నెల కలుద్దాం)

# కొత్త రామానందం



## శరణు శరణు గణాధిపా

**వక్రతుండ మహాకాయ! కోటి సూర్య సమప్రభ! నిర్విఘ్నం కురు మే దేవ! సర్వ కార్యేషు సర్వదా! . అంటూ ఎంతో భక్తీ శ్రద్ధలతో వినాయ-కుడిని పూజించే పర్వదినం వినాయక చవితి. ఈ రోజున పాలవెల్లిని అలంకరించడం .. పత్రితో పూజ చేయడం -- కుడుములను నైవేద్యం పెట్టడం ,,,భక్తి శ్రద్ధలతో కథ వినడం -- అన్నీ ప్రత్యేకంగానే ఉంటాయి. మన దేశవ్యాప్తంగా బొజ్జ గణపయ్యకు బోలెడు ఆలయాలు.**

భారతీయులకు గణపతి ఒక జీవనాధారమైన మూలతత్వం. అందువల్లే ప్రతి పనికీ ముందు గణపతిని పూజించి, తమ పనులు నిర్విఘ్నంగా చేసుకుపోతుంటారు. బలం, బుద్ధి రెండింటికి మూలాధారంగా ఉన్న గణపతిని ఒక ప్రబల పృధ్వీ తత్వంగా పరిగణిస్తుంటారు.

గణపతి సిద్ధిని, బుద్ధిని, బలాన్ని, ఐశ్వర్యాన్ని అన్నింటిని అనుగ్రహించగల పరబ్రహ్మంగా ఎందరో భక్తుల విశ్వాసం. విద్యాబుద్ధులు కలగడానికి సిద్ధి బుద్ధి రూపుడైన గణపతిని ఎందఱో ఉపాసిస్తారు. స్వామి విఘ్న గణపతియే కాదు, ఆయన వరద గణపతి కూడా. గణపతి ఉపాసన వల్ల శత్రు క్షయమౌతుందనీ, రాక్షస బాధలు ఉండవనీ పలువురి అమ్మకం. గణపతి కరుణా సముద్రుడనీ, పదవీ భ్రష్టులకు, రోగపీడితులకు సాంత్వన ప్రసాదిస్తాడని ఎన్నో కథలున్నాయి. సాధకుడు ఆరోగ్యవంతుడై సుఖసంపదలు పొందుతాడని శాస్త్ర వచనం.

వినాయకుడి పుట్టుక గురించి విచిత్ర పురాణ కథలు ఉన్నాయి. మత్స్య, శివ పురాణాల ప్రకారం నలుగుపిండితో చేసిన బొమ్మకు పార్వతి ప్రాణం పోయడం, ఆ బాలుడు లోనికి వెళ్ళే శివుణ్ణి అడ్డగించడం, కోపంతో శివుడి ఆ బాలుడి తలను ఖండించడం, విషయం తెలిసి విలపించే పార్వతి ప్రార్ధనపై శివుడు ఏనుగు తలను, ఆ బాలుడి మొండానికి అతికించి, తిరిగి బ్రతికించడం తెలిసిన గాధే. అప్పటినుంచి



ఆ బాలునికి గజాననుడనే పేరు వచ్చింది. విఘ్నం పొంది తిరిగి బతికాడు కాబట్టే, చెడు పనులకు విఘ్నకారీ - సత్కార్యాలకు కలిగే విఘ్నాలను నాశనం చేస్తాడు కనుక విఘ్నేశ్వరుడని అంటారు. ఈయన ప్రమద గణాలలో శ్రేష్ఠుడు కాబట్టి గణాధిపతి అనీ, గణ దేవతలైన ద్వాదశాదిత్యులకు, అష్ట వసువులకు ప్రభువు కనుక గణపతి అనే పేర్లు కలిగాయని చెబుతారు. 'గణ' శబ్దానికి వాక్కు అనే పర్యాయపదం ఉండటం చేత , 'గణానాం త్వా గణపతిగ్ం ... జ్యేష్ఠరాజం బ్రహ్మణాం ...' అనే ఋగ్వేద మంత్రంలో గణపతిని బృహస్పతిగాను, విద్యాధిదేవత గానూ స్తుతించారు. అందుకే ఆయన వ్యాసునికి కావ్యలేఖకుడయ్యారు. ఆయన శరీరం నరాకారం. ముఖం గజవదనం.



ఈయనకు మూషికం ఒక వాహనం. సౌబరి అనే ఋషి భార్య పేరు మనోమయ. ఆమెను క్రౌంచుడు అనే గంధర్వుడు మోహించి, బలాత్కారించబోయాడు. ఆ ఋషి ఆ గంధర్వున్ని మూషికంగా జన్మించమని శపించాడు. గంధర్వుడు శాప విమోచనం కోరగా నీవు ఎలుక రూపంలో వినాయకుడి వాహనం అవుతావని చెప్పినట్లు శాస్త్ర వచనం.

గణపతిని ధాన్యాధిదేవతగాను, రైతులు సృష్టించిన గ్రామ్య దేవతగాను పూజిస్తారు. ఎలుక పంటలను నాశనం చేసేది. వినాయకుని వాహనం అయినపుడు అది అతని ఆధీనంలో ఉంటుంది. కనుక రైతుల మూషికవాహనుని ఆరాధించడం విశేషం. 'ఎలుకని ఆధీనంలో ఉంచుకుని మా ధాన్య సంపత్తిని రక్షించు' అని ప్రార్థించడం గమనార్హం.

వినాయకుడి భారీ కాయానికి కారణం పంచ భూతాల్లో స్థూలమైనది పృథ్వియే కనుక పృథ్వియే అతని బరువు మోయగలదు. మిగిలిన నాలుగు భూతాలు సూక్ష్మమైనవి. ఏనుగు తొండం వంకరగా ఉంటుంది. సాధారణంగా ఆహారం స్వీకరించేటప్పుడు మాత్రమే అది తొండం చాపుతుంది. అందుకే వక్రతుండుడని పేరు.

గణపతికి ఉన్న రెండు దంతాలలో ఒకటి విరిగిపోయింది. ఆ విరిగిన దంతంతోనే మహాభారతాన్ని వ్యాసులవారు చెప్పుతుండగా వేగంగా వ్రాసేవారు. ఆయన కళ్ళు అమాయకంగా, స్వచ్ఛంగా ఉంటాయి. ఆ కళ్ళను నిశితంగా చూస్తే పరిపూర్ణమయిన జ్ఞానం గోచరిస్తుంది. స్వామివారికి పెద్ద చెవులుంటాయి. ఎక్కువగా వింటూ తక్కువగా మాట్లాడాలని అర్థం. ఆయనకు నాలుగు హస్తాలు. అవి నాలుగు ప్రయోజనాలకు చిహ్నం. ఒక చేతిలో గొడ్డలి - అది బంధనాలను ఛేదించుటకు చిహ్నం. రెండవ హస్తంలో పాశం - ప్రేమ ద్వారా మనందరినీ దైవత్వం వైపు లాగుతున్నాడు. మరో హస్తంలో అభయముద్ర - అంటే జీవితాన్ని నిర్భీతిగా గడపండి అని ప్రబోధిస్తుంది. ఇక నాల్గవ హస్తంలో మోదకం ఉన్నది - ఆయన మోదక ప్రియుడు.

వినాయకుడు ముఖ్యంగా పిల్లల దేవుడు. గుజ్జు రూపం, ఏనుగు తొండం, ఎలుక వాహనం చూస్తే పిల్లలకు ఆకర్షణ. పత్రిని, సంభారాన్ని సేకరించి పూజ

చేయడం ద్వారా వ్యావహారిక జ్ఞానం, పూజా విశేషాలు, వ్రత విశేషాలు తెలుస్తాయి. తమ పాఠ్య పుస్తకాలను స్వామివారి వద్ద పెట్టి పూజించడం ద్వారా చదువుల్లో స్వామి సహాయపడతారనే ఆత్మవిశ్వాసం కలుగుతుంది.

సంఖ్యా శాస్త్ర ప్రకారం గణపతికి 21 సంఖ్య అంటే ప్రీతికరం అంటారు. అందుకే గణపతిని 21 రకాల ఆకులతో, గరికపోచలతో పూజించి 21 కుడుములు నివేదన చేస్తారు. సమస్త ఓషధులకు, వాటి శక్తులకు ఓషధీపతిగా గణపతిని అర్చిస్తారు. పంచ భూతములు, పంచ తన్మాత్రలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, మనస్సు (5+5+5+5+1) వీటితో కూడిన సూక్ష్మ శరీరంతో వినాయకుడనే పరబ్రహ్మను అర్చిస్తాను అనేందుకు 21 పత్రాల పూజ సంకేతం. ఇది ఆధ్యాత్మిక అర్థం కాగా ఈ 21పత్రాలతో పూజించుట వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతందనేది ఆధునికులు సైతం అంగీకరిస్తున్న సత్యం. వినాయక పూజలో పసుపు, కుంకుమ, కర్పూరం ఉన్నప్పటికీ, పత్రాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. శ్రీహరి అవతారాలు దశ(10) అవతారాలైతే శంకరుని అవతారాలు ఏకాదశ(11) కాబట్టి శివకేశవ అవతారాల మొత్తం 21 పత్రాలతో ఏకవింశతి(21) పత్రపూజ



చేయాలని పెద్దలు నిర్ణయించారు. గణేశుని పూజించినపుడు కొబ్బరికాయను కొడతారు. కొబ్బరికాయను పగలకొట్టడంలో అంతరార్థం ఉన్నది. కొబ్బరికాయ అహాన్ని సూచిస్తుంది. అహాన్ని బద్దలుకొట్టడం కష్టం. అహాన్ని బద్దలుకొడితే ఆనందమనే తియ్యని నీరు లభిస్తుంది. గణేశ పీఠం దగ్గర భగవంతుని సాక్షిగా మన అహాన్ని బద్దలు కొట్టాలి. వినాయక చవితినాడు మట్టి ప్రతిమనే ఆరాధించడం శ్రేష్టం. వరసిద్ధి వినాయకుని పూజానంతరం గంగలో నిమజ్జనం చేస్తాం. హాస్యరసాధిపతి స్వామివారు. ఆ స్వామి ముందు భక్తితో గుంజీలు తీయడం ఈయనకు ప్రీతికరం అంటారు. అల్లా చేస్తే గణపతి సంతుష్టుడై మన అభీష్టాలు చేకూరుస్తాడు.

వినాయక చవితి నాడు చంద్రుని చూడడం వల్ల లేనిపోని అపవాదాలకు గురి అవుతారనీ, శ్రీకృష్ణుడు కూడా అలాంటి అపనిందలకు గురి అయ్యాడనీ శమంతకమణి గాథ తెలియజేస్తుంది. ఆ దోష పరిహారార్థం వ్రత కథ చదివి అక్షింతలు తలపై వేసుకుంటారు.

సిద్ధి, బుద్ధి ఇద్దరినీ వినాయకుని భార్యలుగా వ్యవహరించడం ఒక సాంప్రదాయంగా వస్తున్నది. ఆ సిద్ధి బుద్ధి సమేతుడైన వినాయకుని యథావిధి పూజించినట్లయితే సర్వాభీష్టాలు సంపూర్ణంగా నెరవేరుతాయని చెబుతారు. ఆ స్వామి స్తోత్ర ప్రియుడు. మంగళ, శుక్ర వారములు ఆయనకు ఇష్టమైన రోజులు. వైష్ణవులు గణపతి పూజ చేయరు. 'విష్వక్సేనుడిని పూజిస్తారు. బౌద్ధులు గజాననుడు అని పిలుస్తారు.

తమ కుమారులిద్దరిలో గణాధిపత్యం ఎవరికీ ఇవ్వాలో తెలియక,

శివుడు వారికి పరీక్ష పెట్టాడు. ముల్లోకాలకు ప్రదక్షిణ చేసి కైలాసానికి ఎవరు ముందుగా తిరిగి వస్తే, వారికే గణాధిపత్యం లభిస్తుందని చెప్పా డు. ఆ మాటలకు సంతసించి తన బుద్ధి కుశలతలతో, మాతాపితలపై ఉన్న భక్తి తో వారికి ముమ్మారు ప్రదక్షిణ చేసి, మూడు లోకాలు తిరిగివచ్చినంతగా ఫలితం పొంది తల్లితండ్రుల ప్రేమకు పాత్రుడయ్యాడు. ఈశ్వరుడు భాద్రపద శుద్ధ చతుర్థి నాడు వినాయకునికి గణాధిపత్యాన్ని ఇచ్చి ఆశీర్వదించాడు. అప్పటినుంచి ఆ రోజుని వినాయకుని పండుగగా జరుపుకుంటున్నారు. బ్రహ్మదేవుడు ఆయన్ని ప్రథమ పూజ్యుడిగా చేశాడు. అందుకనే ఏ కార్యం తలపెట్టినా ముందుగా గణేశుని ప్రథమంగాపూజించాలి.

వినాయకుడు అనాది కాలం నుంచి వస్తున్న దేవుడు. త్రిపురాసురుని సంహరించేందుకు శివుడు, మహిషాసురుని సంహరించేందుకు పార్వతి, రావణుని వధించుటకు రాముడు, మహాబలిని చాకచక్యంతో బంధించుటకు విష్ణువు, సృష్టి చేసేందుకు బ్రహ్మ గణపతిని అర్చించి ఆయన అనుగ్రహం పొందియున్నారు.

**సత్య ప్రమాణాల స్వామి - కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి**

చిత్తూరు జిల్లాలో కాణిపాకం



గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి మూలవిరాట్టు ఆకారం క్రమం క్రమంగా పెరుగుతున్న దేవుడు. ఇచ్చట వినాయకస్వామి పుట్టుటకు కొంత చరిత్ర వుంది.

కాణిపాక గ్రామాన్ని పూర్వం 'విహారపురి' గా వ్యవహరించేవారు. ఈ గ్రామంలో మూగ, గుడ్డి, చెవిటి అంగ వైకల్యం కలిగిన ముగ్గురన్నదమ్ములు ఉండేవారు. వారు స్వాదు స్వభావులు, సన్మార్గ వర్తనులు. వారు స్వయం శక్తిపై ఆధారపడి, ముగ్గురు కలిసి అక్కడ ఉన్న చిన్న బావిలో ఏతం తొక్కి నీళ్ళు తోడి భూమిని సాగుచేసి అందుపై వచ్చే ఫలసాయాన్ని అనుభవించేవారు.

ఒకపర్యాయం ఆ ప్రాంతంలో తీవ్ర అనావృష్టి ఏర్పడింది. బావుల్లో నీళ్ళు అడుగంటిపోయాయి. ఆ సోదరులు తమ బావిని లోతు చేసే ప్రయత్నంలో తవ్వసాగారు. భూమి తవ్వుతున్నప్పుడు భూమి పొరల్లో ఉన్న స్వయంభువు అయిన వినాయక దేవుని విగ్రహం తలపై తగిలి ఆ ముప్పురిపై రక్తం చిమ్మింది. అంతే- అద్భుత దివ్య ప్రభావ సంపన్నమైన ఆ స్వామి పవిత్ర రక్తం వారిపై పడగానే, వారి అంగ వైకల్యం పూర్తిగా తొలగిపోయింది. అంతే కాదు, నూతన శోభలతో, జవసత్వాలతో కూడిన సుందర రూపాలు ప్రాప్తించాయి.

ఈ విషయాన్ని తెలుసుకుని, అచ్చట ఆ గ్రామస్తులు స్వామి బయల్పడిన స్థలానికి వెళ్లి, భక్తి ప్రపత్తులతో పూజలు చేసి స్వామిని అర్చించుటకు కొబ్బరి కాయలు కొట్టి అందలి జలంతో స్వామిని అభిషేకించారు. భక్తులు కొట్టిన అభిషేక నారికేళ జలం అ పొలంలోని 'కాణి' అంటే నాల్గవ వంతు మేర పారడంతో, ఆ స్థలానికి 'కాణిపారకం' అనే పేరు ఏర్పడింది. కాలక్రమాన అది 'కాణిపాకం' గా మారింది.

ఆ గ్రామస్తులు, ఆ బావి నుంచి సేకరించిన విగ్రహాన్ని తొలుత చిన్న గుడిలో ఉంచి పూజలు చేస్తూ, స్వామి అనుగ్రహం పొందారు. స్వామి వారి ఖ్యాతి మెల్లమెల్లగా పక్క గ్రామాలకు పట్టణాలకు తెలిసింది. భక్తుల రాక పెరిగింది. పుణ్యక్షేత్రంగా మారిపోయింది. పిలిచే భక్తుడికి పలికే దేవుడని భక్తుల నమ్మకం.

ఇచ్చుట ఆ ప్రాంత పాలకుడైన

కులోత్తుంగ చోళుని కాలంలో 1100 సంవత్సరాల క్రితం పెద్ద ఆలయం నిర్మాణం జరిగినట్టు తెలియవచ్చింది. ఆ తర్వాత విజయనగర రాజుల కాలంలోనూ, ఆలయాన్ని విస్తృతం చేసారు. అయితే గత రెండు దశాబ్దములలో ఆలయ అభివృద్ధి గణనీయంగా జరిగింది. ఈ ఆలయ నిర్వహణ ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు నిర్వహిస్తున్నారు.

స్వామివారి లీలలు

శంఖువిఖితులనే ఇద్దరు సోదరులు కాణిపాకం స్వామిని దర్శించుకునేందుకు కాలినడకన తమ గ్రామం నుంచి బయలుదేరారు. మార్గమధ్యంలో విఖితుడు ఆకలి బాధ తట్టుకోలేక అక్కడ ఉన్న మామిడిపండును కోసుకుని తినబోయాడు. అందుకు అతని సోదరుడు శంఖు వారించాడు. దొంగతనం చేసినట్లు అవుతుందని అన్నాడు. ఆకలికి తట్టుకోలేని విఖితుడు పండు తినేశాడు. అతని చర్యకు కోపగించుకున్న శంఖు ఆ ప్రాంత రాజు గారికి ఫిర్యాదు చేసాడు. రాజుగారు విఖితుని శిక్షించి వాని చేతులు నరికించేశాడు. తాను చేసిన దొంగతనానికి పశ్చాత్తాపపడుతూ కాణిపాకం వరసిద్ధి వినాయకుని దర్శనానికి వెళ్లి అక్కడి ఆలయ కోనేరులో స్నానం చేస్తుండగా స్వామివారి



కృపతో చేతులు రెండూ మరలా వచ్చాయి. వినాయకుని అనుగ్రహంతో చేతులు వచ్చాయి కాబట్టి ఆ నదికి బహుదా నది అనే పేరు వచ్చింది.

గర్భగుడిలో మనకు స్వామి విగ్రహం చుట్టూ నిరంతరంగా నీరు ప్రవహిస్తున్న దృశ్యం కానవస్తుంది. ఎన్ని కరువు కాటకాలు వచ్చినప్పటికీ, స్వామి చుట్టూ ఉన్న నీరు తగ్గదట. వర్షాకాలంలో అయితే, పొంగి పొరలుతుంది. అంతే కాదు, స్వామివారి తలపై ఉన్న గాటును కూడా మనం చూడవచ్చును.

పరమ భక్తురాలైన బెజవాడ లక్ష్మమ్మ మున్నగువారు గతంలో సమర్పించుకున్న వెండి కవచాలు ఈరోజు కురచై అలంకరణకు సరిపోకపోవడం గమనిస్తే విస్మయం కలుగుతుంది.

స్వామి ముందు 'సత్య ప్రమాణం' చేసి, అది నెరవేర్చకపోతే స్వామి ఎంతమాత్రం సహించరని, అటువంటి అబద్ధాలకోర్లను, అసత్య ప్రమాణాలు చేసేవారిని స్వామి కఠినంగా శిక్షిస్తారనే భావం. కుటుంబ సభ్యులలో చెడు అలవాట్లకు గురి అయినవారిని మంచి మార్గంలో పెట్టడానికి స్వామిముందు ప్రమాణం చేయించేవారు ఈనాడు కూడా ఎందరో ఉన్నారు.

బ్రహ్మోత్సవాల వైభవం

ప్రతి సంవత్సరం స్వామికి ఎంతో వైభవంగా వినాయక చవితి మొదలు 21 రోజులపాటు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలలో స్వామివారిని ప్రతి రోజూ ఒక్కో వాహనంపై ఊరేగిస్తారు. వీటిని తిలకించడానికి భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు.

కాణిపాకం ఆలయంలో గర్భగుడికి కుడి పక్కన వీరాంజనేయస్వామివారి సన్నిధి, ఆలయం వెలుపల పెద్ద కోనేరు, క్యూ కాంప్లెక్స్, గుడిలో విక్రయ శాల ఆలయానికి సమీపంలో మణికంఠేశ్వర నిలయం, శ్రీ వరదరాజస్వామి ఆలయాలు ఉన్నాయి. ఈ క్షేత్రంలోని అనేక లాడ్జీలు, సత్రాలూ ఉన్నాయి. ఈ పవిత్ర క్షేత్ర మహిమ మరింత పెరుగుతుందని పండితాభిప్రాయం.

**ఓం గం గణపతయే నమః**

డి 2-9-2019 న వినాయకచవితి

# భువనచంద్ర



## పట్టిందల్లా బంగారం

రాజుగారి దివాణం పరమ చెత్తగా ఉంది. రాజుగారంటే దేశాల్ని ఏలే రాజుగారు కాదు. ఆయన పేరు రామచంద్రరాజు. పూర్వీకులు జమీందార్లు. రామచంద్రరాజుగారి తాత గారికి సిటీ అంటే మోజు. అందుకని ఊళ్ళో వున్న వెయ్యి ఎకరాల్నీ అమ్మేసి, సిటీలో పదెకరాలు కొని మధ్యలో బ్రహ్మాండమైన బిల్డింగు కట్టించాడు. ప్రస్తుతం దాని వ్యవహారమంతా రామచంద్రరాజు గారి చేతుల్లో ఉంది. రామచంద్రరాజు గారికి ఫారిన్ అంటే మోజు. దాని వల్ల యవ్వనంలో హాయిగా 'రష్యా' లో చదువు నిమిత్తం వెళ్లి, సంవత్సరాలపాటు అక్కడే గడిపి, యీమధ్యే ఇండియా వచ్చాడు. అదీ తండ్రిగారైన వీరవేంకట సత్య వరప్రసాద రాజు గారు గతించడంతో.



బంగళా బ్రహ్మాండంగా వుంది. 22 గదులు. అది కాక, అతి విశాలమైన డైనింగ్ హాల్సూ, నాలుగు డ్రాయింగ్ రూమ్స్, ఓ అత్యంత విలాసమైన క్లబ్ హాలూ, ఇతర హంగులతో మతిపోయేట్టు వుంది. రామచంద్రరాజు గార్ని అందరూ 'బుల్లిరాజు' అని పిలుస్తారు. సదరు బుల్లిరాజు గారు అత్యంత కోపంగా ఉన్నారివ్వాళ. మేనేజరు కలిదిండి రాజుగారు చేతులు పిసుక్కుంటున్నారు, బుల్లిరాజు గారి అకారణ కోపానికి తెలీక.

"బుల్లిరాజు గారూ, ముందు మీరు భోంచెయ్యండి.పెద్దలు ఆహారం - వ్యవహారం అన్నారు. దానికి అర్థం ముందు ఆహారం తీసుకున్న తరవాతే వ్యవహారాలు నడపాలని. ఎందుకంటే, ఆకలిగా వుండేప్పుడు తీసుకున్న నిర్ణయాలు ఎప్పుడూ నష్టాన్నే కలిగిస్తాయి. తృప్తిగా భోంచేశాక తీరిగ్గా నిర్ణయాలు తీసుకుంటే అవి సదా శుభాన్నే ఇస్తాయి" అనునయంగా అన్నారు అమ్మాజమ్మగారు, అంటే బుచ్చిరాజుగారి మాతృమూర్తి.

"సరే..." అంటూ లేచారు బుచ్చిరాజుగారు. ఆయనలో గొప్పతనం ఏమంటే తల్లిదండ్రుల్ని నొప్పించరు. అలాగని వారు చెప్పినట్టూ చెయ్యరు. నొప్పించక

తానొవ్వక అనుకున్నది చేసి తీరే రకం.

అలాగని ఆయన సౌజన్యమూర్తేమీ కాదు. ముక్కోపి. 'త్వేర్' యూనివర్సిటీలో చదివేటప్పుడు అయిదారుగురు రష్యల్ని (స్టూడెంట్లని)చితకబాది నెగ్గుకొచ్చిన ఘనత ఆయనకున్నది.

మేనేజరు కలిదిండిరాజు గారు మనసులోనే అమ్మాజమ్మ గారికి కృతజ్ఞతలు చెప్పుకుని బయటకి వచ్చాడు. ఆఫీసులో కూర్చోగానే ఆయనకి గుర్తొచ్చింది 'సూర్జాణ" అని పిలవబడే సూర్యనారాయణ.

బుచ్చిరాజుగారికి ఒకవిధంగా ఏకైక స్నేహితుడు. 'నా బొంద కానీ, ఇప్పుడు సూర్జాణని పిలిపించినా యీ బుల్లిరాజుని అతను కంట్రోల్ చెయ్యగలడా?" అనే అనుమానం కలిదిండి రాజుగారికి వొచ్చినా, 'ఏమీ చెయ్యకుండా వుండే కంటే ఏదో ఒకటి చెయ్యడం మంచిది' అన్న పెద్దలమాట ప్రకారం సూర్జాణికి కబురుపెట్టాడు. సూర్జాణ రాగానే పిలిపించిన కారణం వివరించారు.

******

"ఏవిటీ చెట్లు కొట్టించేస్తావా?" షాక్ తిని అన్నాడు సూర్జాణ.

"అదే నిర్ణయానికి వచ్చాను" ఎక్కడ చూసినా ఎండిపోయిన ఆకులు ... చెత్తచెత్తగా వున్నాయి. అసలీ చెట్లన్నీ కొట్టించి షాపింగ్ కాంప్లెక్సులు కట్టిస్తే లెక్కలేనంత ఇన్కమ్" తోటలో నడుస్తూ అన్నాడు బుల్లిరాజుగారు.

"బుల్లిరాజూ ..... మీకు డబ్బుకి కొదువ లేదు. రోడ్లు ఎక్స్టెంషన్లంటూ లక్షలాది చెట్లని నేషనల్ హైవే వాళ్ళు కొట్టించేసి రాదార్లు వేశారు. మంచిదే కాదన్ను. కానీ ఎన్ని చెట్లు కొట్టించారో అందులో పదో వంతు కాదుగదా అయిదో వంతు కూడా నాటించలేదు. ఇక అడవుల్నించి దొంగలు నరుక్కుపోయేవాటికి లెక్కా పత్రమే లేదు. బుల్లిరాజూ, పక్షులకి నిలువ నీడ లేదు. వాతావరణంలో ఆక్సిజన్ పాలు తగ్గిపోతోంది. ఓ వైపు కొండల్ని కంకరరాళ్ళుగా మారుస్తున్నారు. మరోవైపు చెరువుల్నీ, నదీ తీరాలని కూడా ఆక్రమించుకుని భూమిని కాంక్రీటు వనంగా మారుస్తున్నారు. అసలు చూద్దామన్నా ఇవాళ చెరువులేవీ? నదీనాం సాగరో గతిః అంటారు పెద్దలు. నది అనేది సముద్రంలో కలిసి తీరాలి. ఎందుకంటే యీ మంచినీరు సముద్రజలంలోని క్షారజలంలో కలిస్తేనే నీటి మేఘాలు ఉద్భవించేది. ఎక్కడికక్కడ ఆనకట్టలని నిర్మించి నదుల గమనాన్ని మనిషి ఆపేస్తున్నాడు. అన్నిటికీ ఫలితంగా భయంకరమైన వేడి! ఒకప్పుడు ఎండాకాలంలో మాత్రమే వుండే వేడి ఇప్పుడు అన్ని కాలాల్లో దూసుకొచ్చింది" ఆగాడు సూర్జాణ.

"ఇవన్నీ నాకెందుకురా? ఆమాత్రం నాకు తెలీదా? సీరియస్ గా అన్నాడు బుల్లిరాజు.

"నీకు తెలుసు. అందుకే చెబుతున్నాను. ఒక్కసారి మనం చిన్నతనంలో ఆ చెట్ల కింద ఆడుకున్న విషయం గుర్తుతెచ్చుకో. రేపో ఎల్లుండో నువ్వు పెళ్లి చేసుకోక తప్పదు. ఆ బాల్యాన్ని నీ బిడ్డలకు ఇవ్వవా? ఒక పని చేస్తావా... చెత్త సంగతి మొత్తంగా నాకు వదిలేయ్. సరేనా?" అనునయంగా బుల్లిరాజు గారి భుజాల మీద చెయ్యి వేసి అన్నాడు సూర్జాణ. బుల్లిరాజుగారు ఏమీ మాట్లాడలేదు. సూర్జాణ మనసులో ఆనందించాడు. బుల్లిరాజు మాట్లాడలేదంటే తన మాటకి 'ప్రస్తుతం' విలువిచ్చినట్టే.

****

పదిమంది కూలీలు ఆకులన్నిటినీ బస్తాల్లో కుక్కి మూటలు కడుతున్నారు. కొందరు చెట్లకింద పెరిగిన పిచ్చి మొక్కల్ని పీకి, నరికి స్థలాన్ని అద్దంలా శుభ్రం చేస్తున్నారు. ఆ పదెకరాల్లోని చెత్తా పన్నెండు లారీ లోడ్లు అయ్యింది. కానీ, దివాణం మాత్రం మహా చక్కగా ఆకర్షిస్తోంది. పనంతా చూసిన బుల్లిరాజుగారు సంతృప్తిగా తలవూపారు.

పైకి కోపంగా నిర్ణయం తీసుకున్నా, ఆ చెట్లకింద ఆడిన ఆటలు ఆయనకీ జ్ఞాపకం వున్నాయి.

*******

వారానికోసారి చెత్తని రెగ్యులర్ గా తొలగించే ఏర్పాటు చేశాడు సూర్ణాణ. బుచ్చిరాజుగారు సూర్ణాణకి మొదట్లో చెత్త తొలగించే నిమిత్తం పదివేలు ఇచ్చాడు. ఆయనకీ తెలుసు సూర్ణాణ కలిగినవాడు కాడని. ఆ తరవాత నెలకో రెండువేలు 'చెత్త తొలిగింపు' ఖర్చుగా సూర్ణాణకిమ్మని మేనేజరు కలిదిండి రాజుగారిక్కూడా ఆజ్ఞ ఇచ్చాడు గనక నెలనెలా సూర్ణాణకి డబ్బు నిక్కచ్చిగా అందుతోంది. బుల్లిరాజుగారికో ఆనందం, స్నేహితుడికి ఎంతోకొంత ఏదో పేరుమీద ఆర్థిక సహాయం చేస్తున్నానని.

******

బుల్లిరాజుగారి వివాహం చి||సౌ|| మంగయ్యమ్మారావు గారితో వైభవంగా జరిగింది. అందరూ గొప్ప గొప్ప బహుమతులే ఇచ్చారు. విందులూ, విలాసాలూ కూడా అటు కలిదిండి రాజుగారు, ఇటు సూర్ణాణ ఆధ్వర్యంలో చాలా గొప్పగా జరిగాయి.

వచ్చినవారందరికీ నచ్చిందేమంటే కొన్ని చెట్లకి పిల్లలూ పెద్దలూ కూడా ఊగడానికి ఉయ్యాలలు కట్టించడం. కొన్ని చెట్ల కింద గుండ్రని టేబుళ్లు వేయించి నలుగురు నలుగురు కూర్చోడానికీ, భోజనం చెయ్యడానికీ తగిన కుర్చీలు వేయించడం. మరికొన్ని చెట్ల కింద బ్రహ్మాండమైన తుంగచాపలు పరిపించి వాటిమీద పరుపులూ బాలీసులూ వేయించి పేకాట లాంటి కాలక్షేపం ఆటలకి ఏర్పాటు చేయడం. అందరూ మహా మెచ్చుకున్నారు. మడత మంచాలూ, నులక మంచాలూ కొన్ని చెట్లకింద వెయ్యబడి ఉండటం చూసి చాలామంది ముచ్చటగా మధ్యాహ్నాలు వాటిమీదే పడుకుని సేద తీరారు. ఇక రష్యా నుంచి వచ్చిన బుల్లిరాజుగారి ఫ్రెండ్స్ కయితే ఓ పండుగే అయింది వివాహం. ముంజల్ని మహదానందంగా మరీ మరీ తిని ఆనందించారు.

"సూర్ణాణా .... గ్రేట్ రా...పెళ్ళికి నీవు చేసిన ఏర్పాట్లు బ్రహ్మాండంగా వున్నాయి. అందరూ తెగ మెచ్చుకున్నారు" సంతృప్తిగా అన్నాడు బుల్లిరాజుగారు.

"థేంక్స్ బుల్లిరాజూ... ఇదిగో మీ ఇద్దరికీ నా పెళ్ళికానుక" అంటూ రెండు ఉంగరాలు, నాలుగు బంగారు గాజులూ వుండే అందమైన గిఫ్ట్ పేక్ ని అందించాడు సూర్ణాణ.

"అదేవిట్రా... ఇంత ఖరీదైనది ఎందుకూ?" ఆశ్చర్యంగా అన్నాడు బుల్లిరాజు. తన తాహతుకి అవి ఆవగింజతో సమానమయినా, సూర్ణాణ తాహతుకి అవి హిమాలయంతో సమానమని అతనికి తెలుసు.

"ఇదంతా నీ చలవే. మొదట ఎత్తించిన చెత్తనంతట్నీ మా పెరట్లో ఉన్న ఎండిపోయిన మోటబావిలో పోయించా. వర్షాలు రాగానే అది కుళ్ళి కంపు కొడుతుందని, కొని 'బళ్లో' చెరువు మన్ను తోలించా. ప్రతివారం కలెక్ట్ చేసిన చెత్తని అలాగే చేసేవాడ్ని. ఆర్నెల్లలో బ్రహ్మాండమైన 'ఎరువు గుట్ట'గా మారిందా చెత్త. దాన్ని రైతులకు సరసమైన ధరకి అమ్మాను. సహజమైన ఎరువు గనక నేలతల్లి బ్రహ్మాండమైన పంటల్ని ఇచ్చింది. బుల్లిరాజూ, నా ప్రమేయం లేకుండానే నేనివ్వాళ గొప్ప 'ఎరువుని సృష్టించే సృష్టికారు'ణ్ణయ్యాను. మన తోట నించే కాదు, చుట్టుపక్కల ఊళ్లోనించి కూడా చెట్ల నించి రాలిన చెత్తని తెప్పించి ఎరువుగా మారుస్తున్నా. తద్వారా సమాజానికి మేలు జరగడమే కాక నేను కూడా ధనవంతుణ్ణి అయ్యాను. ఇదంతా ఆరోజు నేనన్న మాటకి నువ్వు తిరస్కరించకుండా మౌనంగా ఉండటంవల్లే సాధ్యపడింది" కృతజ్ఞతగా అన్నాడు సూర్ణాణ.

*************

*నీతి: పనికొచ్చేదాన్ని 'చెత్త' అని భావించి పారేసేవాడు మూర్ఖుడు. చెత్తని బంగారంగా మార్చేవాడు ప్రాజ్ఞుడు. భగవంతుడి సృష్టిలో మన ఆలోచనలు అనే 'చెత్త' తప్ప, మరే చెత్తా లేనేలేదు. ఇది ముమ్మాటికీ నిజం.*

మళ్ళీ కలుద్దాం,
భువనచంద్ర


# పాలెపు బుచ్చిరాజు



## మన రెండవ రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్

డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ పూర్వులది నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి గ్రామం. వారిది బీద బ్రాహ్మణ కుటుంబం. ఆ కారణంగా జీవనోపాధికోసం పద్దెనిమిదవ శతాబ్దంలోనే వారు తిరుత్తణికి వలస వెళ్లి స్థిరపడ్డారు. రాధాకృష్ణన్ తండ్రి పేరు రామస్వామి. తల్లి సీతమ్మ. వారి అయిదుగురి మగ సంతానంలో రాధాకృష్ణన్ రెండవ వాడు. ఒక కుమార్తె కూడా ఉండేది. ఇలా ఆరుగురు పిల్లలు, భార్యా భర్తా, మొత్తం ఎనిమిది మంది కుటుంబ సభ్యులతో ఒక సామాన్య గృహస్తు జీవితం గడవడం దుర్భరంగా ఉండేది. తండ్రి తిరుత్తణిలో ఒక జమిందారు వద్ద చిరుద్యోగిగా ఉండేవాడు.

రాధాకృష్ణన్ 1888 వ సంవత్సరం సెప్టెంబరు నెల అయిదవ తేదీన జన్మించాడు. చిన్నప్పటి నుంచి చదువులో చాలా చలాకీగా ఉండేవాడాయన. చదువులో రాణిస్తున్నందుకు అప్పుడప్పుడూ ఉపకార వేతనాలు కూడా దొరికేవి. అ డబ్బూ, ఇంట్లో జేబు ఖర్చు కోసం ఇచ్చిన డబ్బూ వృధా చేయకుండా దాచుకుని, సెలవుల్లో, చుట్టుపట్ల గ్రామాలకి వెళ్లి నాలుగు విషయాలూ తెలుసుకుని రావడం ఆయన హాబీ. అలా వెళ్లి నప్పుడు భోజనానికి, ఇతర ఖర్చులకి ఆ డబ్బుని వినియోగించేవాడు. అటువంటి సమయంలోనే, ఒకసారి విచిత్రమైన



సంఘటన జరిగింది.

ఆ రోజుల్లో బందిపోటు దొంగల బెడద ఎక్కువగా ఉండేది. వారు పిల్లల్ని ఎత్తుకుపోయి, నిర్జన ప్రదేశాల్లో వారి దగ్గర ఉన్నధనం, బంగారం దోచుకుని, పిల్లల్ని చంపి ఏ నూతిలోనో పారేసే వారు. ముఖ్యంగా సంపన్నులైన బ్రాహ్మణుల పిల్లల చెవులకి పోగులు, మెడలో బంగారపు గొలుసులు ఉండడంతో, వారికోసం వెదికే వారు. ఒకసారి రాధాకృష్ణన్ తన యాత్ర ముగించుకుని వెనక్కి వస్తూ ఉండగా, కాపలా కాసి ఎత్తుకు పోయారు. అప్పటికాయన వయసు పదేళ్ళు మాత్రమే! వాళ్ళు ఆయన దగ్గర బంగారం గొలుసుల కోసం వెదికారు. ఈయన ఒక బీద బ్రాహ్మణ బిడ్డ కదా! బంగారం ఎక్కడినుంచి వస్తుంది? వాళ్లకి నిరాశే మిగిలింది. ఏం చేయలేక, ఒక టెంకి జెల్ల కొట్టి, "ఫో! దరిద్రపు వెధవా! దమ్మిడికి కూడా పనికిరా-

వు." అంటూ ఒక గోతిలోకి తోసేసి, వెళ్ళిపోయారు. మన రాధాకృష్ణుడు వాళ్ళు దూరం అయ్యేదాకా ఆగి, నెమ్మదిగా లేచి, ఒళ్ళు, బట్టలు దులుపుకుని, ఇంటిదారి పట్టాడు. ఆ రోజున బీదరికం ఆయన ప్రాణాల్ని కాపాడింది. ఆయనే ధనవంతుడై ఉంటే, దొంగలు బంగారం దోచుకుని ఆయన్ని చంపి నూతిలోనో పారేసి ఉండేవారు.



రాధాకృష్ణన్ కి అద్భుతమైన జ్ఞాపక శక్తి ఉండేది. ఒకసారి విన్నా చదివినా మరిచి పోయేవాడు కాదు. ఏక సంథాగ్రాహి అన్నమాట. ఆయన ఎనిమిది నుంచి పన్నెండు సంవత్సరాల వయసు వరకు ఒక స్థానిక మిషనరీ స్కూలులో చదివాడు. అప్పుడు బైబిలు ఈ చివరి నుంచి, ఆ చివరి వరకు అప్పజెప్ప గలిగేవాడు. ఆ జ్ఞాపక శక్తికి అబ్బురపడి మిషినరి వారు ఉపకారవేతనం కూడా ఇచ్చారు. ఆ తరవాత పై చదువులకి ఆయన 1900 వ సంవత్సరంలో వెల్లూరు వెళ్ళాడు. ఆక్కడ ఒక దూరపు బంధువుల ఇంట్లో ఉంటూ రెండు సంవత్సరాలు ఒక మిషినరి స్కూలు లో చదివి, మద్రాసువిశ్వ విద్యాలయం నిర్వహించే మెట్రిక్ పరీక్ష పాసయ్యాడు. దానిలో మంచి మార్కులు సంపాదించడంతో ఆయనకి ఉపకార వేతనం లభించింది. తరవాత ఆయన బురహి కాలేజిలో జాయిను అయ్యాడు. అక్కడ కూడా బైబిలు జ్ఞానం ఆయనకి ఎంతో ఉపకరించింది. పూర్తిగా అప్పజేప్పగలగడం వల్ల గొప్ప యోగ్యతా పత్రం కూడా ఇచ్చారు.

ఇలా ఉండగా పదహారోఏట ఆయనకి శివకామి అనే అమ్మాయితో వివాహం జరిపించారు తలిదండ్రులు. అప్పట్లో బాల్య వివాహాలే ఆనవాయితీగా ఉండేవి. ఆ అమ్మాయి అంతగా చదువుకున్నది కాదు. ఆమెకు పెళ్లి నాటికి పదేళ్ళు. ఐదో తరగతి చదువుతోంది. తండ్రి రైల్వేలో చిన్న ఉద్యోగి. చిన్నతనంలోనే చనిపోయాడు. విధవరాలైన తల్లి, ఆమెకు డబ్బున్న సంబంధం చూడలేక పోయింది. దక్షిణాదిన అప్పట్లో వరకట్న పిశాచి తాండవ మాడుతోంది. ధనవంతులు డబ్బిచ్చి సంపన్నుల కుటుంబంలోని వరుడిని కొనుక్కునేవారు. అటువంటప్పుడు, బీదవాడు, అతి కష్టం మీద కుటుంబ భారాన్ని నెట్టుకొస్తున్నవాడు అయిన రాధాకృష్ణన్ కి పిల్లనెవరు ఇస్తారు? అందువల్ల చదువు లేని, పేద పిల్లే దొరికింది. పెళ్ళయిన మూడేళ్ళకి వధువు కాపురానికి వచ్చింది. అప్పటికామె వయసు పదమూడేళ్ళు. రాధాకృష్ణన్ కి పదహారు. అప్పుడప్పుడే నవ యవ్వనంలో అడుగు పెడుతున్న బాలుడి మీద ఈ వివాహం చెరగని ముద్ర వేసింది. ఆయన అందాన్ని ఆరాధించేవాడు. నవ వధువుకి తనకి నచ్చిన పేరు పెట్టుకున్నాడు. 'పద్మ' అని. పద్మం కోమలతకి, సౌందర్యానికి ప్రతీక. ఆమె కంటే ఆయన రంగులో మెరుగు. ఆమె పొట్టిగా ఉండేది. ఈయన అయిదడుగుల పదంగుళాల పొడగరి. ఏమయితేనేం? వారి దాంపత్య జీవనానికి, సుఖ సంతోషాలకి ఇవేమీ అడ్డు రాలేదు. చదువుతో బాటు సంసార జీవితం కూడా కొ-

నసాగింది.

రాధాకృష్ణన్ 1904 వ సంవత్సరంలో ఇంటర్ ఫస్ట్ క్లాస్ లో పాసయ్యాడు. లెక్కలు, చరిత్ర, సైకాలజీలలో మంచి మార్కులు వచ్చాయి. అందుకాయనకు ఉపకార వేతనం కూడా వచ్చింది. తరవాత ఆయన మద్రాసు క్రిష్టియన్ కాలేజిలో డిగ్రీ మొదటి సంవత్సరంలో జాయిను అయ్యాడు. అందులో ఆయన ఫిలాసఫీని ముఖ్యమైన విషయంగా ఎంచుకున్నాడు. అంటే పదిహేడు సంవత్సరాల వయసులోనే ఆయన ప్రపంచాన్ని త్యజించి, ఒక సన్యాసిగా మారిపోయాడని కాదు. ఆనాటి వరకు ఆయన వేదాంతం వైపు దృష్టి సారించను కూడా లేదు. అందరు విద్యార్థులలాగే ఆయనా చలాకీగా ఉంటూ స్నేహితులతో ఛలోక్తులు విసురుతూ ఆటా పాటల్లో హుషారుగా ఉండేవాడు. ఒక గొప్ప దార్శనిక శాస్త్రవేత్తగా ప్రపంచంలో ప్రసిద్ధి చెందుతానని ఆయన కలలో కూడా అనుకోలేదు. అప్పుడాయన దృష్టి అంతా ఎంత తక్కువ ఖర్చుతో తన చదువు పూర్తి అవుతుందనే సమస్య మీదే కేంద్రీకృతమై ఉండేది. వీలైనంత వరకు తక్కువ ఖర్చుతో ఎక్కువ జ్ఞానం ఎలా సంపాదించాలనే ఆయన ఆలోచిస్తూ ఉండేవాడు. ఆటల మీద కంటే అధ్యయనం మీదనే ఎక్కువ మక్కువ ఉండేదన్నమాట వాస్తవం. నిజానికి ఆ రోజుల్లో న్యాయశాస్త్రం చదవడం అంటే గొప్ప ప్రతిష్టగా భావించేవారు. ధన సంపాదనకి కూడా అది ఎంతో ఉపకరించేది. సహజంగానే రాధాకృష్ణన్ కి కూడా న్యాయశాస్త్రం చదవాలనే ఉబలాటం ఉండేది. కాని అది చదవాలంటే చాలా డబ్బు కావాలి. బీదవాడైన రాధాకృష్ణన్ కి తెలివితేటలున్నాయి కాని డబ్బెక్కడిది? అంతే కాకుండా అదే సంవత్సరం భార్య పద్మ (శివకామి) కాపురానికి వచ్చింది. తండ్రి రిటైరై తల్లితోను ముగ్గురు తమ్ముళ్ళతోను మద్రాసు వచ్చేశాడు. ఇంత పెద్ద కుటుంబాన్ని పోషించడం కూడా పెద్ద భారం. అందువల్లనే ఆయన ఫిలాసఫీ చదవడానికి నిర్ణయించుకున్నాడు. ఆ విధంగా బీదరికం మరోసారి మన దేశానికి ఒక మహావ్యక్తిని ప్రసాదించడానికి దోహదం చేసిందని భావించవచ్చు.



ఎన్ని కష్టాల్లో ఉన్నా ఆయన చదువుని అశ్రద్ధ చేయకుండా, ఎం. ఏ. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. అందుకాయనకి నెలకి ఇరవై అయిదు రూపాయల ఉపకార వేతనం దొరికింది. కాని ఉదర పోషణకి అది చాలక ఒకటి రెండుట్యూషన్లు కూడా కుదుర్చుకున్నాడు. ఆయన ఎం. ఏ. చదువుతున్న రోజుల్లోనే భారతీయ వేదాంతం మీద ప్రత్యేక శ్రద్ధతో, " The ethics of vedanta and metaphysical proposition" రాసి ప్రచురించాడు. భారతీయ తత్వ శాస్త్రం మౌలికంగా ప్రపంచంలోని అన్ని శాస్త్రాల్లోను గొప్పదని, కేవలం కొందరు స్వార్థ పరులు దానికి తప్పుడు వ్యాఖ్యానాలు చేయడంవల్ల తప్పుదారి పట్టిందని సహేతుకంగా నిరూపించాడు. ఈ వ్యాసం రాయడంలో ఆయన ఉద్దేశం భారతీయ తత్వ శాస్త్రంలో అనేకమైన నిగూఢమైన ఆధ్యా-

త్మిక రహస్యాలు దాగి ఉన్నాయని, వాటిని అర్థం చేసుకుంటే, సమస్త మానవ జాతి సుఖ సంతోషాలతో జీవించగలదని ప్రపంచానికి తెలియ జెప్పడం. 'వసుధైవ కుటుంబకం', సర్వేజనాస్సుఖినో భవంతు' వంటి ఆదర్శాలు భారతీయ సంప్రదాయానికి మూల స్తంబాలని ఆయన చాటి చెప్పాడు. ఆ థీసిస్ పాఠ్యక్రమంలో ఒక భాగం కాక పోయినా అందరూ ఆయన చేసిన కృషిని కొనియాడారు. అంతేకాదు, భారతీయ దర్శన శాస్త్రాన్ని కూడా ఫిలాసఫీ పాఠ్యక్రమంలో ఒక భాగంగా చేర్చడం జరిగింది.

జనవరి 1909 లో ఆయన ఎం. ఏ.పూర్తి చేశాక ఆ ఉత్సాహంతో లండన్ ఆక్స్ ఫర్డ్ విశ్వ విద్యాలయంలో పరిశోధన చేయాలనుకున్నాడు. దానిని సాధించగల మేథా శక్తి ఆయనకున్నా, ఇంటి పరిస్థితులు, కుటుంబ బాధ్యతా ఆయన్ని కృంగ దీశాయి. మద్రాసులోనే ఉంటూ ఏదో ఒక ఉద్యోగం చేస్తూ, విశ్వవిద్యాలయంలో పరిశోధన చేయడానికి నిశ్చయించుకున్నాడు. .

ఇంతవరకు ఆయన చదువుకోసం పడిన శ్రమ ఒక ఎత్తు అయితే, ఆయన ఉద్యోగ పర్వం మరొక ఎత్తు. ఉద్యోగం కోసం కాళ్ళరిగేలా తిరిగాడు. అన్ని చోట్లా ఎదురు దెబ్బలే! ఆఖరికి తనంటే ఇష్టపడే ఒక ప్రొఫెసర్ దగ్గర మొర పెట్టుకున్నాడు. అంత గొప్ప ప్రతిభావంతుడు ఉద్యోగం దొరక్క బాధపడుతూ ఉంటే దయతలచి, ఆయన తన మిత్రుడు ఒకాయనకి ఉత్తరం రాసి పంపాడు. దానిలో "ఈ యువకుడు చాలా ఉత్తముడు. ఇతనికి నువ్వు ఉద్యోగం ఇయ్యి." అని రాసి ఉంది. అది చదివిన అధికారి చిక్కులో పడ్డాడు. అప్పుడు తన ఆఫీసులో ఖాళీలు లేవు. కాని మిత్రుడి మాటని నిలబెట్టక తప్పదు. ఆలోచించి, "నిన్ను సబ్ ఇనస్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ గా నియమిస్తున్నాను. రేపే జాయిను అవ్వాలి." అని చెప్పి పంపాడు. అది కేవలం తాత్కాలికంగా అధికారి కల్పించిన జాబ్. కొన్నాళ్ళకి ప్రెసిడెన్సీ కాలేజిలో మలయాళం ప్రొఫెసరు పోస్టు ఖాళి అయింది. డైరక్టరుగారు ఆ ఉద్యోగం రాధాకృష్ణన్ కి ఇచ్చారు. ఇదయితే పెర్మనెంటు పోస్టు. నెలనెలా 60 రూపాయలు జీతం వస్తుంది. చాలా విచిత్రమైన పరిస్థితి. మన రాధాకృష్ణన్ కి మలయాళం రాదు. ఏం చేయాలో అర్థం కాలేదాయనకి. ఆఖరికి ప్రిన్సిపాల్ ఈ సమస్యకి ఒక పరిష్కార మార్గం ఆలోచించాడు. కొన్నాళ్ళపాటు రాధాకృష్ణన్ కి ఆఫీసులో పని అప్పగించారు. తరవాత ఫిలాసఫీలో పాఠాలు చెప్పే అవకాశం కల్పించారు. దానితో రాధాకృష్ణన్ కి కొంత ఊరట కలిగింది. వేదాంత శాస్త్రం తనకి అత్యంత ప్రియమైనది. కనుక పాఠాలు శ్రద్ధగా చెప్పసాగాడు.


Ex-President Dr. Radhakrishnan greets Padmashree Mohammed Rafi, the golden voiced singer of India.

ఒక సంవత్సరం పాటు ఇలా జరిగిందో లేదో, పులి మీద పుట్రలా మరొక

ఆపద వచ్చిపడింది. 1910 వ సంవత్సరంలో ఆయన్ని తక్కువ జీతం మీద ట్రెయినింగుకి పంపించారు. అది తప్పని సరి. అసలే పెద్ద కుటుంబం. అప్పటికి ఇద్దరు పిల్లలు కూడా పుట్టుకొచ్చారు. వీరందరినీ ఈ కాస్త జీతంతో పోషించడం కష్ట తరమయింది. అయినా రాధాకృష్ణన్ ధైర్యం కోల్పోలేదు. తనవంతు ఖర్చు పూర్తిగా తగ్గించుకుని, కుటుంబ అవసరాలకి డబ్బు ఆదా చేయ సాగాడు. అది ఎంత వరకు వచ్చిందంటే - ఆ రోజుల్లో పూటకూళ్ళ ఇళ్ళలో భోజనం చేసే టప్పుడు, విస్తరాకుకి అదనంగా పైసలు పుచ్చుకునేవారు. ఆ డబ్బు ఆదా కోసం ఆయన నేల మీదనే శుభ్రం చేసుకుని వడ్డించమనే వాడు. ఆ యజమానులు ఎంత నిర్దయులో! బీదరికం మనిషికి ఎంత క్రూరమైన శిక్ష!! ఇది కాక, చదువులో తన ప్రతిభకి ప్రతిఫలంగా ముట్టిన మెడల్సు తాకట్టు పెట్టాడు కూడా. వాటి మీద వడ్డీ కట్టకపోతే, షావుకారు కోర్టుకి వెళ్ళిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఒక ప్రక్క ఉద్యోగం చేస్తూనే, ట్యూషన్లు చెప్పుకుంటూ రాత్రింబగళ్ళు శ్రమించ సాగాడు. ఆ కారణంగా ఆరోగ్యం పాడయింది. ఇది పని కాదని, ఒక పుస్తకం రాసి దాన్ని అమ్ముకుంటే డబ్బు వస్తుందని, 1912 లో "The essentials




of psychology" అనే పుస్తకం రాశాడు. అది లండన లో ప్రచురించ బడింది. దాని ద్వారా ఆయనకి 500 రూపాయలు ఆదాయం వచ్చింది.

రాధాకృష్ణన్ లో ఉన్న ప్రత్యేకత ఏమిటంటే- ఆయనకి ఆధ్యాత్మిక అధ్యయనం అత్యంత ప్రియమైనది. పుస్తక పఠనం విధిగా చేసేవాడు. జ్ఞాన సముపార్జన చేయాలనే గాఢమైన కోరిక ఉండేది. అందుకు ఆయన చేసే ఉపాధ్యాయ వృత్తి చాలా దోహదం చేసింది.

విద్యార్థి దశలో పేదరికం ఆయన్ని కృంగ దీస్తే, ఉపాధ్యాయ వృత్తి లో కులం ఆయన్ని కృంగ దీసింది. ఆ రోజుల్లో బ్రహ్మ ద్వేషం విశేషంగా ప్రబలి ఉండేది. ఈయన బ్రాహ్మణుడు. ఆ కారణంగా ప్రతిభ ఉండి కూడా రాణించలేక పోయాడు. ఏవేవో వంకలు పెట్టి అధికారులు ఆయన్ని ఒక ఊరినుంచి మరొక ఊరికి బదిలీలు చేస్తూ ఉండేవారు. మద్రాసు నుంచి అనంతపురం, రాజమండ్రి, మైసూరు ఇలా ఎన్నో చోట్ల ఆయన ఉద్యోగం చేయవలసి వచ్చింది. ఆయనకి మాత్రం మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజి లోనే చేయాలని ఉండేది. అక్కడాయన చదవడం ఒక కారణ మైతే, పెద్ద కుటుంబాన్ని ఊరూరా మార్చడం ఖర్చుతో కూడుకున్న పని కావడం మరొక కారణం. ఎట్టకేలకు, కలకత్తా యూనివర్సిటీ కులపతి అశుతోష్ ముఖర్జీ రాధాకృష్ణన్ గురించి తెలుసుకుని, ఆయన్ను అక్కడ వేదాంత శాస్త్ర విభాగానికి హెడ్ గా ఆహ్వానించాడు.

హిందూదేశపు వేదాంత శాస్త్రం ప్రపంచంలో అన్ని విజ్ఞానాల కంటే గొప్పదని సశాస్త్రియంగా నిరూపించిన డా. రాధాకృష్ణన్ ని ఆఖరికి భారత దేశపు రాష్ట్రపతి పదవి వరించింది.

జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ధ్యేయాన్ని సాధించడంలో పట్టు విడువరాదని, ఒక నిర్దిష్టమైన దిశలో కార్యసాధన చేసేవాడు సాధించలేనిదేమీ లేదని చాటి చెప్పుతుంది డా. రాధాకృష్ణన్ జీవితం. అంతటి మహానుభావుడిని మరిచిపో కూడదు కనుకనే మనం సెప్టెంబరు అయిదవ తేదీ, ఆయన పుట్టిన రోజును "ఉపాధ్యాయ దినోత్సవం"గా జరుపుకుంటున్నాము.

)(

# వేమూరి వేంకటేశ్వరరావు




## అంకెలు, సంఖ్యలు: నాలుగు

రెండు పాదాలున్న తెలుగు పద్యాన్ని ద్విపద అన్నట్లే నాలుగు పాదాలున్న పద్యాన్ని చతుష్పద అనో చతుష్పాది అనో అనొచ్చు. చతుష్పాది అంటే జంతువనే అర్థమే సర్వసాధారణంగా నలుగురికీ స్పురిస్తుంది కనుక ఆ మాట ఇక్కడ నప్పదు. ఇక్కడ 'నలుగురికీ' అన్న ప్రయోగం, 'నలుగురితో చెప్పి మరీ చెయ్యి,' 'నాలుగు మూలలా వెతుకు,' 'నాలుగు చివాట్లు వేసి రా," మొదలైన ప్రయోగాలు అజహర్లక్షణం అనే అలంకారానికి ఉదాహరణలు. ఇక్కడ 'నలుగురూ' అంటే 'పది మందీ' – లేదా చాల మంది – అని అర్థం. పులి మీద పుట్రలా ఒక అజహర్లక్షణాన్ని వివరించటానికి మరొక అజహర్లక్షణం వాడవలసి వచ్చింది – గమనించేరో, లేదో!

జపానీ భాషలో నాలుగుకి ఒక ప్రత్యేకత ఉంది. జపాను భాషలో 'చీ' అంటే 'నాలుగు' అని ఒక అర్థం, 'రక్తం' అని మరొక అర్థం. అందుకని నాలుగు వారికి అశుభం. మనం ఏడుని ఆరున్నొక్కటి అన్నట్లే వారు నాలుగుని మూడున్నొక్కటి అంటారో అనరో కనుక్కోవాలి.

చింతపిక్కలాటలో నాలుగుని 'పుంజీ' అంటారు. ఇది 'పుంజము' కి భ్రష్ట రూపం. పుంజం అంటే పోగు; చెవి పోగు కాదు, ఇక్కడ 'పోగు' అంటే రాశి.



నక్షత్రాల పోగుని కూడ రాశి అనే అంటాం.

నా చిన్నతనంలో నాలుగు కానులని 'అణా' అనే వాళ్ళం. ఇప్పుడు అణాలు చెల్లక పోవటమే కాకుండా 'పదహారణాల ఆంధ్రుడు' అన్న జాతీయం కూడ చెలామణీలో లేకుండా పోయింది.

సంస్కృతంలో 'చౌ' అంటే నాలుగు. నాలుగు ముత్యాలతో చేసిన జూకాలని చౌకట్లు అంటారు. పలకలు, పటాలు, కిటికీలు, మొదలైన వాటికి నాలుగు పక్కలా ఉండే బందు ('ఫ్రేము') ని కూడా చౌకట్టు అనే అంటారు.

గుర్రం నాలుగు కాళ్ళనీ పైకి ఎత్తి అవరోధాన్ని దాటే విధానమే చౌకళించటం.

నాలుగు స్థంబాలతో కట్టి అన్ని వైపులా తెరచి ఉన్న కట్టడం చౌకం. ఇదే చౌకు లేదా చౌకీ అయింది. మరీ 'బూతులు' వాడటం ఇష్టం లేని వాళ్ళు ఇంగ్లీషులో 'బూత్' ని 'చౌకు' అని కానీ చౌకీ అని కానీ తెలిగించవచ్చు. అప్పుడు 'టోల్ బూత్' ఆసీల చౌకు అవుతుంది. మా ఉళ్ళో అయితే "ఆసీల పాక" అనేవాళ్ళం!

నాలుగు రకాల తినుభండారాలని

కలపగా వచ్చిన 'మిక్చర్' ని చౌచౌ అని కూడ అంటాం.

చవితి అనే మాట చౌతి కి రూపాంతరం. చౌషష్టి 64, చౌసీతి 84.

చౌదరి లో 'చౌ' అంటే అర్థం ఏమిటో?

నాలుగు దంతాలు ఉన్న ఇంద్రుడి ఏనుగు చౌదంతి. దీనినే చతుర్దంతి అని కూడ అంటారు. 'చౌ' కంటె 'చతుర్' బాగా వాడుకలో ఉంది.

చతుర్ముఖుడు చతుర్వేదములకి కర్త అని నలుగురూ నమ్మే విషయమే.


ధర్మ, అర్థ, కామ, మోక్షాలు చతుర్విధ పురుషార్థాలు. సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యాలు చతుర్విధ ముక్తులు.

సనాతన ధర్మంలో నాలుగు చాల చోట్ల కనిపిస్తుంది. 'చాతుర్వర్ణ్యం మయా సృష్టం' అన్నాడు. చతురాశ్రమములు అంటే బ్రహ్మచర్యం, గార్హస్త్యం, వానప్రస్థం, సన్యాసం. ఈ నాలుగు వర్ణాలనీ, నాలుగు ఆశ్రమాలనీ కలిపి వర్ణాశ్రమ ధర్మం అన్నారు.

మళ్ళా ఈ నాలుగు ఆశ్రమాలు ఒకొక్కటి నాలుగేసి రకాలు. ఉదాహరణకి బ్రహ్మచారులలో నాలుగు రకాలు: గాయత్రీ, ప్రాజాపత్య, వైదిక, నైష్ఠిక. ఇలాగే సన్యాసులలో నాలుగు రకాలు: కుటీచకుడు, బహూదకుడు, హంసకుడు, పరమహంస.



'చతుర్వర్ణ' సిద్ధాంతం మీద ఉత్తర-అధునాతనులు (post modernists) ఈ మధ్య దండెత్తి దుమ్మెత్తి పోస్తూ ఉంటే చూస్తూ, చూస్తూ ఊరుకోలేక నేనొక వ్యాఖ్యానం లేవనెత్తేను. దాని సారాంశం ఇది. 'చాతుర్వర్ణ్యం మయా సృష్టం' అంటే "నాలుగు రంగులనీ నేనే సృష్టించేను" అని వాచ్యార్థం. ఇక్కడ నాలుగుని గీతాచార్యుడు అజహర్లక్షణంగా వాడేడనుకుందాం. అంటే ఏమిటి? నాలుగు అంటే ఉత్త 'నాలుగు' కాదు, ఎన్నో అని కాని, 'రకరకాల' అని కాని భగవానుడు ఉద్దేశించి ఉండవచ్చు కదా.



భగవానుడు ఎన్నో 'రంగులు' సృష్టించేడా? 'రంగు' అనే మాటకి స్వభావం అనే అర్థం తెలుగులో వాడుకలో ఉంది. "వాడి అసలు రంగు బయట పడిందిరా" అన్న ప్రయోగం చూడండి. కనుక "చాతుర్వర్ణ్యం మయా సృష్టం" అంటే "రకరకాల స్వభావాలు గల మనుష్యులని నేను సృష్టించేను" అన్న అర్థం వస్తోంది కదా. మనుష్యుల స్వభావాలు రకరకాలుగా ఉంటాయి, ఎవ్వరి స్వభావానికి అనుకూలంగా వారు ప్రవర్తించాలి" అని భగవానుడు చెబుతున్నాడన్నమాట.

నేను ఈ రకంగా గీతా వాక్యాన్ని వ్యాఖ్యానిస్తే, "అజహర్లక్షణం వాడిన వాడు, 'చతుర్' అనే మాటనే ఎందుకు ఎన్నుకున్నాడు, 'దశవర్ణం మయా సృష్టం' అనవచ్చు కదా అని ఆక్షేపించేరు. ఇక్కడ నాలుగునే ఎన్నుకోటానికి ఒక 'సైంటిఫిక్' కారణం ఉంది. మన స్వభావాలు అన్నీ

మన డి. ఎన్. ఎ. లో రాసి ఉన్నాయని ఈ రోజులలో అందరికీ తెలిసున్న విషయమే. ఈ డి. ఎన్. ఎ. లో నాలుగే నాలుగు 'నూక్లియోటైడు' లు ఉన్నాయి – పది లేవు. వీటిని చతుర్ వర్ణాలుగా ఊహించుకుంటే వర్ణాలు నాలుగే అయినప్పటికీ రకరకాల మనుష్యులు ఎలా పుడతారో అవగాహన అవుతుంది. అలాగే సృష్టి కార్యం వెనక నాలుగు ప్రాధమిక బలాలు (గురుత్వాకర్షక, విద్యుదయస్కాంత, త్రాణిక, నిస్త్రాణిక బలాలు) ఉన్నాయని అంటున్నారు కదా!


చతుష్టయం అంటే నాలుగు శాల్తీలు. అవస్థా చతుష్టయం లో బాల్యం, కౌమారం, యవ్వనం, వార్ధక్యం ఉన్నాయి. దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని – ఈ నలుగురూ దుష్టచతుష్టయం అని ఆబాలగోపాలానికి తెలుసు. చతుష్టయం అన్న మాటని 'క్వాడ్రపుల్' అని కాని, 'క్వార్టెట్' అని కాని ఆంగ్లీకరించవచ్చు.

మహాభారతం గురించి ప్రస్తావించిన తర్వాత రామాయణానికీ, నాలుగుకీ ఉన్న బంధాన్ని కొంచెం విచారిద్దాం. బ్రహ్మ నాలుగు చేతులలో ముందున్న రెండు చేతులూ రామ లక్ష్మణులనీ, వెనక ఉన్న రెండూ భరత శత్రుఘ్నులనీ సూచిస్తాయని ఒక పురాణంలో ఉంది.




నాలుగు ముఖాలూ, నాలుగు చేతులు ఉన్న బ్రహ్మ నాలుగు రేకల పద్మం పై ఆసీనుడై ఉంటాడు కదా. నాలుగు ముఖాల నుండీ నాలుగు వేదాలు పుట్టేయి. బ్రహ్మ సృష్టిలో నాలుగు యుగాలు, నాలుగు వర్ణాలూ, నాలుగు పురుషార్థాలు.

మానసిక శాస్త్రంలో రెండు జోడీల అనుభవాలని 'క్వాటర్నిటీ' అనాలని కారల్ యంగ్ సూత్రీకరించేరు. 'ట్రినిటీ' ని త్రిమూర్తి అన్నట్లే ఈ 'క్వాటర్నిటీ' ని చతుర్మూర్తి అనొచ్చు. యంగ్ భారత దేశాన్ని సందర్శించిన తదుపరి ఆయన మన చతుర్విధ పురుషార్థాల వల్ల ప్రభావితులయ్యారని వినికిడి. ఈ చతుర్మూర్తిత్వం జీవితంలో అడుగడుగునా కనిపిస్తుందని అంటారు యంగ్. పూర్ణత్వానికి నాలుగు పాదాలు ఉండాలి అంటారీయన. “The quaternity is the sine qua non of divine birth and consequently of the inner life of the trinity.” (Carl Jung, CW 12, para 125).”




ధర్మం నాలుగు పాదాల మీద నడిచింది కనుక కృతయుగంలో పరిపూర్ణత్వం ఉంది.

భోజనాలకి వాడే 'ఫోర్కు' లలో మూడు రకాలు ఉన్నాయి. కావలిస్తే వాటిని, ద్విశూలం, త్రిశూలం, చతుశ్శూలం అనవచ్చు.

చదరానికి చౌపదం కంటె చతుర్భుజం, చతురస్రం అన్న మాటలే ఎక్కువ వాడుకలో కనిపిస్తాయి. చతుర్భుజం అంటే నాలుగు భుజాలున్న ఏ రేఖాగణితపు బొమ్మ అయినా అవచ్చు. కాని చతురస్రం అనగానే ఆ భుజాల నిడివి సమానం అనిన్నీ, ఆ భుజాల మధ్య ఉండే కోణం లంబ కోణమనీ గ్రహించునది. 'స్క్వేర్' అంటే చదరం. ఇది లేటిన్ లోని 'ఎక్స్ క్వాడ్రెన్'

నుండి వచ్చింది. ఇంగ్లీషు లోని క్వాడ్రిలేటరల్,' 'క్వాడ్రేంగిల్' అన్న రెండూ వాడుకలోనే ఉన్నప్పటికీ, తెలుగులోకి వచ్చేసరికి 'చతుర్భుజం' ఉన్నంత వాడుకలో 'చతుర్కోణి' లేదు. ఈ 'క్వాడ్రేంగిల్' కి ముద్దుగా పెట్టిన 'క్వాడ్' అన్న పేరు బాగా ప్రాచుర్యంలో ఉంది – అమెరికాలో. విశ్వవిద్యాలయాలలోను, కళాశాలలోను, నాలుగు భవనాల మధ్య ఉండే భాగాన్ని 'క్వాడ్' అని పిలుస్తారు.

ఈ 'క్వాడ్' రేఖాగణితం నుండి బీజగణితం లోకి వచ్చేసరికి కొంచెం తిరకాసు తర్కానికి లోనయి, 'క్వాడ్రేటిక్' గా మారింది. 'క్వాడ్' అంటే 'నాలుగు' అయినప్పటికీ, 'క్వాడ్రేటిక్' రెండుని సూచిస్తుంది. ముఖ్యంగా ఒక చలరాసి ఘాతం రెండు అయితే 'క్వాడ్రేటిక్' అన్న విశేషణాన్ని వాడతారు. 'క్వాడ్' అనే మాటని ఇలా రెండర్థాలతో వాడటం వల్ల కొంత గాసటబీసటకి ఆస్కారం ఉంది. కాని తార్కికంగా ఆలోచిస్తే ఈ పరిస్థితికి ఒక కారణం ఉంది. ఒక చతురస్రం యొక్క వైశాల్యం కావాలంటే దాని భుజం కొలతని ఘాతించాలి. ఘాతించటం అంటే భుజం కొలతని రెండు సార్లు వేసి హెచ్చువెయ్యటం. ఇదీ రెండుకీ, చతురస్రానికి మధ్య ఉన్న బాదరాయణ సంబంధం. కనుక బీజగణితంలో ఒక చలన రాసి ఘాతం రెండు అయితే దానిని వర్ణించటానికి 'క్వాడ్రేటిక్' అన్న విశేషణాన్నీ, నాలుగు అయితే 'బైక్వాడ్రేటిక్' లేదా 'క్వార్టిక్' అన్న విశేషణాన్నీ వాడతారు. మూడు కాళ్ళ పీటని ముక్కాలి పీట అన్నట్లే, గ్రీకు భాషలో నాలుగు కాళ్ళ మంచాన్ని 'ట్రెపీజ్' అంటారు. మన నులక మంచం ఒక ట్రెపీజ్. సర్కస్ లో గెంతటానికి మంచాన్ని పోలిన ట్రెపీజ్ ని వాడతారు. గ్రీకు వారికి ట్రెపీజ్ ఎటువంటిదో హిందీ వారికి 'చార్‌పోయ్' అటువంటిది. హిందీలో 'చార్‌పోయ్' అన్నా, లేటిన్ లో 'క్వాడ్రుపెడ్' అన్నా, గ్రీకులో 'టెట్రాపాడ్' అన్నా ఒకటే. ఇంగ్లీషులో 'క్వాడ్రుపెడ్' అంటే నాలుగు పాదాలు ఉన్నది – జంతువు. తెలుగులో నాలుగు పాదాలు ఉన్నది మంచం కాదు, జంతువు కాదు; పద్యం అని మొదట్లోనే చెప్పేను.

నాలుగు నాలుగులతో ఒక గమ్మత్తు అయిన ఆట ఆడ వచ్చు. దీనిని టూకీగా చెబుతాను. లెక్కలలో ప్రవేశం ఉన్నవాళ్ళు దీనితో కుస్తీ పట్టి రామానుజన్ లా "అంకెలు నా సంగడికాళ్ళు" అని కాలరెగరేసి చెప్పుకోవచ్చు.

నాలుగే నాలుగు 4-లు తీసుకుని, మనం సామాన్యంగా వాడే గణన కార్యాలని (అంటే కూడిక, తీసివేత, గుణకారం, భాగారం, దశాంశ బిందువు, వర్గ మూలం, మొదలైన mathematical operations) మాత్రమే వాడి, సున్న నుండి ఎంత పెద్ద సంఖ్య వరకు రాయగలం? మీకు సాయం చెయ్యటానికి, నేను మొదలు పెడతాను. ఉదాహరణకి:

$0 = 44 - 44$

$1 = 44/44$

$2 = (4/4) + (4/4)$

$3 = (4 + 4 + 4)/4$

$5 = (4*4+4)/4$

...

ఇక్కడ * గుర్తు గుణకారానికి, / గుర్తు భాగారానికి వాడేను. ఒక తెల్ల కాగితం తీసుకుని, ఈ వరసని ఎంత దూరం వెళ్ళగలరో చూడండి. కొంచెం లెక్కలు వచ్చిన వాళ్ళు అవసరమైనప్పుడు దశాంశ బిందువు, వర్గమూలం, 'ఫేక్టోరియల్' మొదలైనవి కూడ వాడొచ్చు. ఉదాహరణకి

$95 = (4*4!) - (4/4)$.

ఈ ఆటని ఆడుతూ 0 నుండి 40,000 పైబడి సంఖ్యలు వచ్చే వరకు చేసిన వారున్నారు. ఈ ఆటని నాలుగు నాలుగుల తోటే ఆడాలని నిబంధన ఏదీ లేదు. ఎన్నో మార్పులు, చేర్పులు చేసి ఆడొచ్చు.

నలుగురితో పాటు నారాయణా అనుకో మన్నారు కదా అని నాకు తెలిసిన 'నాలుగు' విషయాలు నలుగురికీ నాలుగు పేజీలలో చెప్పేసను.

# ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



# ప్రేమంటే ఇంతే

(గత సంచిక తరువాయి)

కృష్ణమోహన్ పట్ల నేను ఆకర్షితురాలిని అవుతున్నానా? కాకపోతే నా మనస్సు అతని గురించి ఇంతగా ఎందుకు ఆలోచిస్తున్నాది? ప్రేమలో పడ్డానా? దీనినే ప్రేమంటారా? అసలు ప్రేమంటే ఏమిటి?

అతనికి నా పట్ల ఏ రకమైన అభిప్రాయం వుందో? తను ఉదయం నుండి కృష్ణమోహన్ గురించి ఆలోచనలతో సతమవుతుంటే ఈ కీర్తన రావడం కొంచం ఆశ్చర్యాన్ని కలిగించి భగవత్ సంకల్పం అనుకుంది. ఈ కీర్తనని ఈ సందర్భంలో తన నోట పలికించడం నేను ఎలా అర్ధం చేసుకోవాలి? తన మానసిక సంఘర్షణకి ఆ దేముడు పరిష్కారం చూపాడని భావించి ఆనంద పడాలా? ఏది ఏమైనా అతని ఆలోచనలని, మనోగతాన్ని, అభిప్రాయాలని క్షుణ్ణంగా తెలుసుకున్నాకే తను తన ఆలోచనలని బహిర్గతం చేయాలని నిర్ణయించుకొని తన సంగీత సాధనని కొనసాగించింది.

*****

కృష్ణమోహన్, అవినాశ్ ఇద్దరూ తీవ్రంగా పరీక్షలకి తయారు అయి బాగా రాశారు. శనివారం పరీక్షలు అయిపోయినాక అదే రోజు అవినాశ్కి ఏదో పని వుండి విశాఖ వెళ్ళాడు. ఆ రోజు రాత్రి రవి కృష్ణమోహన్ కి ఫోన్ చేశాడు.

"బావా పరీక్షలు ఎలా రాసావు"

"చాలా బాగా రాసాను. అందరూ బాగున్నారా?"

"అందరూ బాగున్నారు. అమ్మ కొంచెం సిక్ అయింది, జ్వరం వచ్చి మూడురోజులు లంఖణం. రెండు రోజులయింది తగ్గి, ఇప్పుడు బాగానే వుంది"

"అరెరే అలాగా, విశ్రాంతి తీసుకోమను. మీరందరూ ఆవిడని పని చెయ్యకుండా చూడండి. రాధని వంట చెయ్యమను..." మధ్యలో రవి ఆపి "నా కోసం ఎవరో వచ్చారు, ఇదిగో అనూ ఇక్కడే వుంది మాట్లాడు" అని ఫోన్ అనూరాధకి ఇచ్చి ఆ గది లోంచి బయటికి వెళ్ళాడు రవి.

"బావా ఎలా వున్నావు, పరీక్షలు ఎలా రాసావు" అడిగింది అనూరాధ.

"ఫైన్ థాంక్యూ, బాగా రాసాను. నువ్వేలా వున్నావు"

"సో, సో" అంది

"ఏం అంత నిస్పృహగా మాట్లాడుతున్నావు?"

"నీ మీద బెంగతో"

"చాలు నీ వేళాకోళం, అత్తయ్యకి విశ్రాంతి ఇచ్చి పని చేస్తున్నావా లేదా?"

"అమ్మకి పూర్తిగా విశ్రాంతి ఇచ్చాము. మొత్తం పని అంతా నేను, అన్నయ్య చూసుకుంటున్నాము"

"రాధ చాలా మంచి పిల్ల"

"సరే రేపు తొందరగా వచ్చెయ్యి, ఇక్కడే బ్రేక్ఫాస్ట్ కూడా చేద్దుగాని"

"వద్దు రేపు రాను, అత్తయ్యగారు లేచి హడావిడి చేస్తారు వచ్చే వారం వస్తాను"

"అమ్మని వంట దగ్గరకి రానీయడం లేదు అని చెప్పానా? ఇంకా ఎందుకు ఎగ్గొట్టడానికి చూస్తావు, రేపు వస్తే నా వంట రుచి చూసినట్లుంటుంది"

"వద్దులే తరువాత ఎప్పుడో వస్తానులే'

"ఏయ్ చెపితే అర్ధం కాదా, తెగ ఫోజు కొడుతున్నావు?"

"సరే వస్తాను లంచ్కి వస్తాను, డిన్నర్కి వుండను. అది ఓకే అయితేనే"

"ముందు నువ్వు రా బావా, వచ్చేక చూద్దాము"

"వచ్చేక టింగరి వేషాలు వెయ్యద్దు, ఓకే గుడ్ నైట్"

"రేపుగాని రాకపోతే నీ పని చెబుతాను, గుడ్ నైట్"

మర్నాడు ఉదయం పదకొండు గంటలకి కృష్ణమోహన్ విశ్వనాథంగారి ఇంటికి చేరుకున్నాడు. దారిలో బత్తాయి పళ్ళు కొని తీసు కెళ్ళి పార్వతమ్మగారికి ఇచ్చి "ఎలా వున్నారు అత్తయ్యగారూ" అని అడిగాడు.

"బాగున్నానయ్యా, నువ్వెలాగ వున్నావు, పరీక్షలు బాగా రాసావా? అని అడిగారు పార్వతమ్మగారు.

"బాగానే రాసానండి, రవి కనబడ లేదు ఇంట్లో లేడా?"

"అబ్బాయి ఎవరో స్నేహితుడు వస్తే బయటికి వెళ్ళాడు, ఘడియో, క్షణమో వచ్చేస్తాడు"

విశ్వనాథం గారిని కూడా పలకరించి ఆయనతో మాట్లాడుతుండగా ఆయన కోసం మేడ మీద నుండి వాళ్ళ ఇంటి యజమాని కలవడానికి వచ్చారు.

ఆయన వస్తూనే కృష్ణమోహన్ని చూసి "ఈ అబ్బాయి ఎవరు" అని అడిగారు.

"ఈ అబ్బాయి మా వదినగారి కోడలికి పినతండ్రి కొడుకు, పేరు కృష్ణమోహన్, ఈయన మా ఇంటి యజమాని దక్షిణామూర్తిగారు. మనవాళ్ళే రాచకొండ వారు, ఈయన రాజమండ్రి కళాశాల ప్రధానాధ్యాపకులుగా పనిచేసి పదవీ విరమణ చేసారు. వీరి అబ్బాయి బొంబాయిలో, అమ్మాయి హైదరాబాద్లో వున్నారు" అని ఒకరినొకరికి పరిచయం చేసారు విశ్వనాథంగారు.

దక్షిణామూర్తిగారు పంచ, లాల్చీ ధరించి ఉత్తరీయం వేసుకొని, నుదుట విభూతి రేఖలతో శాస్త్రోక్తంగా బ్రహ్మ వర్చస్సుతో, తెలుగుతనం ఉట్టిపడుతూ విప్రపుంగవుడిలా కనబడ్డాడు కృష్ణమోహన్కి. ఆయనని ఎవరు చూసినా చెయ్యెత్తి నమస్కారం చెయ్యాలనిపించేలా వున్నారు. కృష్ణమోహన్ ఆయనకి నమస్కారం చేసాడు, అతనిని చూస్తే కృష్ణమోహన్కి తన పెద్దనాన్నగారు గుర్తుకొచ్చారు.

"అబ్బాయ్! మన ఇంటిపేరేమిట్రా? మన స్వస్థలం ఎక్కడ? నువ్వు ఏం చదువుతున్నావు" అడిగారు దక్షిణామూర్తిగారు.

ఇంటి పేరు చెప్పి, " మాది విశాఖపట్నం అండి. నేను ఇక్కడ ఇంజినీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్నానండి" చెప్పాడు కృష్ణమోహన్.

"సంతోషంరా అబ్బీ, మీది హరితస గోత్రం కదూ, నాకు బాగా గుర్తుంది ఎందుకంటే రాజమండ్రి కళాశాలలో పని చేస్తున్నపుడు మీ ఇంటి పేరు ఆయనే శేషాద్రి శర్మగారు అని ఉత్కృష్టమైన తెలుగు పండితుడు వుండేవారు. మేమిద్దరమూ సహోద్యోగులమే కాకుండా మంచి సహచరులము, ఆయనదీ విశాఖపట్నమే ఆయన నీకు తెలుసా?"

"మా తాతగారు ఆయన అన్నదమ్ముల పిల్లలండి"

"బాగుందిరా అబ్బాయ్! నిన్ను కలవడం వల్ల ఆయనతో గడిపిన మధురస్మృతులను గుర్తు చేసుకొనే అవకాశం నాకు ఇవాళ కలిగింది"

"సార్ మిమ్మల్ని చూస్తే మా పెద్ద నాన్నగారిని చూసినట్లుంది, మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మలిని అలా పిలవాలని వుంది, నా కోరికని మన్నిస్తారా" అని అడిగాడు కృష్ణమోహన్.

"దానిదేమి భాగ్యంరా, నిరభ్యంతరంగా పిలువు, మీ నాన్నగారు ఏం చేస్తున్నారురా?"

"ఆయన విశాఖపట్నంలో రైల్వేలో పరసనల్ ఆఫీసర్ గా పనిచేస్తున్నారండి".

ఇంతలో అనూరాధ హాల్లోకి వచ్చింది..."మా తప్పిపోయిన కోడలు పిల్లరా అబ్బీ, వీళ్ళది మాది గౌతమస గోత్రము కావడం వలన కుదరలేదు లేకుంటే మా తమ్ముడి కొడుకుకి ఖచ్చితంగా చేసుకునే వాళ్ళము" అని కృష్ణమోహన్తో చెప్పి "ఏమే కోడలు పిల్లా! మీ అత్తగారు బంధువుల ఇంట్లో ఏదో వేడుకకి వెళ్ళింది. ఈ మామగారికి, నీ బావకి, మీ నాన్నగారికి ఉడుకు నీళ్ళు ఇస్తావా?" అని అనూరాధని అడిగారు దక్షిణామూర్తిగారు.

"అమ్మ కలుపుతున్నాది, రెండు నిముషాలలో తెస్తాను" అని లోపలికి వెళ్ళింది.

దక్షిణామూర్తిగారు చూపించిన కలుపుగోలుతనం, ఆప్యాయత పట్ల కృష్ణమోహన్ ఆకర్షితుడు అయ్యాడు. అతనికి తన పెదనాన్నగారిని చూసినంత ఆనందంగా వుంది.

అనూరాధ కాఫీ పట్టుకుని వచ్చి దక్షిణామూర్తిగారికి, విశ్వనాథంగారికి ఇచ్చి "కృష్ణా, అమ్మ

నిన్ను పిలుస్తున్నది" అంది.

అది విన్న దక్షిణామూర్తిగారు "అదేమిటే అమ్మాయ్ అతనిని పేరు పెట్టి పిలుస్తున్నావు, నీకు బావ వరస కదా నోరారా బావా అని పిలువు. మీ వాళ్ళని అన్నయ్యా, అక్కయ్యా, వదినా, అని వరసలు పెట్టి పిలవడంలేదా? అలాగే అతనిని వరస పెట్టి పిలువు, పేరు పెట్టి పిలుచుకుంటే ఆత్మీయత కొరవడుతుంది. పై వాళ్ళని కూడా అన్నయ్యగారూ, అక్కయ్యగారూ, బావగారూఇలా వరసలు పెట్టి సంబోధించుకోవడం మన సాంప్రదాయము, నీకు బావా అని పిలవడానికి మొహమాటమా?" అని అనూరాధని అడిగారు.

"మామయ్యగారూ నాకు ఏ మొహమాటం లేదు, కొత్తలో అలా పిలిస్తే, అలా పిలవద్దు నాకు ఎబ్బెట్టుగా వుంటుంది అన్నాడు అందుకే పేరు పెట్టి పిలుస్తున్నాను" అని చెప్పి కృష్ణమోహన్ వంక నవ్వుతూ చూసి కనుబొమ్మలు ఎగరేసింది అనూరాధ.

"ఏరా అబ్బీ నీకెందుకురాఅభ్యంతరము? కొద్దిసేపటి క్రితంవరకు నీకు నాకు పరిచయం లేదు, నువ్వు నన్ను పెద్దనాన్నా అని పిలుస్తానంటే వెంటనే సంతోషంగా ఒప్పుకున్నానా ఎందుకని? అలా పిలుచుకుంటేనే ఆత్మీయతలు పెరుగుతాయిరా. నోరారా అమ్మా, నాన్నా, మామయ్యా, అత్తయ్యా, బాబయ్యా, పిన్నీ, అక్కా, బావా అని పిలుచుకోవాలి. అంతేగాని పేర్లు పెట్టి లేదా మమ్మీ, డాడీ, అంకుల్, ఆంటీ అని పిలుచుకుంటే మమతానురాగాలు పెరగవు. ఇప్పుడు ఈ మమ్మీ, డాడీ సంస్కృతి పెరగడంవల్లనే రా ఒకప్పటి ఉమ్మడి కుటుంబాలు పోయి ఎవరికివారే యమునా తీరే అన్నట్టు వున్నారు మనుషులు" అని ఎంతో ఆవేదనతో అన్నారు దక్షిణామూర్తిగారు.

"అయ్య బాబోయ్ ఈ రాక్షసి మళ్ళీ తెలివిగా ఇరికించింది" అని మనసులో అనుకొని, "లేదు పెద్దనాన్నగారూ, మాఇంట్లో మేమంతా మీరు చెప్పినట్లుగానే వరసలతోటే పిలుచుకుంటాము" అన్నాడు.

"మరలాంటప్పుడు నీ అభ్యంతరం దేనికిరా అబ్బి" అన్నారు దక్షిణామూర్తిగారు.

"తనకి అలా అవకాశం ఇస్తే మా స్నేహితులు ముందు కూడా అలా పిలిచి నన్ను ఆట పట్టిస్తుంది. అది చూసి నా స్నేహితులు వేళాకోళం చేసి ఏడిపిస్తారు" అన్నాడు కృష్ణమోహన్.

"ఒరేయ్ ఒక విషయం చెప్పు, నీ స్నేహితులకి పరిచయం చేయవలసి వస్తే ఈ అమ్మాయి మా మామయ్య లేదా అత్తయ్య కూతురు మా మరదలు అని పరిచయం చేస్తావు కదా, మరి అప్పుడైనా వాళ్ళు వేళాకోళం చేస్తారుకదా" అన్నారు దక్షిణామూర్తిగారు.

"పెద్దనాన్నగారు మీరు తననే సమర్థిస్తున్నారు, నన్ను సమర్థించడం లేదు. ఒక వేళ మా స్నేహితులకి పరిచయవలసి వస్తే మా బంధువుల అమ్మాయి, పేరు అనూరాధ అని పరిచయం చేస్తాను" అన్నాడు కృష్ణమోహన్.

దక్షిణామూర్తిగారు నవ్వుతూ "వోయ్! నీ బాధ నాకు అర్థమయిందిరా అబ్బీ, మధ్యే మార్గంగా నేనొకటి చెబుతాను విను. అమ్మాయ్ నువ్వు అతనిని బావా అని పిలువు కానీ అతని స్నేహితులు, పరాయివారి దగ్గర అలా పిలవద్దు సరేనా" అన్నారు మూర్తిగారు.

"అలాగే మామయ్యగారు" అని.......కృష్ణమోహన్తో "బావా అమ్మ పిలుస్తున్నాది" అని చాలా వ్యంగ్యంగా అంది అనూరాధ.

"చూసారా ఎంత వ్యంగ్యమో, తన మాట చెల్లిందని ఆనందం" ఉక్రోషంగా అన్నాడు కృష్ణమోహన్.

వాళ్ళిద్దరి వరస చూసి దక్షిణామూర్తిగారు నవ్వుకున్నారు. కానీ చాలా సేపటి బట్టి విశ్వనాధంగారు ముభావంగా వున్నారు, అతనికి అక్కడ జరుగుతున్న సంభాషణలు రుచించడం లేదు.

కృష్ణమోహన్, అనూరాధ లోపలికి వెళుతుంటే "ఒరేయ్ అబ్బీ నువ్వు ఇక్కడికి వచ్చినపుడు ఈ ముసిలాళ్ళని కూడా ఒకసారి పలకరించి వెళుతూవుండు" అన్నారు దక్షిణామూర్తిగారు.

లోపలికి వెళ్ళాక కృష్ణమోహన్ని రవి గదిలో కూర్చోబెట్టి "ఇందాకా డికాషన్ వాళ్ళిద్దరికే సరిపోయింది, మళ్ళీ డికాషన్ దిగి వుంటుంది, కాఫీ కలిపి తెస్తాను అంతవరకు ఈ దినపత్రిక చదువుతూ వుండు బావా" అంది

అనూరాధ.
"వద్దులే రాధా"
"ఎందుకా మొహమాటం, నువ్వు కాఫీ ఎక్కువసార్లు త్రాగుతావు కదా, ఒక్క నిముషం" అని వంటింట్లోకి వెళ్ళింది అనూరాధ.

********

దక్షిణామూర్తిగారి గురించి చి ఆలోచిస్తున్నాడు కృష్ణమోహన్ ...."ఈయన క్షణంలో కొత్తవాళ్ళ తో ఇట్టే వరసలు కలిపి మాట్లాడే స్తారు. నిజమే ఈ కాలం మను షులలో అనురాగాలు ఆప్యాయ త లు బాగా తగ్గిపోతున్నాయి, ఆయన చెప్పినట్లు ఇప్పుడు మనుషులలో స్వార్ధచింతన ఎక్కు వయింది. ఉమ్మడి కుటుం బాలు కూడా చాలా వరకు కనుమరుగు అవుతున్నాయి, అప్పటి ఆప్యాయ తలు కొరవడడానికి ఇది కూడా ఒక కారణం. పెద్దాయన చెప్పినట్లు వరసలతో పిలుచు కుంటే వుండే ప్రేమానురాగాలు పేర్లతో పిలుచుకుంటే వుండవు". ఇలా ఆలోచిస్తూ వుంటే అనూరా ధ వచ్చి "ఏమిటి బావా అంత ధీర్ఘంగా ఆలోచిస్తున్నావు" అని కాఫీ కప్పు కృష్ణమోహన్కి ఇచ్చి ఒక ఖాళీ కప్పు కూడా పెట్టింది. తను ఆలోచిస్తున్నది చెబితే రాధ ఇంక చెలరేగిపోతుందని "అబ్బే ఏమీ లేదు" అన్నాడు.

"మామయ్యగారికి థాంక్స్ చెప్పా లి" అంది.

"చాల్లే సంబరం, నన్ను బావా అని పిలవకు"

"మీ పెద్దనాన్నగారికి చెప్పనా" అని సరదాగా బెదిరించింది.

"నీకో నమస్కారం, మళ్ళీ ఆయ నని లాగకు, ఆయన నిన్నే సమ ర్ధిస్తారు"
"అలా రా దారికి, బుద్ధిగా బావా అని పిలిపించుకో...సరే మా అమ్మ కోసం బత్తాయిలు తెచ్చా వు, మరి నా కోసం ఏం తెచ్చావు"
"ఏమిటి?" అన్నట్లు కృశ్చన్ మార్క్ మొహం పెట్టాడు కృష్ణమో హన్.
"భగవంతుడా! ఈ ట్యూబ్ లైట్కి ఎప్పుడు అర్ధమవుతుందో"
"ఏయ్ మొదలెట్టావా? అందుకే నేను రానన్నాను"
దినపత్రిక చదువుతూ ఖాళీ కప్పుని గమనించని కృష్ణమోహన్ కాఫీ సిప్ చేసాడు. ఆ తరువాత ఆ ఖాళీకప్పు చూసి "ఇదేమిటి ఖాళీకప్పు తెచ్చావు, నీకు తెచ్చుకోలేదా?" అని అడిగాడు.
"ఆ! నువ్వు సగం ఇస్తావని చూసాను" కాస్త వ్యంగంగా, కాస్త కోపంగా అంది.
"అయ్యో సారీ, నేను ఎంగిలి చేసేసాను"
"సరే ఏం చేస్తాము, ప్రాప్తం లేదు...బావా మా సంగీతం టీచర్ ఇంటికి వెళ్ళాలి, అన్నయ్య లేడు కానీ స్కూటర్ వుంది, నన్ను తీసు కెళ్ళవా?"
విశ్వనాధంగారు, పార్వతమ్మగారు ఏమనుకుంటారో అని "నేను రాను" అన్నాడు కృష్ణమోహన్.
పార్వతమ్మగారు "అనూ" అని పిలిచి "ఏమే సంగీతం టీచర్ ఇంటికి వెళ్ళాలన్నావు" అని అడి గారు.
"అన్నయ్య వచ్చాక వెళదామను కుంటున్నాను"

"టైం పదకొండున్నర దాటింది, అన్నయ్య ఇంతవరకూ రాలేదు, ఎప్పుడు వెళతావు, ఎప్పుడు వస్తా వు, భోజనాలు ఆలస్యమైతే మీ నాన్నగారు వుండలేరు. ఒక పని చెయ్యి మోహన్ వున్నాడుగా, అత నిని రమ్మను"
"అసలే మొహమాటస్తుడు, నేన డిగితే రానంటాడు, నువ్వు చెబితే వింటాడు, పిలుస్తాను నువ్వు చెప్పు"

కృష్ణమోహన్ దగ్గరికి వచ్చి "అమ్మ పిలుస్తున్నాది" అని ఏమీ తెలియనట్లు అమాయకంగా మొహంపెట్టి చెప్పింది. ఆ అమా యకమైన మొహం చూడగానే ఏదో ఇరికించింది అనుకు న్నాడు కృష్ణమోహన్.
"చెప్పండి అత్తయ్యగారూ"
"ఏం లేదయ్యా, ఒక సారి అనూ ని వాళ్ళ సంగీతం టీచర్ ఇంటికి స్కూటర్ మీద తీసుకెళ్ళు, పది నిముషాలు పనుంది" అన్నారు పార్వతమ్మగారు...ఇప్పుడేమం టావు అన్నట్లు కనుబొమలు ఎగ రేసి కృష్ణమోహన్ని ఆట పట్టిం చింది అనూరాధ.
స్కూటర్ దగ్గరకి నడుస్తూ "నువ్వ లా అమాయకంగా మొహం పెట్ట గానే నన్ను ఇరికించి వుంటావని అనుకున్నాను" అన్నాడు కృష్ణమో హన్.

"లేదు బావా అమ్మతో నేనేమి చెప్పలేదు, అమ్మ నిన్ను తీసుకు వెళ్ళమంటే, నేను చెపితే రాడు నువ్వే చెప్పు అన్నాను అంతే, కావాలంటే అమ్మని అడుగు" అని చాలా అమాయకంగా మొహం

పెట్టి సమాధానం ఇచ్చింది.
"అవును అంతకు ముందే నన్ను అడిగితే నేను రానన్నానుగా, అందుకే తెలివిగా ఆవిడ చేత చెప్పించి ఇరికించావు"
"అబ్బా! అర్ధమయింది కదా ఇంకెప్పుడు నేను ఏది అడిగినా వెంటనే ఒప్పుకో"
"నీకు అసలు సిగ్గు లేదు" అని మొట్టికాయ పెట్టబోయి ఇంటి బయట వున్నాము కదా అని నిగ్రహించుకుని "సరే వంట పని పూర్తి చేసావా?" అని అడిగాడు.
"ఎప్పుడో నువ్వు వచ్చేసరికే పూర్తి చేసాను. ఇవాళ నా వంట రుచి చూసి నీ అమూల్యమైన అభిప్రాయం చెప్పు"
"సంగీతం టీచర్గారి ఇల్లు ఎక్కడ"
"జగన్నాధపురం చిక్కాలవారి వీధిలో"
"అంత దూరమా! మరి రోజూ ఎలా వెళ్ళి వస్తున్నావు"
"వారానికి మూడు రోజులు క్లాసెస్ వుంటాయి, సాయంత్రం ఉంటాయి గనుక కాలేజీ నుండి తిన్నగా వెళతాను. క్లాసెస్ అయినాక అన్నయ్య వచ్చి తీసుకువెళతాడు"
"అవును మీ వుమెన్స్ కాలేజికి దగ్గరే కదా, ఇంత దూరం చీకటి పడ్డాక ఒంటరిగా వెళ్ళడం మంచిది కాదు"
స్కూటర్ మీద వెళుతూ వుండగా జగన్నాధపురం వేంకటేశ్వరస్వామి కోవెల సమీపంలో "బావా ఆ దుకాణం దగ్గర ఆపు" అంది అనూరాధ. ఆ దుకాణంలో రెండు చాక్లెట్స్ కొని ఒకటి తను తీసుకొని ఒకటి కృష్ణమోహన్కి ఇచ్చింది.
"రాధా వీటి కోసం ఆపించావా? ఇవి ఇప్పుడు అంత అర్జంటా? అయినా చిన్నపిల్లల్లా చాక్లెట్స్ ఏమిటి?" అన్నాడు
"ఏం నేను నీకు ఏభై ఏళ్ళ దాని లా కనబడుతున్నానా? ఎదో సరదాగా మొదటిసారి నీకు నోరు తీపి చేద్దామని కొన్నాను, కానీ నీ మాటలతో నన్ను నిరుత్సాహపరిచావు"
"లేదు, UKG పిల్లలా కనబడుతున్నావు"
"అంతేలే బావా, ఎలా కనబడాలో అలా కనబడటం లేదంటావు"
"నోర్మూయ్ కొంటె పిల్లా! రాక్షసి" అని ముద్దుగా కోపం చూపించాడు.
"నీ మీద నాకు కోపం వచ్చింది" అని మూతి విరిచింది.
"చాల్లే పద" ఆ మూతి విరుపు చూసి నవ్వుతూ అన్నాడు.
"బావా దీనికి శిక్ష ఏమిటో తెలుసా? నువ్వు వచ్చినపుడల్లా నాకు బోలెడు చాక్లెట్స్ తీసుకు రావాలి, ప్రామిస్ చెయ్యి" అని చెయ్యి చాపింది.
"ఏయ్ పిచ్చి వేషాలు వెయ్యకు పద"
ఇదంతా చాలా సేపటి నుండి దుకాణంలో కూర్చుని గమనిస్తున్న ఆ దుకాణదారుడు "బావా మరదల్లాండి?" అని అడిగాడు. అవునని తలూపింది అనూరాధ.
"ఆయ్! బావా మరదల్లన్నాక ఆ మాత్రం సరదాగా వుండాలండి. అమ్మాయ్గోరు మనులడిగారా, మానిక్యాలడిగారా సాక్లెట్లే గదా ఒప్పేస్కోండి అబ్బాయ్గోరూ" అన్నాడు.
అతని మాటలకి అనూరాధ పక పకా నవ్వుతూ "ఒప్పేసుకో బావా ప్లీజ్" అంటూ కృష్ణమోహన్ని ఇంకా ఏడిపించింది.
ఇక అక్కడ వుంటే లాభం లేదని అనూరాధ చెయ్యి పట్టుకుని పద అని లాక్కెళ్ళబోయాడు.
ఇంతలో ఆ దుకాణదారుడు "అబ్బాయ్గోరూ ఒక్క నిముసం" అని ఆపి "మీ ఇద్దరినీ సూత్తావుంటే సిలకా గోరింకల్లా ఉన్నారు, నా తరపున ఈ సాక్లెట్లు కానుకగా ఇత్తన్నాను" అని ఒక అర డజను చాక్లెట్స్ ఇచ్చాడు. కృష్ణమోహన్ డబ్బులిచ్చినా పుచ్చుకోలేదు. ఈ సంఘటనతో అనూరాధ ఇంకా ఉత్సాహంతో దారికడాకు కృష్ణమోహన్తో "బావా ఆ దుకాణం యజమాని మనలని చూసి ఏమన్నాడు" అని అడిగి ఆట పట్టిస్తూనే వుంది.
చిక్కాలవారి వీధిలో వున్న సంగీతం టీచర్ ఇంటికి వెళ్ళి అక్కడ పని చూసుకొని తిరిగి ఇంటికి వచ్చే సరికి రవి మిగతా వారందరూ ఇంటికి చేరుకొని వున్నారు. అందరూ కలిసి భోజనం చేసారు.
ఈ సారి భోజనం మొదలుపెట్టకుండానే ఖాళీ ప్లేట్ కృష్ణమోహన్ కంచం దగ్గర వుంచింది అనూరాధ. అది చూసి విశ్వనాథంగారు, "ఇదెందుకే" అని అడిగారు. "చూడండి కాస్సేపు పోయాక మీకే తెలుస్తుంది" అని నవ్వుతూ చెప్పింది అనూరాధ. ఐదు నిమషాల తరువాత విషయం అర్ధమయి

"ఏమిటయ్యా అది, అవి కూడా తినేవే, ఇవాళ అనూ వంట చేసింది, నీకు నచ్చలేదా?" అన్నారాయన.

"నాకు కారం ఎక్కువ తినే అల వాటు లేదండి, మా ఇంట్లో కారాలు తక్కువ తింటాము" అన్నాడు.

"నాన్నగారు వాళ్ళంతా బెంగాలీ వాళ్ళు తీపి ఎక్కువ తింటారు" అంది అనూరాధ.

"ప్రతి పదార్ధంలో కాస్త పంచదార పోయలేక పొయావా అనూ" నవ్వుతూ అన్నాడు రవి.

భోజనాలయిన తరువాత "బావా నీకు అడ్డాట వచ్చా?" అని అడిగాడు రవి.

"నాకు రాదు, అదేమిటో, దేనితో ఆడతారో కూడా నాకు తెలియదు" అన్నాడు కృష్ణమోహన్.

"అది టెన్నిస్ బేట్ తోటి, క్రికెట్ బాల్ తోటి ఆడతారు" పక పకా నవ్వుతూ చెప్పింది అనూరాధ.

"ఏయ్ అల్లరిపిల్లా నీ అల్లరి ఆపు, అతను అసలే మొహమాటస్తుడు, నువ్వు ఇలా అల్లరి చేస్తే ఇక ఈ చుట్టుపట్లకి రాడు" అని పార్వతమ్మగారు మందలించారు.

"అది ఒక రకమైన పేకాట బావా, కుటుంబ సభ్యులందరూ కూర్చుని సరదాగా కాలక్షేపానికి ఆడుకునే ఆట. ఇందులో డబ్బులు పెట్టి ఆడవలసిన అవసరం లేదు, ఈ ఆట వల్ల మనలో ఊహించే శక్తి పెరిగి, తెలివితేటలు పదునెక్కుతాయి" అని వివరించాడు రవి.

"ఓకే కానీ నాకు రాదే" అన్నాడు కృష్ణమోహన్.

"ఒక పని చెయ్యి, నేను, అమ్మ, నాన్నగారు, అనూ ఆడతాము. మా అందరిలో అనూ బాగా ఆడుతుంది, అందుకని నువ్వు దాని ప్రక్కన కూర్చుని దాని ఆటని గమనిస్తూ నీ సందేహాలన్నీ అనూని అడిగి తీర్చుకో. ఈసారి వచ్చినపుడు నువ్వూ ఆడుదుగాని" అన్నాడు రవి.

"అత్తయ్యగారు నీరసంగా ఉన్నారు ఆవిడని ఇబ్బంది పెట్టడం ఎందుకు" అన్నాడు కృష్ణమోహన్

"పరవాలేదు, జ్వరం వచ్చి లంఖణాల తరువాత భోజనం చేసిన వెంటనే అలా పడుకోకూడదు, అయినా ఇప్పటి వరకు రెస్ట్ తీసుకుందిగా తనకీ విసుగు పుడుతుంది, అందుచేత తనూ కాస్సేపు ఆడుతుంది" అన్నారు విశ్వనాథంగారు.

*****

మొత్తానికి అందరూ కలిసి సరదాగా అడ్డాట ఆడుకున్నారు. కృష్ణమోహన్ అనూరాధ ప్రక్కనే కూర్చుని ఆ ఆటని గమనిస్తూ తన సందేహాలని అనూరాధని అడిగి నివృత్తి చేసుకుంటున్నాడు. మధ్యలో మంచినీళ్ళ కోసం వంట గదిలోకి వెళ్ళాడు.

"అనూ అతను వంటింట్లోకి వెళ్ళాడు, చూడు ఏం కావాలో" అంది పార్వతమ్మగారు.

వంటింట్లోకి వెళ్ళి "బావా ఏంకావాలి?" అని అడిగింది అనూరాధ.

"మంచినీళ్ళు కావాలి"

"వుండు నేనిస్తాను...ఇంతకీ నా వంట నచ్చిందా? లేదా?"

"నీ వంట బాగుంది, ఊరికే మొహమాటానికి అనలేదు నిజంగా చాలా బాగుంది" మంచి నీళ్ళు తాగుతూ జేబులోంచి ఒక టేబ్లెట్ తీసి వేసుకున్నాడు.

"ఏమైంది బావా మందులు వేసుకుంటున్నావు" అని కంగారు పడుతూ అడిగింది అనూరాధ.

"ఏమీలేదు, అనవసరంగా కంగారు పడకు మొన్న క్రికెట్ ప్రాక్టిస్లో బంతి మోకాలికి తగిలి వాచింది. ఇప్పుడు తగ్గింది. డాక్టర్ గారు కోర్సు పూర్తిగా వాడమన్నారు, అయినా అంత కంగారు దేనికి" అన్నాడు.

"నువ్వలా టేబ్లేట్ వేసుకుంటే నాకు కంగారు వచ్చింది"

"నేను టేబ్లెట్ వేసుకుంటే నీకు కంగారెందుకు" అని అంటూ వుండగా అతని నోరు చేత్తో మూసి "ఇంకెప్పుడూ అలా అడగకు బావా" అని అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ అంది.

అప్పుడు చూసాడు రాధ కళ్ళలో మెరుస్తున్న రెండు కన్నీటి బిందువులని.

"ఏయ్ ఏమిటిది! ఎందుకేడుస్తున్నావు?" అని ఆమె కళ్ళలో నీరు తుడిచాడు.

"నీకు దెబ్బ తగిలిందని నాకు నాకు బాధ వేసింది, అందుకే కన్నీళ్ళు వచ్చాయి, నొప్పిగా వుందా? వేడినీళ్ళ కాపడం పెట్టమంటావా?"

"వద్దులే, నువ్వు చాలా ధైర్యవంతురాలివి అనుకున్నాను, ఇంత చిన్న విషయానికి భాధపడుతున్నావు. సరే పద వాళ్ళు వైట్ చేస్తూ వుంటారు...అవును, నీ సంగీతం ఎప్పుడు వినిపిస్తావు"

"సాయంత్రం కాఫీలు త్రాగాక వినిపిస్తాను. నువ్వెళ్ళు, నేను కాస్త మొహం కడుక్కుని వస్తాను" అని వాష్రూంకి వెళ్ళింది అనూరాధ.
సుమారు రెండు గంటలు గమనించిన తరువాత కృష్ణమోహన్కి అడ్డాట బాగానే అర్థమయింది. అనూరాధ లేచి కాఫీ కలపడానికి వెళుతూ "బావా నా స్థానంలో ఆడు, ప్రాక్టీస్ అవుతుంది"అంది.
కృష్ణమోహన్ ఆట చూసి "బావా బాగానే పికప్ చేసావు" అన్నాడు రవి.

కాఫీలు త్రాగాక అనూరాధ ముందు రోజు సాధన చేసిన "మరుగేలరా ఓ రాఘవా" కీర్తన నిన్న తనకు వచ్చిన ఆలోచనల నేపథ్యంలో ఆ కీర్తనని ఒక అనుభూతితో చాలా శ్రావ్యంగా పాడి వినిపించింది. కృష్ణమోహన్కి ఆమె గాత్రం, ఆ కీర్తన ఎంతో నచ్చి అనూరాధ పాడుతున్నంత సేపూ పరవశంతో విన్నాడు. కీర్తన పూర్తి అయిన తరువాత అనూరాధని పొగడ్తలతో ముంచెత్తి, చాలా బాగా పాడావు అని మెచ్చుకున్నాడు.
"నాన్నగారు మీకు తెలుసా బావ పాటలు చాలా బాగా పాడతాడని వైదేహి వదిన చెప్పింది" అంది అనూరాధ.
"అలాగా! ఏంవోయ్ ఒక మంచి పాట పాడవయ్యా, సంగీతం నేర్చుకున్నావా" అని అడిగారు విశ్వనాథంగారు.
"అబ్బే ఏం లేదండి, నన్ను ఆట పట్టించడానికి రాధ అలా అంటున్నా ది, నాకు ఏ పాటలూ రావండి" అన్నాడు కృష్ణమోహన్.
"నీకు చాలా మొహమాటమని మాకు తెలుసుగాని, సరదాగా ఒక పాట పాడవయ్యా" అన్నారు పార్వతమ్మగారు.
"బావా వదిన చెప్పింది నువ్వు బాగపాడుతావని, పద్యాలు, హిందీ పాటలు కూడా పాడుతావని. నీ ఇష్టం నీకు నచ్చిన హిందీ పాటయినా పాడు" అన్నాడు రవి.
"సరే పాడతాను, పాడిన తరువాత బాగులేకపోతే నన్ను తిట్టుకోవద్దు"
హిందీ సినిమా గైడ్లో రఫీ పాడిన "గాతా రహే మేరా దిల్" పాటని పాడి వినిపించాడు.

"బావా చాలా బాగా పాడావు, నిజం చెప్పు నువ్వు సంగీతం నేర్చుకోలేదా?" అని అడిగింది అనూరాధ.
"బాగానే వుంది గాని ఒక తెలుగు పాటో, పద్యమో పాడవయ్యా మాకు హిందీ రాదు" అన్నారు పార్వతమ్మగారు.
పెద్దావిడ మాట కాదనలేక "బ్రతుకుతెరువు" సినిమాలో ఘంటసాల పాడిన "అందమె ఆనందం ఆనందమె జీవిత మకరందం" అనే పాటని, నర్తనశాలలో పాడిన "ఎవ్వాని వాకిట ఇభమద పంకంబు రాజభూషణ రజోరాజి నడగు" అనే పద్యం చక్కగా పాడి వినిపించాడు కృష్ణమోహన్. ఆ పాట విని అందరూ కృష్ణమోహన్ని బాగా పాడావని మెచ్చుకున్నారు.

అప్పుడే బాల్కనీలో కూర్చుని కాఫీ త్రాగుతున్న దక్షిణామూర్తి గారి చెవిన ఈ పద్యం పడి, ఇంత చక్కగా ఈ పద్యం పాడింది ఎవరబ్బా అని ఆయన హుటాహుటిన క్రిందకి వచ్చారు.
కృష్ణమోహన్ పద్యం పాడాడని తెలుసుకొని ఆయన చాలా ఆనందంతో "ఒరేయ్ అబ్బీ చక్కగా పాడావురా, మీ తరం వాళ్ళు కూడా పద్యాలని పాడడం శుభసూచకం. పద్యాలు ఒక్క తెలుగు బాషలోనే వున్నాయిరా, వాటిని నీలాంటి వాళ్ళు పాడి ముందు తరాల వారికి అందించాలి, మన మాతృభాషని, మన సంస్కృతిని ముందుకు తీసుకు వెళ్ళాలి. ఏదీ కృష్ణరాయభారం పద్యాలు పాడు" అన్నారు.
"శ్రీ కృష్ణరాయభారంలో 'సంతోషంబున సంధి చేసెదవో', 'జెండాపై కపిరాజు' పద్యాలు పాడాడు కృష్ణమోహన్.
అది విని "అబ్బాయ్ చాలా శ్రావ్యంగా పాడావురా, చెవులకి పట్టిన తుప్పు వదిలిపోయింది" అని కృష్ణమోహన్ని కౌగిలించుకొని ముద్దాడారు దక్షిణామూర్తిగారు. ఆయన పాదాలకి నమస్కరించాడు కృష్ణమోహన్.
కృష్ణమోహన్ బయలుదేరుతుండగా "మోహన్ రాత్రి కూడా భోజనం చేసి వెళ్ళవయ్యా" అంది పార్వతమ్మగారు.

"నా సహవిద్యార్థికి వంట్లో బాగులేదు అత్తయ్యగారూ, ఆతను సూర్యారావుపేటలో వుంటున్నాడు అతనిని చూసి హాస్టల్కి వెళతాను" అన్నాడు.

(ఇంకా వుంది)

# ఆర్. శర్మ దంతుర్తి

# తెలుగు పద్య రత్నాలు - 6

పదహారో శతాబ్దంలో కేరళప్రాంతంలో నారాయణ భట్టాత్రిరి గారు తన ఆరోగ్యాన్ని గురుదక్షిణగా సమర్పించాక గురువు దగ్గిరనుంచి తనకి అంటుకున్న రోగాన్ని నివారణ చేసుకోవడంకోసం గురువాయూరు శ్రీకృష్ణుణ్ణి నమ్ముకుని నారాయణీయం రచన చేసి రోగవిముక్తులౌతారు. నారాయణీయం పదేసి పద్యాలతో (దశకం) మొత్తం భాగవతం అంతా సంస్కృతంలో చేసిన రచన. ఈ నారాయణీయం రచన సాగిస్తున్న రోజుల్లో కొన్నిసార్లు (మన పోతనకి జరిగినట్టే) అపారకరుణాసాగరుడైన భగవంతుడికి అసలు నృసింహావతారంలో అంత కోపం ఎలా వస్తుందో, మరొకటో అర్ధంకాక రచన ముందుకి సాగనప్పుడు గురువాయూరు గుడిలోకి వెళ్ళి 'ఇదిగో ఇలా ఫలానా చోట నాకు అర్ధం కాలేదు, ఏం చేయాలి?' అని అడిగితే కృష్ణుడు ఆ రూపాన్ని చూపించేవాడుట. అది చూసాక బయటకొచ్చి రచన సాగించేవారు అంటారు. ఈ నారణీయాన్ని సంస్కృతలోంచి తెలుగులోకి అనువదించినవారు కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులు గారు. దీన్ని తితిదేవారు ప్రచురించారు. ఈ నెల పద్యం ఆ నారాయణీయంలోని వామనావతారం దశకం లోనిది.

***అనినన్ వాని యుదార వాగ్రచన నీ వాలించి వాత్సల్యమునన్***
***గొనియున్ వాని మదమ్ము డించుటకు రక్షోనాథు వంశమ్ము వ***
***ర్ణనముం జేసి 'పదత్రయ మ్మొసంగుమన్నా! చాలు' నన్నావు కా***
***దని సర్వమ్మును నీవయి యడుగ నవ్వ నవ్వరే యెవ్వరున్*** ***[31.2]***

వామనుడు బలి చక్రవర్తి దగ్గిరకి వెళ్ళి మొదటగా స్వస్తి వాక్యం చెప్పాడు. అప్పుడు బలి మహారాజు వామనుణ్ణి ఆహ్వానించి 'వరచేలంబులో, మాడలో, ఫలములో వన్యంబులో, గోవులో...' కాక ఇంకా ఏం కావాలో కోరుకోమన్నాడు. దానికి సంతోషించి వామనుడు బలి చక్రవర్తిని వాత్సల్యంతో చూసి, మీ వంశం ఇంత మంచిది, మీ తాత ప్రహ్లాదుడు ఎంతో గొప్పవాడు అంటూ చెప్పాక మూడు అడుగుల భూమి చాలు అన్నాడు. ఇంతవరకూ అందరికీ తెలిసిన కథే. అయితే ఈ నారాయణీయం పద్యంలో ఉన్న ముఖ్యమైన విషయం పద్యంలో ఉన్న నాలుగో పాదం.

వామనావతారం ఎత్తినదే బలి చక్రవర్తి దగ్గిరనుంచి ఉన్నదంతా దోచుకుని దేవతలకి ఇవ్వడానికి కదా? కానీ మూడు అడుగుల నేల మాత్రం చాలు అదే ఇమ్మన్నావు, ఎందుకంటే ఎవరైనా ఏదైనా కోరుకో ఇస్తాను అంటే "మొత్తం నీకున్నదంతా ఇచ్చేయి," అని అడిగితే అందరూ నవ్వరూ? అలా నవ్వులపాలు కాకుండా ఉండడానికి మూడు ఆడుగుల నేల చాలన్నావు. కానీ తీరా అడిగినది ఇచ్చాక తీసుకున్నదేమిటీ? సర్వస్వమూను. అంటే ప్రపంచాన్ని, పధ్నాలుగు లోకాలనీ సృష్టించినవాడికి మనం ఏపాటి, మనకున్న ఆస్తిపాస్తులేపాటి? భగవంతుడి మూడు అడుగులకన్నా తక్కువే కదా? అదే బలికి జరిగినది

"నాకింత సంపద ఉంది, నేనింత ఇవ్వగలను..." అనే గర్వం ఇంకా ఉంది బలి

మహారాజుకి. ఆ గర్వంపోతే తప్ప ఆత్మానుభవం అసంభవం. ఆ గర్వం ఎలా పోతుంది? చేసిన పాప పుణ్యాలు భగవదర్పిదం చేసాక. పుణ్యం మనని పైలోకాలకి తీసుకెళ్తుందనుకుంటే, ఆ పై లోకాలని ఒక పాదంతో ఆక్రమించాడు వామనుడు. బలి చేసిన పుణ్యం మామూలు పుణ్యం కాదు. నూరు అశ్వమేధాలు చేసినది. అంతటి పుణ్యం, భగవంతుడికి ఒక పాదం మేర కూడా కాదు. పాపం వల్ల కింది లోకాలకి వెళ్తాం అనుకుంటే దాన్ని కూడా ఒక పాదంతో ఆక్రమించాడు వామనుడు. ఇంక మిగిలినది అహంకారం. అది పోవడానికి బలి 'నీ పాదం నా తల మీద ఉంచు' అని అడిగాడు. ఆ పాద స్పర్శతో బలికి అహంకారం పోయి భగవంతుడంటే ఎవరో జ్ఞానోదయం అయింది. ఆ తర్వాత ఆయనకి భగవంతుడి విశ్వరూపం అవగాహన అయింది – ఎలా అయింది? "ఇంతింతై వటుడింతయై, మరియు దానింతై ..." అన్నట్టూ.వామనుడు మొదట యజ్ఞవాటికలో అడుగుపెట్టగానే



బలి చక్రవర్తికి అవగాహన ఉంది వచ్చినవాడేవరో. మూడు అడుగుల నేల చాలు అనగానే వచ్చినవాడు శ్రీహరి అని గ్రహించాడు. అందుకే "నిరయంబైన, నిబద్ధమైన, ధరణీ నిర్మూలంబైన, కులాంతంబైన, దుర్మరణంబైన..." "మేరువు తలకిందైనను, పారా వారం బులింకబారిన, లోలోధారుణి రజ మైపోయిన" ఆ భగవంతుడు అడిగిన కోరిక తీరుస్తానని చెప్పాడు. ఎందుకంటే ఎన్ని జన్మల పుణ్యం చేస్తే భగవంతుడు మన దగ్గిరకొచ్చి దేహీ అనే అదృష్టం మనకి వస్తుంది? ఎంతో పుణ్యం చేసాక వచ్చిన జ్ఞానంతో అన్న మాట అది. అందుకే గురువు శుక్రాచార్యులు ఇవ్వద్దు అన్నా, శపించినా ముందూ వెనకా చూసుకోకుండా దానం ఇచ్చేసాడు బలి. ఈ ఇవ్వడానిక్కారణం కూడా "ఆత్మార్థే పృధ్వీంత్యజేత్," అనేదే కారణం. ఆత్మ జ్ఞానం కోసం ప్రపంచాన్ని వదులుకోవాలి. శ్రీరామకృష్ణులూ, బుద్ధుడూ, వివేకానందులూ సన్యసించడానిక్కారణం అదే.

విష్ణుకథలు కళ్యాణాత్మకాలు. ఎన్నిసార్లు ఎవరు చదివినా అవి కొత్తగానే ఉంటాయి. అవి వర్ణించడానికి ఎవరికి ఎంతకాలం పడుతుందో తెలియదు; అదే భగవద్విభూతి అంటే. మనకి పోతన పద్యం చదివితే ఎంతటి అనుభూతి కలుగుతుంతో కథ అంతా తెలిసి నా నారాయణీయం పద్యం చదివితే కూడా అటువంటి అను భూతే కలగడానిక్కారణం ఈ కథలు కల్యాణాత్మకం అవడం వల్లే. నారాయణీయంలో రాసిన భట్టాత్తిరిగారి సంస్కృతం శ్లోకం ఇది.

**తా మక్షీణాం బలిగర ముపాకర్ణ్య కారుణ్య పూర్ణో**
**పృస్యోత్సేకం శమయితుమనా దైత్యవంశం ప్రశంసన్**
**భూమిం పాదత్రయ పరిమితాం ప్రార్థయామాసిథ త్వం**
**సర్వం దేహీతు నిగదితే కస్య హాస్యం న వాస్యాత్**

# ఆదూరి హైమవతి



## దురాశే .. పిశాచం

జగన్నాధపురం జమీ ధనవర్మ ఏలుబడిలోకి రాగానే ,ఆయన అనేక మార్పులు చేసాడు. దానికి కారణం తాను చుట్టుపక్కల అందరు జమీదార్ కంటే గొప్ప ధన వంతుడు కావాలనే ఆశ.

'తన ఏకాంతమందిరం నిండా ధనరాసులు నిండిపోయి ఉన్నట్లూ, ఆ ధనరాసుల కాంతుల మధ్య తానున్నట్లూ' ప్రతిరోజు కలలు కనేవాడు. ఆ కలలు నిజంచేసు కోను ధనవర్మ పరిపాలనలో కొన్ని మార్పులుచేశాడు.

తరతరాలుగా తనజమీలో జరుగుతున్న నిత్యాన్నదానపధకాలు, దేవాలయాల లోని ప్రత్యేకపూజలూ, తిరినాళ్ళూ, ఉత్సవాలూ రద్దుచేశాడు. దాంతో కొంతఖర్చు తగ్గినట్లు భావించాడు.ప్రజలపై పన్నులు రెట్టింపు చేశాడు. ముసలి జమీందారైన ఆయన తండ్రి, దివాను, పెద్దలూ ఎంతచెప్పినా వినలేదు.

పోగైన ఆ ధనం రాసులుగా పోసుకున్నాడు. ప్రజలు పెంచినపన్నులు కట్టలేక నానా బాధలూ పడ సాగారు. రాత్రి పూట పురవీధుల్లో పది గంటల తర్వాత వీధి దీపాలన్నీ ఆర్పేయమని ఆజ్ఞ వేశాడు.తన జమీలోని ముసలిపని వారినంతా తీసేసి సగం మందినే యువకుల్ని నియమించి రెట్టింపు పనిచేయించ సాగాడు. తండ్రి ముసలి వారు పని చేసినతర్వాత వారి భుక్తికోసం ఇస్తున్న ఉచిత భత్యం రద్దు చేశాడు. మందిరంలో హుందాగా అందంగా వెలిగే దీపాలు దుబారాగా భావించి తగ్గించే శాడు.వంటలూ పూల ఖర్చుల్లోనూ కోత విధించాడు.

ఈవిధంగా పొదుపు చేసిన ధనాన్ని కూడా రాసులు పోసుకున్నా ఇంకా ఆ రాసుల్ని ఎలా పెంచుకోవాలా అనే తపనతో అశాంతి, అసహనం, కోపం, నిద్రలేమి పెరిగి పోయాయి. తల్లి తండ్రులతో, భార్యా బిడ్డలతో మాట్లాట్టమే మానేశాడు. ప్రజలందరూ ముసలిజమీందారైన జగన్నాధవర్మకు తమకష్టాలు మొరపెట్టు కున్నారు. జగన్నాధవర్మ ప్రజల బాధలువిని భరించలేక, చెప్పినా తనకుమరుడు మారడని నిర్ణయించుకుని, తాత్కాలికంగా కొంతకాలం స్వస్థలానికి దూరంగా, భార్యతో కల్సి కొంతకాలం పుణ్య తీర్థాలు సేవించను బయల్దేరివెళ్లాడు.

పుణ్య క్షేత్ర దర్శనాలుచేస్తూ జగన్నాధవర్మ దంపతులు, దేవతలందర్నీ తమకుమారునికి పట్టిన 'దురాశాపిశాచాన్ని' వదిలించి, అతనిలో మంచిమార్పు తెమ్మని ప్రార్థించసాగారు.

ఒక అటవీప్రాంతంలోని పురాతన దేవాలయ మంటపంలో విశ్రాంతి తీసుకుంటు న్న వారిని ఓ సాధువు పలుకరించాడు.వారుభక్తితో ఆయనకు నమస్కరించారు. వారి విచార ముఖకవళికలు గమనించిన ఆ సాధువు, వారి ద్వారా విషయం అంతా తెల్సుకుని , వారికి ఓ ఉపాయం చెప్పాడు.

జగన్నాధవర్మ సంతోషంతో, భార్యతో కల్సి నగరానికి తిరిగి వచ్చాడు. తర్వాత మూడు రోజులకు ఒక సాధువు నగరానికి వచ్చాడు.ఆయన అడిగిన వారి కోరికలన్నీ తీర్చుతున్నాడనే ప్రచారం సాగింది. నగర ప్రజలంతా ఆయనను దర్శించను గుంపులుగా రాసాగారు.

దురాశాపరుడైన ధనవర్మ ఆ సాధువును దర్శించి, తనచిర-

కాలపుకలలు నిజం చేయమని ప్రార్ధించాడు. తన ఏకాంత మందిరానికి ఆయన్ను ఆహ్వానించాడు. సాధువు ధనవర్మ మందిరం ప్రవేసించి, కళ్ళు మూసుకుని ఒక మంత్రం పఠించాడు.సాధువు ఏడు పెద్దబానలు సృష్టించాడు. ఆ ఏడు బానల్లో- సగానికి వజ్రాలూ, ముత్యాలూ, బంగారు ఆ భరణాలూ, కాసులూ ఉన్నాయి.

"ధనవర్మా ! నీవద్ద వున్న ధనాన్ని ఈ బానల్లో నింపు. నీస్వంత ధనంతో వీటిని నింపితే నీకలలు ఫలిస్తాయి" అని చెప్పి ఆ సాధువు వెళ్ళిపోయాడు. ధనవర్మ తన ఏకాంతమందిరంలో తాను రాసులు పోసుకున్న ధనాన్ని ఆ బానలనిండా నింపసాగాడు.సగంవరకూ నిండివున్న ఆ ఏడుబానల్లో ఆరు మాత్రం పుర్తిగా నిండాయి. ఏడవ బాన మాత్రం నిండలేదు. ఆ రోజు నుండీ ధనవర్మ, ఇంకా పొదుపు పాటించి, ఇంకా పన్నులు పెంచి ధనం కూడబెట్టి, ఆ ఏడవబాన నింపే ప్రయత్నం ముమ్మ రం చేశాడు.

ఎంత పోసినా అదినిండటంలేదు. రాజబాటల్లో హుండీలు పెట్టి ఆ దారిన పోయే వారిపై 'దారి సుంకం' కుడా విధించాడు. తల్లి తండ్రులు భార్య అతని దురాశను ఆపను ఎంత ప్రయత్నించినా, వారిమాటలు పెడచెవిని పెట్టాడు. రాత్రిపూట మారు వేషంలో, జోలెపట్టిధనం సేకరించ సాగాడు.

ప్రజలు అతన్ని గుర్తించినా, అసహ్యంతో, నవ్వుకుంటూను, గుర్తించనట్లే ఎంతో కొంత డబ్బు వేయ సాగారు. ఎంతధనం పోసినా ఆ ఏడవ బాన నిండటంలేదు. అన్నపానాదులుమాని ధనసేకరణలో పడి చిక్కిపోసాగాడు ధనవర్మ. దురాశా పిశాచం పట్టి పీడించేవాడు అల్లాగే అవుతాడు మరి!

ఎలాగైనా ఆ ఏడవ బానను నింపాలనే పట్టుదలపెరగ సాగింది. పక్క నగరాలకు రాత్రిపూట మారు వేషంలో వెళ్ళి జోలెపట్టి ధనం పోగుచేయసాగాడు.నగరవాసులు అతన్ని 'ఇంతబలంగా వున్నావే అ డుక్కోక పోతే ఏ దైనా కాయ కష్టం చేసి నాల్గు డబ్బులు సంపాదించుకోరాదా? అడుక్కోను నీకు సిగ్గుగా లేదా?", అని ఛీ కొట్ట సాగారు.

ఆ మాటలతో ధనవర్మ పంతం పెరిగింది.మారువేషంలోనే పక్కగ్రామాలకు వెళ్ళి కొలిమివద్ద కమ్మరిపని, కట్టెలు కొట్టేపని, రాళ్ళుమోసేపనీ, సేస్తూ కొంత ధనం పోగు చేశాడు.అలాసంపాదించినధనాన్ని తెచ్చి, ఆ ఏడవబానలో పోయగానే అది నిండిపొర్లింది. ధనవర్మ ఆశ్చర్యంతో ఇంతకాలం ఎంతపోసినా నిండని బాన ,తానుకూలిచేసిపోగు చేసిన కొద్దిపాటి ధనంతో ఎలానిండిందాని అనుకుని ,ఆ సాధువు కనిపిస్తే అడగాల ని తలంచిన వెంటనే, ఆ సాధువు ధనవర్మ ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

"ధనవర్మా! నీ స్వంత ధనంతో ఆ ఏడోబానలూ నింపమన్నాను,నీవు నీ తాతలనాటి ధనాన్నీ ప్రజలపై అన్యాయంగా పన్నులువేసి వసూలుచేసిన ధనాన్నీ ,సిగ్గు విడ చి జోలెపట్టి సంపాదించిన ధనాన్నీ ఆ బానల్లో పోశావు. ఎంతకష్ట పడితే ధనం సంపాదించగలమో తెల్సుకోలేక పోయావు.ధనంకూడబెడితే అది పిశాచంలా పీడి స్తుంది. శాంతి లేకుండా చేస్తుంది.ఊరకే వున్నధనం ఎవ్వరికీ వుపయోగపడని ధనం చూసుకుని సంతోషించే బదులు ఇసుక, రాళ్ళు,మట్టీ, ధనంగానే భావించి చూసుకుని సంతోషించవచ్చు. దానికోసం ప్రజలనూ కన్న తల్లితండ్రులను, భార్యాబిడ్డలనూ ఇన్ని కష్టాల పాలు చేయవలసిన పని లేదు. తాతముత్తాతలు ప్రజాసంక్షేమం కోసం,దేవాలయాల్లో పూజలకోసం, అన్నదానాలకోసం ప్రత్యేకించిన ధనాన్ని, వాటినంతా ఆపి ఆ బానల్లో నింపావు. ప్రజలనుపీడించి ధనం వసూలు చేశావు. కన్న బిడ్డలవలె చూసుకోవలసిన ప్రజలను, ఎన్నో కష్టాలపాలుచేశావు. ఆనందం ధనంలో లేదు. అందరికీ ఆనందం కలిగే పనులుచేస్తే ఆధనం వుప యోగం లోకివస్తే ఆనందం లభిస్తుంది. ఆ ఏడవబానయే అత్యాశ!

(43 వ పేజీ చూడండి)

# నందుల ప్రభాకర శాస్త్రి

## మా ఊరి నందుల ఆత్మీయ కథ



(గత సంచిక తరువాయి)

ఇక ఆడపిల్లలు, మగపిల్లలు కలసి ఆడే ఆట దాగుడుమూతలు. ఈ ఆట ముఖ్యంగా వెన్నెల రోజుల్లో ఆడేవాళ్ళు. కనపడకుండా దాచి పెట్టుకోవటానికి వామిదొడ్లు, కళ్ళాలు, ఎద్దుల కొట్టాలు వుండేవి.

### చింతబజ్జి

అన్నిటికంటే ముఖ్యమైన ఆట 'చింతబజ్జి'. ఈ ఆట ఎక్కువగా ఎండాకాలం మిట్టమధ్యాహ్నం మొదలై రెండు మూడు గంటలు పట్టేది. చింతచెట్లు పూటకు వచ్చి నిండుగా ఉంటాయ్. నలుగురైదుగురు కలసి చింతపూత కోస్తారు. పెద్దల కంటపడితే తిడతారు కాబట్టి, మంచి ఎండ కాసేటప్పుడు పెద్దలు ఇంట్లో వుంటారు కాబట్టి ఆ సమయంలో బయలుదేరతారు. మగపిల్లలైతే... చొక్కాను, నిక్కరులోకి పోనిచ్చి, నిక్కరు పైన మొలతాడు రానిచ్చి, కోసిన చింతపూతనంతా చొక్కాలో వేసుకుని, నిండిన తరువాత దిగేవాళ్ళు ఇంకొక ఇద్దరు ముగ్గురు వేపచెట్టు ఎక్కి బాగా మాగిన పెద్ద పెద్ద వేప పండ్లు కోసుకుచ్చేవాళ్ళు. అప్పుడప్పుడు అమ్మాయిలూ కూడా చెట్లెక్కేవాళ్ళు.

ఈ చింతపూత నంతా ఒక పెద్ద బండ మీద [పోసి, గుండ్రాయితో బాగా దంచి, వేపపండ్లన్నీ వొత్తి విత్తనం, దానిలో గుజ్జు పడేటట్లు చేసి, తోలుని పారేసేవాళ్ళు. ఈ వేప పండ్ల గుజ్జుపై నలిగిన చింతపూత పరచి గుట్టగా తయారుచేసి అందరూ దానిపై చేతులు పెట్టి ఒక పాట పాడుతూ, గుద్దుతూ, పాటఅయిపోగానే చేయి గిల్లి ఒక్కొక్క చెయ్యి అలా తీసేసేవాళ్ళు. 'కాకమ్మ ...కాకమ్మ .... నాకింత తేనియ్యి. నీ నోట్లో చింతబజ్జి పెడతా అంటూ పాట పాడేవాళ్ళు. చేతులు పైన గుద్దటం వల్ల ఆ వత్తిడికి వేపగుజ్జు చింతపూతతో కలసి నిజంగానే తేనె పండిందని నమ్మేవాళ్ళు. అంతా అయినతర్వాత దేవుని కింత, భూమికింత, ఆకాశానికింత, కాకమ్మకింత అంటూ ఎవరి భాగాలు వాళ్లకి పంచి మిగిలింది తలా ఇంత, చేతుల్లో పెట్టుకుని చప్పరిస్తూ, వేపగింజలు ఉమ్మేస్తూ ... అప్పుడప్పుడు మింగుతూ పెద్దబావి దగ్గరకు చేరుతారు. బావిలో దిగి చేతులు కడుక్కుని మంచినీళ్ళు తాగి వెళతారు. అయితే ఆ చింతబజ్జి పులుపు, వగరు, తీపి రుచులు కలిసి తింటుంటే ... అమృతమే అనుకోండి.

ఇంకా గృహిణుల విషయానికొస్తే ... ఎక్కువ మంది 'బారాకట్ట' ఆడేవాళ్ళు. దాయం పడింది, బారా పడింది అంటూ సంతోషించే గృహిణులు, టాంగ్, ఫిరాంగ్, ముష్టి, గోడ, కోని, అంకి, జీత్ అంటూ చిల్లగోడి ఆడేపిల్ల-



లతో ఆ ఊరు కళకళలాడుతూ వుండేది.

***************

## పార్టీలు

కక్షలు, కార్పణ్యాలు, పగలు, ద్వేషాలు, ప్రతీకారాలు, పట్టుదలలు, చంపడాలు, చంపించటాలు ఇవన్నీ రాయలసీమ వాసుల్లో వంశపారంపర్యంగా జరుగుతున్నవే అయినా వాటి మూలాల్లోకి వెళితే ఈ పార్టీలు రాయలసీమకే కాదు ఖండాంతరాలకు కూడా వ్యాపించాయి అనిపిస్తుంది. ఆధిపత్యపోరులో పెద్దరికం కోసం ఒకరి మీద ఒకరు పోటీలు పడి తమ గొప్పతనాన్ని నిలుపుకోవటం కోసం. 'జాతి ఔన్నత్యాన్ని' కాపాడుకోవటం కోసం, వంశ ప్రతిష్టను నిలుపుకోవటం కోసం దాడులు ప్రతిదాడులు జరుగుతూనే వున్నాయి. అలాంటిదే మా ఊరి కథకూడా. ఆధిపత్య పోరులో అంతా పోగొట్టుకున్న వింత కథ ఇది.

ఊరిలో శ్రీ కోదండరామాలయం పునాదులు వేసిననాడే ఆధిపత్య పోరుకు అంకురార్పణ జరిగింది. ఇంటి ఆవరణలో ఈశాన్య దిశన రామాలయం నిర్మించాలనటంతోటే ఆధిపత్యాన్ని ఎదుర్కోలేక 'రాయిపెద్ది వారు' గుడి నిర్మాణం ప్రారంభించారన్న వదంతి వుండేది. ఆలయశిఖరం నీడ ఏ ఇంటిమీద పడితే ఆ ఇంటికి అరిష్టమని, అందువల్లే సుబ్బయ్యరాయుడు వివాహం



చేసుకోనంటే చేసుకోనని భీష్మించటం, నందుల సుబ్బయ్య భార్య ఒక ఆడపిల్లను కని పరమపదించటం, నందుల సుబ్బరామయ్య పెద్దభార్య ఇద్దరు పిల్లలను కని, పిల్లలు, తల్లి మరణించటం ఈ వదంతికి ప్రాణం పోసింది.


నందుల పెద్దసుబ్బరాయుడు మాత్రం తనకు వివాహం అవసరం లేదని, తనకు ఇంకో స్త్రీతో శారీరకసంబంధం వుందని, అందుకని ఎట్టి పరిస్థితుల్లో వివాహమాడనని ఎగేసి చెప్పినా వినని పెద్దలు వంకావారి ఇంటి ఆడపడుచు సుబ్బమ్మను ఇచ్చి వివాహం చేశారు. వివాహం అయిన మొదటిరోజే పెద్దసుబ్బరాయుడు భార్యకు రెండు చేతులెత్తి నమస్కారం చేసి, 'నీవు నాకు తల్లితో సమానం. నాకు ఇంకో స్త్రీతో సంబంధం వుంది. ఈ విషయం ముందే మీ తల్లిదండ్రులకు చెప్పటం జరిగింది. నీ జీవితానికేమీ లోటు లేకుండా అన్నీ సక్రమంగానే జరుగుతాయి' అంటూ అప్పగింతలు చేశాడు.

అలా వారి వివాహజీవితం చెరిగిపోవటం, ఊర్లో పెద్దరికంతో కాలం గడపటం, తన పెద్దరికం నడిచినన్ని రోజులు చెలామణి అవటం, ఆ తరవాత ఆకస్మాకంగా పెద్ద అమ్మవారు పోసి ఆయన అకాలమరణం చెందటం .... నందుల సుబ్బయ్య, సుబ్బరామయ్యాలు పెద్దాయన చాటు మనుషులుగా అనుభవం లేకపోవటంతో 'రాయిపెద్ది' వారిది పైచేయిగా మారింది.

రాయిపెద్ది వారింట్లో పెద్ద వెంకటరమణయ్య మరణించటం, చిన్న వెంకట రమణయ్య ఇంకా పగ్గాలు తీసుకోకపోవటంతో రాయిపెద్ది 'తిరుపతమ్మ' పగ్గాలు చేపట్టింది.

(ఇంకా ఉంది)

# వేదుల సుబ్రహ్మణ్యం



## శ్రావణ శోభలు

**వరలక్ష్మీవ్రతం:**

చం. వరములతల్లి నిన్ను ప్రతివర్షము పూజలు సేయు వారికిన్
వెఱపులు బోయి కోరికలు వెంటనె తీరు గదమ్మ! నిన్ మది
న్నరసిన వారు ధన్యులు కృపామృతవర్షిణి! యట్టి భాగ్యమున్
ధరనిను గొల్చునెల్లరకు తక్షణ మిచ్చి తరింపజేయవే!

**శ్రావణ పౌర్ణమి:**

సీ. దేవతాస్థితమైన దివ్యప్రభావంబు| యజ్ఞోపవీతంబు నంటియుండి||
పరమ పవిత్రమై పరమార్థమైయుండి| యెల్లవేళల రక్షణిచ్చుచుండు||
మాతగాయత్రిని మనసార ధ్యానించి| ప్రతిదిన మొకసారి ప్రణతి జోడ్చి||
సంధ్యవార్చిన చాలు శాంతి సౌఖ్యము లిచ్చి| మనసు కట్టడి జేయు మంత్ర మిదెగ!||

తేగీ .. పారలౌకిక సాత్త్విక పథము బట్టి
బుద్ధి వికసించి సంస్కార బద్ధమౌగ
ఆయురారోగ్యభోగభాగ్యములు గల్గు
సర్వసమ్మతమై యొప్పుసాధనమిది ||

**శ్రీ కృష్ణాష్టమి:**

సీ. బాలకృష్ణుడటంచు బేలగా నెంచినా| మహిమలెన్నియొ జూపి మాయజేసి||
ఆలమందల కాయు నాకతాయివి యన| గోవర్ధనాద్రిని గోట నెత్తి||
గోపికా వస్త్రాల గుట్టుగా కాజేసి| వేలాది భామల వెంట తిరిగి||
ధర్మయుద్ధము నందు మర్మంబులను తెల్పి| గీతను బోధించి గెలుపు గూర్చి||

తేగీ .. యుగయుగంబు లధర్మము హుంకరించ
నవతరించుచు నుందు నటంచు నుడివి
విశ్వరూపము చూపించి వెన్ను తట్టు
పరమ పురుషోత్తమా! నీవె శరణు మాకు ||

**వినాయక చవితి (భాద్రపదం):**

తే. గీ. విఘ్నరాజువు నీకేమి వింత కాదు
కలియుగంబున జూడంగ కలవు నేడు |
వయసుతో బాటు పెరిగిన పసితనంబు
కాపురంబున నిక్కట్లు కలుగ నీవె? ||

జలముకై పోరు లువ్వెత్తు బలమునొంద
త్రాగు నీటికి యెద్దడి తప్పదయ్యె |
దారిదొంగల దోపిళ్ళు తాళలేక
ప్రజలలో భీతి హెచ్చయి ప్రజ్వలిల్లె ||

సంఘ విద్రోహకారులు సాయమొగ్గ
దుష్ట శక్తులు విప్పారి దొరలు చుండె |
సతము కలహాలతో నూళ్ళు పతనమొంది
మతము మార్పిళ్ళు జోరయి మితిని మీరె ||

పాపభూయిష్టమై చెల్లు బ్రతుకులందు
పూర్వసంస్కార మంతయు బూడిదాయె |
ఇంక చెప్పంగ నుడులున్న వెన్నియైన
మచ్చునకు చాలు మన్నించు మమ్ముల నిల||

# దేవుడు-దెయ్యము




## ఆంగ్ల మూలం : డా. పింగళి గోపి

తెలుగు సేత : ఎలెక్ట్రాన్


ఉదయం ఆరింటికి ఓ మగ శిశువుని ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆయాసంతో రొప్పుతున్నాడు. చేతి వేళ్లూ, కాలివేళ్లూ నీలంగా మారిపోయి ఉన్నాయి. ఆ బిడ్డ ఊరి చివరి మరో ఆస్పత్రిలో ఒక గంటకి ముందు జన్మించాడు.

ఒక పాతచీర ఒత్తిళ్లలో ఆ శిశువుని ఇద్దరు వ్యక్తులు తీసుకురావడం జరిగింది. వారిలో ఒకరు ఆ బిడ్డ తండ్రి. ఆ

క్రితంరోజు రాత్రి డ్యూటి ముగించుకొని వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్న సమయంలో వాళ్ళు రావడం మూలాన, ఇంటికి వెళ్ళే ప్రయత్నం మానుకొని వెంటనే శిశువుని చూడకలిగాను.

శిశువు బరువు 2.5 కిలోగ్రాములు. జన్మించినప్పుడు ప్రతి శిశువు ఉండే సాధారణ బరువే అది. గుండె,

ఊపిరితిత్తులూ ఉండే ఛాతీ భాగానికి, ఉదరభాగానికి మధ్య రెండింటినీ వేరు చేసే ఒక కండరపు పొర ఉంటుంది. శిశువులోని లక్షణాలు చూసి, ఎడమవైపు దెబ్బతిని హెర్నియాగా మారిందని గ్రహించాను. వైద్య పరిభాషలో కంజెనిటల్ డయాఫ్రమిక్ హెర్నియా అంటారు. అంటే పుట్టుకలోనే తలెత్తిన సమస్య అన్నమాట. ఎక్స్ రే తీసిన తర్వాత నా అనుమానం నిజమేనని నిర్ధారణయింది. వెంటనే ఎన్ఐసియులో (నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్) చేర్చాను. అంటే శిశు నిత్యశ్రద్ధా పర్యవేక్షణ విభాగంలో.

అప్పటికే క్రితం రాత్రి డ్యూటీ చేసి అలసటగా ఉన్నా, శిశువును తీసుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులనూ కూర్చోబెట్టి, వారికర్థమైయేటట్లుగా బొమ్మలు గీసి సమస్యను వివరించాను.

ఛాతీ, ఉదరభాగాలకి మధ్యగానున్న కండరపు పొరలో రంధ్రమున్న కారణంగా, ఉదరభాగంలో ఉండే చిన్నప్రేగులు లుంగలు చుట్టుకొని గుండె, ఊపిరితిత్తుల కుహరంలో ప్రవేశించి ఒత్తిడి కలిగించడం మూలాన శ్వాస తీసుకోవడం కష్టమైపోతుంది. రక్త ప్రసరణలో అవరోధం కలుగుతుంది. అందుచేత శస్త్రచికిత్స చేసి, ప్రేగులని ఉదరభాగంలోకి నెట్టి, సవరించి, కండరపు పొరలో ఉన్న రంధ్రాన్ని కుట్టి మూసివెయ్యాలి. శస్త్ర చికిత్స జరిగిన తర్వాత, ఊపిరితిత్తులు ఒకవేళ బలహీనంగా ఉంటే, వెంటిలేటర్ సహాయంతో (కృత్రిమ శ్వాస పరికరం) శ్వాసప్రక్రియ సరిగా పుంజుకొనే వరకూ చికిత్స చెయ్యాలి. ఆ పక్షంలో రోగి మరికొంత కాలం ఆస్పత్రిలో ఉండాల్సి వస్తుంది. ఉభయరీత్యా ఖర్చులు పెరుగుతాయి.

బిడ్డ తండ్రికి ఖర్చుల అంచనా వేసి చెప్పాను. ఒకవేళ అనుకోని సమస్యలు తలెత్తితే కొంత అదనంగా పది పదిహేను శాతం ఖర్చులు పెరగొచ్చునని చెప్పాను. ఇటువంటి శస్త్ర చికిత్సల్లో ఎంత శాతం బిడ్డలు బ్రతికి బట్ట కడ్తారని ప్రశ్నించాడు. ఆ ప్రశ్న సజావైనది కాదని అనలేము. సంవత్సరాలు మీద పడ్డా వృద్ధుల ఆరోగ్య సమస్యల విషయమై కని, పెంచిన ప్రేమాభిమానాలు కారణంగా, లేదా లోకనింద భయంతో - ఏ కారణంగానైనా సొమ్ములు ఖర్చుబెట్టే సంతానం, ఒక రోజు వయసుగల తమ బిడ్డమీద క్లిష్టమైన శస్త్రచికిత్సకోసం అంత ఖర్చుచెయ్యాలా అన్న ఆలోచన రాక తప్పదు. ఆ లెక్కలు ఖచ్చితంగా చెప్పలేమనీ, కాని మా ఆస్పత్రి చరిత్ర లో 80 శాతం వరకూ విజయం లభించిందని చెప్పాను. ఆలోచించుకోడానికి కొంత సమయం కావాలన్నాడు. అలాగే తప్పక తీసుకోమని, ఒకవేళ ఆ బిడ్డని ఈ ఆస్పత్లో ఉంచడానికి ఇష్టపడకపోతే, కార్పొరేట్ ఆస్పత్రి-

లకు కానీ, ప్రభుత్వ పెద్దాసుపత్రికి కానీ వెంటనే తీసుకుపోవచ్చునని చెప్పాను.

ఇద్దరూ బయటకి పోయి వరండాలో కూర్చుని ఏవో మాట్లాడుకొని ఓ అరగంట తర్వాత వచ్చారు. బిడ్డ తండ్రి 'తమకా బిడ్డ పెళ్ళయిన ఆరేళ్ళకి పుట్టాడని, సాధ్యమైనంత శ్రద్ధతీసుకొని ఆపరేషన్ చెయ్యమనీ, తను సామాన్య గృహస్థుడనీ, అందుకని బిల్లులో రాయితీ ఇమ్మ'ని అర్థించాడు. శ్రద్ధగా ఆపరేషన్ చెయ్యడం జరుగుతుందనీ, చార్జీల విషయమై నాకు స్వతంత్రత ఉండదనీ, అయితే ఆస్పత్రి వారు ఈ ఆపరేషన్ చేసినందుకు నా కిచ్చే సొమ్ములో 50 శాతం రాయితీ ఇమ్మని సిఫారసు చేస్తానని చెప్పాను. అలాగేనని తలలూపారు.

ఏమైతేనేం, శస్త్రచికిత్సకు ముందు చేయాల్సిన కొన్ని పరీక్షలు చేసి, సూది మందులిచ్చి, శిశువు స్థితిని స్థిరపరచి, సాయంకాలం నాలుగింటికి ఆ బిడ్డకి ఆపరేషన్ చేయడం జరిగింది. అప్పటివరకూ శ్వాస కోశం శ్రమించిన ఊపిరితిత్తులు కాస్త బలహీనంగా కనబడ్డంతో ముందు జాగ్రత్తగా పరిమితి స్థాయిలో వెంటిలేటర్ పెట్టడం జరిగింది.

నేను ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు వస్తున్న సమయంలో సరిగా ఇటువంటి కేసే మరొకటి నా కోసం ఎదురు చూస్తోంది. బిడ్డ జన్మ క్రితం రోజు పక్క ఊరిలో జరిగింది. బిడ్డ శ్వాస ఇబ్బందిగా మారడంతో స్థానిక శిశువైద్య నిపుణుడు ఆ కేసుని మా ఆస్పత్రికి తరలించాడు. బిడ్డని ఇరువురు వ్యక్తులు, ఒక వృద్ధస్త్రీ తీసుకువచ్చారు. బిడ్డ తండ్రి బొంబాయిలో ఏదో ఖార్ఖానాలో పనిచేస్తున్నాడనీ, బయలుదేరి వస్తున్నాడనీ చెప్పారు. వాళ్ళని కూర్చో బెట్టి కేసుని గురించి చెప్పాను. వెంటనే ఎన్ఐసియులో చేర్చి, పూర్వ పరీక్షలు చేసి, వెంటిలేటర్ మీద పెట్టి, ఆ తెల్లవారు ఝామున అయిదింటి ఆపరేషన్ చేయడం జరిగింది. సమస్య పరంగా అవసరం ఉండడం చేత వెంటిలేటర్ మీద పెట్టాను.

మూడోరోజుకి ఇద్దరి శిశువుల ఆరోగ్యం క్షీణించడం మొదలైంది. రక్తంలో సెప్టిక్ లక్షణాలు కనిపించాయి. అప్పుడే పుట్టిన బిడ్డల్లో ఈ సమస్య సర్వ సాధారణంగా జరిగి, అతి వేగంగా దేహం లోని అవయవాలన్నీ దెబ్బ తింటాయి.

వెంటనే వెంటిలేటర్ ఉధృతిని పెంచడం జరిగింది. తర్వాత నాలుగైదు రోజులు బిడ్డల పరిస్థితి అటూ ఇటూ ఊగిసలాడడం జరిగింది. ఒక సమయంలో పుంజుకున్న లక్షణాలు కనబడి ఆశావాహంగా ఉన్నప్పుడు, వెనువెంటనే పరిస్థితి క్షీణించడం జరిగింది. ఎప్పటికప్పుడు బిడ్డల తండ్రులకు పరిస్థితి వివరిస్తూనే ఉన్నాం.

మొదటి బిడ్డ తల్లిదండ్రులు మాతో బాటు ఆందోళన చెందుతున్నా, రెండో బిడ్డ తాలూకువారు మట్టుకు నిమ్మకు నీరుపోసినట్టు స్తబ్ధుగా ఉండిపోయారు. పరిస్థితి విషమంగా ఉన్నప్పుడు నర్సుల మీద బాధ్యతల భారం పెట్టకుండా, రెండు రాత్రులు ఎన్ఐసియు లోనే కప్పులకొద్దీ కాఫీ తాగుతూ ఉండిపోయాను.

ఏడోరోజుకల్లా మొదటి బిడ్డ స్థిరపడి పుంజుకోసాగాడు. రెండో బిడ్డ పరిస్థితి మట్టుకు మరింత క్షీణించసాగింది. చూడ్డానికి వచ్చే రెండో బిడ్డ తాలూకు బంధువుల తాకిడి నెమ్మది నెమ్మదిగా తగ్గిపోయింది. కేవలం ఆ వృద్ధ స్త్రీ మట్టుకే మిగిలిపోయింది. వైద్యం కొనసాగిస్తూ విశ్వ ప్రయత్నం చేశాము.

మొదటి బిడ్డ మరో అయిదురోజుల్లో పూర్తిగా కోలుకున్నాడు. కుట్లు విప్పేసి, ఆస్పత్రి నుంచి విడుదల చేయొచ్చుని చెప్పాను. బిడ్డ తల్లిదండ్రులు నన్ను నా గదిలో కలుసుకొన్నారు.

కళ్లలో నీళ్లు నింపుకొంటూ, లేక లేక పుట్టిన తమబిడ్డను నేను దేవుడిలా కాపాడానని కృతజ్ఞతలు తెలుపుకొంటూ, వంగి నా కాళ్ళు ముట్టబోతే వారించాను. అప్పుచేసి ఆస్పత్రి ఛార్జీలు ఇవ్వాల్సిన పరిస్థితి అనీ, కనికరించవలసిందనీ వేడుకొన్నారు. నాకు రావాల్సిన రుసుములో ఏభై శాతం తగ్గిస్తున్నానని, అదనంగా ఏదైనా తగ్గించాలంటే యాజమాన్యం యిష్టమనీ రాసి పంపించేశాను.

ఆస్పత్రివారు కేసు విజయవంతమైనందుకు సంతోషంగా తమ వంతు ఓ పది శాతం తగ్గించారు. ఏది ఏమైతేనేం, అతని వాస్తవ ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా,

మొరలతో రాయితీ పొందాడు.

ఆరోజు సాయంత్రం రెండో శిశువు మరణించింది. ఆస్పత్రి ఛార్జీలకీ, మందులకీ 15,000 ఇవ్వాల్సి ఉంది. ఆ సమయంలో ఆ వృద్ధ స్త్రీ మట్టుకే ఆస్పత్రిలో ఉంది. శిశువు తాలూకువారికి అ సంగతి చెప్పి, ఆ బిడ్డని తీసుకుపోవాల్సిందిగా ఆమెకు చెప్పడం జరిగింది. బిడ్డ తాలూకు వారికి చెప్పి, ఆ మర్నాడు వారిని పంపిస్తానని ఆ వృద్ధ స్త్రీ వెళ్లిపోయింది.

అనుభవ రాహిత్యం వల్ల ముందుగా కొంత సొమ్ము నిర్మొహమాటంగా తీసుకోవడ మనేది జరగలేదు. ఆస్పత్రి చిన్నది. ముగ్గురు డాక్టర్లతో ఓ పెద్దమనిషి తన తల్లి పేరిట ఆస్పత్రిని మొదలుపెట్టి రెండు సంవత్సరాలైంది.

ముదరా(అడ్వాన్సు) తీసుకోవడం ఈ కాలపు ఆస్పత్రులకు ఒక నియమం. చిన్న పట్టణాలలో స్వంత ప్రాక్టీసు పెట్టుకొనే డాక్టర్లు పూర్తిగా తమంత తామే ఆటుపోట్లకు తట్టుకోవాలి. వ్యవస్థాగతమైన రక్షణ అంతగా ఉండదు.

అయితే సమయం చాలా గుణపాఠాలు నేర్పుతుంది.....

ఆ మర్నాడు ఉదయం రెండు ట్రాక్టరు ట్రాలీల నిండా ముప్పైమంది దాకా వచ్చి, వైద్యం చేసిన డాక్టర్ని చూడాలని నినాదాలు చెయ్యడం ప్రారంభించారని నాకు ఫోన్ వచ్చింది. వెంటనే ఆస్పత్రికి బయలుదేరి వెళ్ళాను. ఆస్పత్రి బృందం నన్ను ఆ గుంపు మధ్యనుంచి జాగ్రత్తగా లోపలికి తీసుకు పోయింది. ఓ పదిహేను మంది నా గదిలోకి చొరబడి గొడవ చెయ్యసాగారు. నాటుసారా వాసనలతో గది నిండిపోయింది. యాజమాన్యం, పోలీసుల్ని, మా ఊరి డాక్టర్ల సంఘం తాలూకు అధ్యక్షుణ్ణీ పిలిచింది. శిశువు చావు నా నిర్లక్ష్యం వల్లనే జరిగిందని ఒకటే అరుపులు. శిశువు సమస్యని గురించి చెప్పి, మేము అన్నివిధాలైన జాగ్రత్తలూ తీసుకొన్నా ప్రయోజనం లేకపోయిందని చెప్పాను.

ఎంత చెప్పినా వారూ వినే పరిస్థితిలో లేరు. బిడ్డని ఆరోగ్యవంతమైన స్థితిలో ఆస్పత్రికి తీసుకు రావడం జరిగిందని, ఇప్పుడు బిడ్డని చంపి అందిస్తున్నారని ఒకడు చాలా భీకరంగా అరిచాడు. మేము డాక్టర్లమనీ, రోగిని బ్రతికించడానికే పాటుపడ్డాము కానీ చంపడానికి కాదని చెప్పాను. 'బిడ్డను ఆస్పత్రికి తీసుకువచ్చిన సమయానికే శ్వాస తీసుకోలేక తీవ్రంగా బాధ పడ్తున్నాడు. అందుకేగా మీరా శిశువుని ఆస్పత్రికి తీసుకురావడం జరిగింద'ని ఎదురు ప్రశ్నించాను.

మహా శ్రద్ధ తీసుకొని బిడ్డని మేము చంపివేశామనీ,. వాళ్లకిప్పుడు నష్టపరిహారం కావాలని అరుపులు మొదలుపెట్టారు.

వాళ్ళు లక్షరూపాయలు వైద్యం కోసం ఖర్చుపెట్టారట!. ఆ డబ్బంతా తిరిగి యివ్వాల్సిందేనట! సరిగా ఆ సమయంలో పోలీసుల కన్నా ముందుగా ఓ నలుగురు మా ఊరి డాక్టర్లు వచ్చారు. వారిలో ఉన్న మా డాక్టర్ల సంఘం అధ్యక్షుడు, అందోళనకారులకు ప్రతిగా సమాధానాలు చెప్పనారంభించాడు. వాళ్ళు దురుసుగా మాట్లాడ్డంతో గొడవ ఉధృతమవడం మొదలైయ్యింది! వాళ్ళు ఘర్షణపడ్తున్న సమయంలో ఆ రోజు ఆ శిశువుని తీసుకొచ్చిన వ్యక్తులు ఎవరైనా ఆ గొడవచేసే గుంపులో ఉన్నారేమోనని గమనించాను. ఎవరూ లేరు! అందరూ కిరాయి మనుషులేనని అనిపించింది.

'పైసా తీసుకోకుండా వైద్యం ప్రారంభిస్తే లక్షరూపాయలిచ్చామంటూ గొడవచెయ్యడానికి మీకెవర్రా సొమ్ములిచ్చి దాడికి పంపింది!? మీకు ఒక్క నయాపైసా కూడా యిచ్చేదిలేదు. కావాలంటే కోర్టులో కేసు వేసుకోండి. మా అశ్రద్ధ కారణంగా బిడ్డ మరణించిందనుకొంటే శవపరీక్షకు అప్పీల్ చేసుకోండీ!' అని అధ్యక్షుడు గట్టిగా చెప్పడంతో వాళ్ళు కొంత తగ్గారు.

అంతలో పోలీసులు వచ్చారు. వాళ్ళముందు మళ్ళీ వాదోపవాదాలు జరిగాయి. నాలో కోపం రగిలిపోతున్నా నిస్సహాయంగా చూస్తూ కూర్చోడమే తప్ప ఏమీ చెయ్యలేకపోయాను. వచ్చిన పోలీసు అధికారి గుంపుని కాస్త సమాధానపరిచి, వేచి ఉండమని బయటకి పంపాడు.

ఆ లోపుగా ఉన్నత పోలిసు అధికారులకి కొంతమంది రాజకీయ నాయకులు ఫోన్లు చెయ్యడం జరిగిందని తర్వాత తెలిసింది. పత్రికా విలేఖరులు ఆస్పత్రి వరండా లోని మూకలో కలిసిపోయి, డాక్టర్ల ని-

ర్లక్ష్యం మీద ఉపన్యాసాలివ్వసాగారు. అంతలో ఆస్పత్రికి వచ్చిన పోలీసు అధికారికి ఎస్. పి. నుంచి ఫోన్ కాల్ వచ్చింది. విని, సెల్ మూసి మాతో అన్నాడు. 'కోర్టుకి వేడితే అనవసరంగా ఇరుపక్షాలవారికీ ఇబ్బందులుంటాయనీ, ఇటు డాక్టర్లకీ, అటు బిడ్డ తల్లిదండ్రులకీ మనశ్శాంతిలు కరువౌతాయనీ, అందుకని మానవతా దృక్పథంతో ఆస్పత్రికి రావాల్సిన చార్జీలను తీసుకోకుండా సమాధానపడిపోతే, వేరే నష్టపరిహారం లేకుండా సమస్య తీరిపోతుందని చెప్పమన్నారు. నిజం మీ పక్షాన ఉంది కదాని మంకుపట్టు పడితే, వాళ్ళు రాళ్ళు రువ్వడం ప్రారంభిస్తే పరిస్థితి విషమమౌతుందని ఎస్.పి. గారు హెచ్చరించారు!" అన్నాడు.

ఆ సమాచారం వింటూనే నా ఒళ్ళంతా మండిపోసాగింది. యాజమాన్యం మెత్తబడిపోయింది. ఆ తల్లిదండ్రులకి ఒక బిడ్డ పోయి ఉండొచ్చు. కాదనలేని సత్యం. కానీ ఓ డాక్టరుగా నా మీద ప్రజలకున్న నమ్మకానికి, నామీదే నాకున్న నమ్మకానికీ తీవ్రమైన ఘాతం కలిగింది! ఇది నాకే కాదు, వైద్యవ్యవస్థకే పెను ముప్పు.

అంతవరకూ కంటికి కనబడకుండా దోబూచులాడిన శిశువు తండ్రి నన్నూ, ఆస్పత్రి సిబ్బందినీ బండబూతులు తిడ్తూ ఎన్ఐసియు లోంచి తన బిడ్డ మృతదేహాన్ని తీసుకుపోయాడు. మర్నాటి దినపత్రికల్లో మా ఆస్పత్రి నిర్లక్ష్యాన్ని గురించి చిలవలు పలువులుగా ఏకపార్శ్వ దృష్టితో సృష్టించిన వార్తలే వార్తలు.

ఇద్దరు రోగులు. ఒకటే సమస్య. ఇద్దరికీ ఎంతో శ్రద్ధగా, పద్ధతిగా వైద్యం జరిగింది. ఒక బిడ్డ బతికి తల్లిదండ్రులు నన్ను దేవుడిగా స్తుతించారు. మరణించిన బిడ్డ తాలూకు వారు నన్ను దెయ్యంగా నిందించారు.

'జయాపజయాల ప్రసక్తి లేకుండా నీ ధర్మం నువ్వు నిర్వహించు. ఫలితం నీ చేతిలో లేదు!' వేల సంవత్సరాలనాటి శ్రీకృష్ణుని గీతా ఉవాచ జ్ఞప్తికి వచ్చింది.

ఆస్పత్రికి రావాల్సిన సొమ్ముల్ని గురించి చెప్పడానికి కాదు కాని-ఇంతకీ జరిగిందేమిటంటే- ఇద్దరూ ఆస్పత్రి నుంచి ఒకరు రాయితీ రూపంలోనూ, మరొకరు నిందాపూరితమైన ఎగవేతతోనూ లాభమే పొందారు.

ఒకే వ్యక్తిని మేలు చేసే దేవుడిగా, పీక్కుతినే దెయ్యంగా చిత్రీకరించిన ప్రజల మనస్తత్త్వాన్ని జీర్ణించుకుంటూ, యిద్దర్నీ నిస్సహాయంగా నాలోనే ఇముడ్చుకొన్న నేను, ఇంటికి పోయి, స్నానం చేసి, రాత్రి భోజనం చేసి, రేపటికోసం సిద్ధపడ్తూ పడకనెక్కాను. రేపటి రోజు రేపే!

*******

---

## దురాశే .... పిశాచం

(36 వ పేజీ తరువాయి)

మిగిలిన ఆ ఆరూ అరిషడ్వర్గాలు.

ఆ ఏడవదాన్ని నింపను ఎవ్వరివల్లాకాదు.ఇప్పటికైనా తెలివితెచ్చుకుని ప్రజా సంక్షేమం కోసం పాటుపడి తాతతండ్రులపేర్లు నిలుపు. ప్రజలనుసుఖపెట్టు. ఆశాపాశం నాశనానికి దారి తీస్తుందని తెల్సుకో--" అని-మాయమయ్యాడు సాధువు.

ఆ ఏడు బానలూ మాయమయ్యాయి. ప్రజాధనం అలాగేవుంది. తనతప్పు తెల్సుకున్న ధనవర్మ ఆ ధనాన్నంతా ప్రజాసంక్షేమంకోసం ఖర్చు చేసి, ప్రజాహితకార్యక్రమాలన్నీ యధాప్రకారం కొనసాగించి, తనతప్పులన్నీ సరిది ద్దుకుని, దురాశాపిశాచాన్ని తరిమేసి,తల్లి తండ్రులనూ ప్రజలనూ ఆదరంతో చూసుకుంటూ, జనరంజకంగా పరిపాలించి, మంచి పాలకుడిగాపేరుతెచ్చుకున్నాడు. ధనవర్మగా కాక ధర్మవర్మగా పేరుపొందాడు.

# నేమాని సూర్యనారాయణ



## 'అవును ఈ చీర నాదే'

అవును ఈ చీర అప్పటిదే. మా వివాహం జరిగిన పాతికేళ్ళ ముచ్చట నాడు ఆయన కొన్నది. ఆ రోజున ఎంత రభస జరిగిందని! వద్దని నేను, తప్పదని ఆయన. పూర్తి ఇష్టం ఉన్నా ఎక్కడో ఏమూలో ఓ చిన్న బాధ. దీని ఖరీదు అప్పుడు ఆరు వేల రూపాయలు. ఇది ఆయన ఉద్యోగంలో వచ్చిన జీతంతో కొన్నది కాదు. తాహసీల్దారుగా ఆయనకు వచ్చే పైడబ్బులతో కొన్నది కాదు. ఊళ్ళో ఇచ్చిన అప్పులమీద వడ్డీతో కొన్నది కాదు. మావాళ్లు ఇవ్వలేదు. వాళ్ళ వాళ్ళు సరేసరి. మరి ఎలా వచ్చింది?

మేం గుటూరులో కాపురం ఉంటున్నాం. అంతకు ముందు ఆరునెలల క్రితం మా నాన్నగారు నాకిచ్చిన ఎకరం పొలంలో 'మిరప తోట వేస్తాను' అన్నారు. మనుషులు దొరకడం కష్టంగా ఉంది. ఇప్పుడెందుకు అక్కడ? ఏపైనా మామిడి వంటి మొక్కలు వెయ్యొచ్చుకదా అన్నాను. ఆయన వినలేదు. మా ఇంటికి ఓ కిలో మీటర్ దూరంలో ఉంటుంది ఆ తోట. మొండి మనిషి నా మాట వినకుండా పొలం దున్నించి మొక్క వేశారు.

రోజూ ఉదయాన్నే వాకింగ్ కి వెళ్ళి అక్కడ ఆయనే తోటకు నీరు పెట్టేవారు. సంరక్షణ చేసుకొనే వారు. సెలవురోజుల్లో నేను, పిల్లలు కూడా ఆయనకు తోడుగా వెళ్ళేవాళ్ళం. తోట ఏపుగా పెరిగింది. పని వాళ్ళను పెట్టుకోకుండా ఆయనే వ్యవసాయం చేసుకొనేవారు. మంచి దిగుబడి వచ్చింది. పంట అమ్మితే సరిగ్గా ఆరు వేల రూపాయలు వచ్చాయి.

'ఇది నీదే. మీ నాన్న నీకోసం ఇచ్చిన భూమిలో మీ ఆయన చెమటోడ్చి పండించిన పంటను అమ్మితే వచ్చిన డబ్బు ఇది. ఇందులో మోసం లేదు, దగాలేదు. కనుక మన 25వ పెళ్లిరోజుకు మంచి చీర కొనుక్కో' అన్నారు. పిల్లలకు ఏమైనా కొంటాను అంటే ఒప్పుకోలేదు. అందుకే ఇందాక చెప్పాను ఇష్టమైనా కష్టంగా కొనుక్కున్న చీర ఇది.

అనుకున్న పండుగ రానే వచ్చింది. అదృష్టం బాగుంది. ఆరోజు ఆదివారం. సెలవు రోజు. ఇంట్లోనే ఉన్నారు. ఉదయాన్నే లేచి పిల్లల్ని తయారు చేసి, పాయసం వండి, దేవుడికి నైవేద్యం పెట్టి ఆప్రసాదాన్ని నా పతిదేవుడికి, ఆయన నాకిచ్చిన ఈ పిల్ల దేవుళ్ళకి పెట్టి నేనూ కొంచెం కప్పులో వేసుకొని తినడం మొదలు పెట్టాను.

అప్పుడడిగారు "ఆ చీర కట్టుకోలేదేం" అని. "అది మీకోసం దాచి ఉంచాను. రాత్రి కట్టుకుంటాను. ఇప్పుడు పెద్దమ్మాయి పెళ్ళికి కొనుక్కున్న చీర ఉంది అది కట్టుకుంటాను" అన్నాను. అక్కడక్కడ తెల్లబడుతున్న బొద్దుమీసాల వెనుకనుండి ఓ చిరునవ్వు నవ్వారు. పెద్దది అత్తారింటికి వెళ్లిపోయింది. కొడుకు, చిన్న కూతురు ఇక్కడే ఉన్నారు. కనుక మరే దుందుడుకు పనులూ చేయలేదు.

రాత్రయ్యింది. పిల్లలకు, ఆయనకు భోజనం పెట్టి, నేనూ కొంచెం తిని పదిగంటలకల్లా పడగ్గది చేరుకున్నాం. కొత్త చీర కట్టుకున్నాను. చిలకాకు పచ్చ రంగు ఆయనకి చాలా ఇష్టం. దానికి మాచ్ అయ్యే జాకెట్టు, బంగారు నగలు ధరించాను. "ఈ సమయం లో చీర ఎందుకు,

విప్పెయ్యి" అన్నారు. "మీరు వ్యవసాయం చేసి సంపాదించిన డబ్బుతో కొన్న చీర ఇది. ముడి బిగిస్తారో విప్పేస్తారో మీ ఇష్టం".

ఆనాటి చిలిపి అల్లరి ఇప్పటికీ గుర్తుంది. ఇప్పుడాయన లేరు. నన్ను విడిచి వెళ్ళి పది సంవత్సరాలు అయ్యింది. పెద్దది పూనా లో సెటిల్ అయ్యింది. చిన్నది అమెరికా ఎగిరిపోయింది. కొడుకు కోడలు ఇక్కడే ఉన్నారు. వాళ్ళ నాన్నగారు ఉద్యోగం చేసిన ఆఫీసు లోనే తానూ పని చేస్తున్నాడు. వాడికి, కొడలికి నేనంటే ప్రాణం. నాకు మూడో కూతురు నా కోడలు. కూతుళ్లతో చెప్పుకోలేని కొన్ని విషయాలను కూడా నేను కోడలుతో చెప్తూ ఉంటాను. ఈ రోజుకు మా పెళ్లి అయ్యి సరిగ్గా 40 సంవత్సరాలు అయ్యింది.

ఆయన లేరు. వెళ్ళిపోయి పది సంవత్సరాలు అయ్యింది. ముద్దూ ముచ్చట్లు లేవు. నా ప్రపంచమంతా నా పిల్లలూ, మనవలే. ఈ వాడిన వసంతంలో ఓ చిగురుటాకు నా కోడలు. నా మనసు కష్టపడిన ప్రతీసారీ ఆమే ముందుకు వచ్చి మంచి మాటలతో నన్ను ఓదార్చేది.

అబ్బాయి పెళ్లి చేసుకొని ఈ అమ్మాయిని తీసుకొని మా ఇంటికి వచ్చిన రోజు మా వారి విశ్వరూపాన్ని చూసి నేనెంతో భయపడిపోయాను.

వారం తిరక్కుండా నాతో మాట్లాడడం తగ్గించిన విషయం గ్రహించడానికి నాకు సమయం పట్టింది. ఆయనను మొత్తం నాకు కాకుండా చేసేసింది. ఏ అవసరం వచ్చినా అమ్మా! పద్మా! అంటూ తనతోనే మాట్లాడేలా చేసుకుంది. నాకు ఆరోగ్యం అంతంత మాత్రమే. సమయానికి ఆయనకి భోజనం పెట్టడానికి కూడా నాకు ఓపిక రావడం లేదు. ఆయాసం తో బాధపడుతున్నాను. ఇన్నాళ్ళకి మళ్ళీ ఆయనకు సమయానికి అన్నం పెట్టగలిగిన తల్లి మా ఇంట్లో అడుగు పెట్టింది. అంతే ఆమె నాకూ అమ్మ అయిపోయింది. అప్పటినుండి ఇప్పటివరకూ నేను ఏ కష్టం లేకుండా ఈ ఇంట్లో కాలం గడిపేస్తున్నాను. ఆయన వెళ్ళిపోయిన ఈ పది సంవత్సరాలూ నేను ఈ చీరల పెట్టెను అసలు తీసి చూడలేదు. అమ్మా! పద్మా ఆ పెట్టె ఓసారి తెచ్చిపెట్టు అన్నాను. అది తుంటరి. ఓహో ఈ రోజు మీ పెళ్లిరోజు కదా! మా మావగారు గుర్తుకొచ్చేరా? అని అడిగింది. నా కూతుళ్ళు అయితే అలా అడగలేరు కదా! నేను నవ్వుకున్నాను. చీరల పెట్టి తెచ్చి నా దగ్గర పెట్టింది. అందులోంచి ఇప్పుడు ఈ చిలకాకుపచ్చ రంగు చీర తీసి ఒళ్ళో పెట్టుకొని మురిసిపోతున్నాను.

'అత్తయ్యా! ఆ చీర నాది. దాన్ని నలిపెయ్యకండి' అని ముసి ముసి నవ్వులు నవ్వుతోంది. 'అదెలాగే? తల్లి చీరలు కూతుళ్ళవే కదే!' అన్నాను. నిజమే. తల్లిపెద్దది అయితే మీరు చెప్పినది కరక్టే. కానీ ఇక్కడి విషయం అది కాదు. కూతురు చిన్నప్పుడు కట్టుకోలేని చీరలు తల్లే కదా కడుతుంది. అత్తయ్యా! ఇప్పుడు మీరు పట్టు చీరలు కట్టే పరిస్థితిలో లేరు. అంత బరువైన చీరలు మీరు కట్టలేరు. పైగా మీ పిల్లలు అమెరికాలోనూ, పూనాలోనూ ఉన్నారు. వాళ్ళు ఇప్పుడు చీరలు కట్టే పరిస్థితుల్లో లేరు. కట్టినా ఆ చీరలో అందాలు చూసి మురిసి పోవడానికి మీరు దగ్గర ఉండరు కదా! నేనయితే మీ కళ్ళముందే ఉంటాను. జాకెట్టు కూడా నాకు సరిగ్గా సరిపోతుంది.

"అత్తయ్యా! మీకు ఇంకో విషయం చెప్పనా! క్రిందటి సారి పెద్దాడపడుచు శిరీష అమెరికా నుండి వచ్చినప్పుడు, మీకు తెలియకుండా నేను తనని అడిగాను. ఈ చీరలు పెట్టెలో అలాగే ఉండిపోతున్నాయి తీసుకెళ్లి కట్టుకోమని. ఆమె 'వద్దు వదినా! అక్కడ ఇలాంటివి కట్టుకోలేము. అలాగని దాచి ఉంచడానికి కూడా మా ఇల్లు సరిపోదు. ఇక్కడే ఉండనీ అమ్మకు గుర్తుకు వచ్చినప్పుడల్లా చూసి మురిసి పోతుంది' అంది. మావయ్యగారి ఆబ్దీకానికి వచ్చినప్పుడు చిన్నదాన్ని అడిగాను. సమీర కూడా



ఇంచుమించు అలాగే చెప్పింది. మరి 'ఇంక నాకు తప్పదు కదా' అని అంటానేమో అనుకుంటున్నారు కదూ! నేనంతటి మాట అనలేను.

ఎందుకంటే మీరు నాకు అత్త మాత్రమే కాదు, జన్మను ఇవ్వకపోయినా మా అమ్మ మీరు. మా వివాహం జరిగిన నాలుగేళ్ల తరువాత విహారయాత్రకు వెళ్ళి రాజమండ్రి గోదావరిలో మా అమ్మా, నాన్నా మునిగి చనిపోయినప్పుడు, 'నాలో మీ అమ్మను చూసుకో' అన్నారు. అలాగే నన్ను మీ గుండెల్లో పెట్టుకొని చూసుకొన్నారు. ఇన్నాళ్లూ నేను మీకు సేవచేశానని అందరూ అనుకుంటున్నారు. కాదు అత్తయ్యా! నిజానికి నన్ను మీ గుండెల్లో పెట్టుకొని పెంచి పెద్ద చేశారు. ఏం చేసి నేను మీ ఋణం తీర్చుకోగలను? మీరంటే నాకు భయం, భక్తీ అన్నింటికీ మించి గుండెల నిండా మీ మీద ప్రేమ" ... ఇంకా ఏవేవో చెప్తోంది. నా కళ్ళు గంగా యమునలు అయ్యాయి. ఎవరు చెప్పారు అత్తాకోడళ్ళు శత్రువులుగా ఉంటారని. ధారగా కన్నీటి చుక్కలు నా ఒళ్ళో ఉన్న చీరమీద పడ్డాయి.

"థాంక్ యూ అత్తయ్యా! ఇన్నాళ్లూ అనేక రకాల మచ్చలతో నిండిన ఈ చీర ఈ నాడు మీ ప్రేమ పూరిత కన్నీటి చుక్కలతో నిండి పోయింది. ఇది దేవుడు మీద్వారా నాకిచ్చిన వరం. ఇంక ఈ చీర నాదే" అంది. తరువాత ఏం జరిగిందో గుర్తు లేదు ఆ చీర ఆమె చేతుల్లో ఉంది. కొద్ది సేపట్లో ఆమె శరీరం మీద ఉంది. నా కళ్ళల్లో మళ్ళీ నీళ్ళు తిరిగాయి. నా చీర తాను కట్టిందనా? కాదు కాదు నా ప్రేమను తన ఒంటిండా చుట్టుకుందని. భగవంతుడా! మరో కొడుకునో, కూతుర్నో కనలేక ఆ నాడు ఆపరేషన్ చేయించుకున్న నాకు ఇలా మరో కూతుర్ని కోడలిగా ఇచ్చావా? నీకు నా కృతజ్ఞతాంజలులు దేవా!

'ఈ చీర నాదే! మా అత్తగారు నాకు ఇచ్చారు, చూడమ్మా' అంటూ వాళ్ళ అమ్మ నాన్న ల ఫోటో కి చూపిస్తూ, తనలో తను చెప్పుకుంటూ వంటగదిలోకి వెళ్లిపోయింది పద్మ - నాకోడలు కాదు - నా మూడో కూతురు.

(సరదాగా ఓ చిన్న caption రాద్దామని మొదలు పెట్టాను. చివరికి కథలా ఇలా ముగిసింది.)

- నేమాని సూర్యనారాయణ

## రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంపవలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు


చైతన్యం సంకల్ప బలం

### చందా రేట్లు

| | |
|---|---|
| విడిప్రతి | రూ. 20.00 |
| సంవత్సరానికి | రూ. 200.00 |
| పోస్ట్ ద్వారా | రూ. 230.00 |

Please deposit your subscription in favour of
**CHAITANYAM SANKALPABALAM**
**A/c No. 1626201002070 - Canara Bank**
Kundanbagh Branch, Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:
**చైతన్యం**
సామాజిక విలువల మాస పత్రిక

ప్లాట్ నంబర్ 45058
జనప్రియ ఉటోపియా
హైదర్ గూడ , అత్తాపూర్
హైదరాబాద్ - 500 048

Email: teega51@gmail.com
Visit: www.chaitanyam.net

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

**ఆధారాలు : 1) య = అసలు అక్షరం 'మ'; 2) ప = అసలు అక్షరం 'న'**

**అంట యాట్లయుప పెడ్డలు చరదిప - ఎంట యాట్లయే పీడు**
**ఎంటులాంటలయు రెందిదూవ గిం - వంటే పిన్నతి మప్పత్రు**
**1. పీడరప బొలటే రేచు యలి - పీలు జొరచి టాయెలను**
**ఏడర ఘూబీలఛి చలిగాడుర - ఏ కరయే డూలిపమత్రు**
**స్లీ డేంజతనటి పీడ్డెటే యయు - కేజొపిడుప్ప చైడయపి**
**మీడర పేపీ సలశపిమెచపు - మిచిమే నలటట్డయు పాజు**

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

బ్రహ్మ గడిగిన - పాదము
బ్రహ్మము దానె నీ - పాదము
1. చెలగి వసుధ గొలి - చిన నీ పాదము
బలితల మోపిన - పాదము,
తలకక గగనము - దన్నిన పాదము
బలరిపు గాచిన - పాదము

జూలై నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు: శ్రీ టి దుర్గాభవాని,ఏలూరు
శ్రీ గోనెళ్ళ రామకృష్ణ

# చాగంటి కృష్ణ కుమారి



## రసాయనాలు – పరిసరాలపై వాటి ప్రభావం

ఈ భూమి మీద వున్న జీవ, నిర్జీవ రాశులన్నీ రసాయనాలతో తయారైనవే! మన పరిసరాలలోని చాలా రసాయనాలు ప్రకృతి-సిద్ధంగా ఏర్పడినవి. అటువంటివి,మట్టి లో, రాళ్లలో, గాలిలో, నీటిలో, ఆహార పదార్థాలలో మన ఇండ్లలోనూ చూస్తూవుంటాం. కొన్ని రసాయనాలు కృత్రిమమైనవి.ఇవి రసాయన ప్రయోగశాలల్లో తయారై ఆతరువాత పారిశ్రామికంగా పెద్దపెట్టున అనేకవస్తువులతయారీలో చేరుతూవుంటాయి. వీటిని సింథటిక్ కెమికల్స్ అంటాం. ఇటు వంటివి మందులు, బట్టలు, కంప్యూటర్ లు, సబ్బులు, రంగు పదార్థాలు ఇలా మనం నిత్యం వాడుకొనే అనేక వస్తువులలో వుంటాయి. ఇక కొన్ని రసాయనాలు నేరుగా తాయారుచేసినవి కాకపోయినా, పరిశ్రమలు ఇతర రసాయనాలను తయారు చేసేటప్పుడు ఉప ఉత్పన్నాలుగా (byproducts) ఏర్పడుతూ వుంటాయి.

చాలా రసాయనాలు మనకి నాణ్య మైన, సౌఖ్యవంతమైన జీవితాన్ని అందిస్తాయి, అవి మన ఆరోగ్యానికి గానీ, లేదా పరిసరాలకుగానీ హాని కలిగించవు. అయితే, కొన్నిరసాయనాలు, మనకు,పరిసరాలకు హానికలిగించేవి కూడా వున్నాయి.అటువంటి వాటిని మోతాదుకు మించి తయారుచేయడాన్ని, వాడుకను, వాడిన తరువాత పారవేయడాన్ని నియత్రించుకోవలసిన అవసరంవుంది. కొన్ని రసాయనాలను ప్రణాళికా రహితంగా తయారు చేస్తూ విస్తృతంగా వాడుకలో పెట్టడం చేత అవి మన పరిసరాలకు పెద్దపెట్టున హని చేస్తున్నాయి .

రసాయనాలను వాటి ముడి పదార్థాలనుండి తాయారు చేస్తున్నప్పుడు, రవాణాలోనూ, వాడుక లోను, పారవేస్తున్నప్పుడు గాలిలోకి, నీటిలోకి మట్టిలోకి చేరుతూ వుంటాయి. గృహావసరాలు, ఆహారోత్పత్తులు, త్రాగునీరు, మట్టి, నదులు, చెరువులు సముద్రాలు మొదలైన వాటి ద్వారా వీటి పంపిణీ జరుగుతుంది. భారలోహాలవంటి కొన్నిరకాలైన రసాయనాలు, భౌగోళికంగా పంపిణీ అవుతూ, సముద్ర గర్భాలు , వాన అడవులు, ధృ వ ప్రాం తాలకు సైతం చేరి అక్కడ పరిసరాలను కలుషితం చేస్తాయి. చాలా తొందరగా ఆహార చక్రం లో ప్రవేశించి జీవావరణంలో మిక్కిలిగాచేరుతూ జంతువులను, మనలను, వాటి విష ప్రభానికి లోను చేస్తాయి. ఏఏ రకాలకు చెందిన రసాయనాలు, ఏమేరకు పరిసరాలలో ఎక్కడెక్కడికి చేరుతున్నాయి,చేరిన వాటి గాఢత ఆయా పరిసరాలలో ఏమాత్రం వుంది, వంటి అనేకానేక అంశాలపై జీవరాశుల ఆరోగ్యము, అస్థిత్వాలపై ఆయా రసాయనాలు చూపే ప్రభావాలు అధారపడి వుంటాయి . కొన్ని రసాయనాలు వెనువెంటనే, కంటికి కనపడే చెడు ప్రభావాన్ని చూపకపోయినా ,కొంత కాలానికి అవిచేస్తున్న హాని ఇంతింతని చెప్పలేనంత గా బయటపడుతుంది.

ఆధునిక కాలంలో రసాయనాల కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా అందరినీ కలవర పెడుతున్నది. అవి మానవులతో పాటూ జీవావరణానికే మొత్తంగా చెరుపు

చేస్తున్న పరిస్థితి నెలకొని వుంది. కీటక నాశనులు, నైట్రోజన్, పోస్ఫరస్ లతో తయారయ్యే రసాయన ఎరువులు ముఖ్యంగా జలావరణాన్ని కలుషితం చేయడం ద్వారా దాదాపుగా 90 శాతం జలజీవాల పై వాటి చెడు ప్రభావముంటున్నది. పారిశ్రామిక వ్యర్థాలను గోమతి నదిలోకి విడుదల చేయడంవల్ల జీవ విచ్చిన్నం కాని వ్యర్థ పదార్థాలను, చెత్తచెదారాలను పడేయడం వల్ల ఆనది నీరు కలుషితమై నీటిలో కరిగి వున్న ఆక్సి జన్ శాతం బాగాతగ్గి, గోమతి నదిలో చేపలు చనిపోతునట్టుగా తాజా లెక్కలు చెపుతున్నాయి .వ్యవసాయ పని వారు ప్రతి సంవత్సరం కీటకనాశనుల విష ప్రభావానికి గురవుతున్నారు .

హానికర రసాయనాలు ఎలా పరిసరాలలోకి చేరి జీవ వ్యవస్థలను దెబ్బతీస్తున్నాయో క్లుప్తంగా తెలుసుకొందాం.

ఉదాహరణకి డి. డి. టి. ని తీసుకొందాం . ఈ పదాన్ని బహూశా వినని వారెవరూవుండరు. దీని పూర్తిపేరు డై క్లోరో, డై ఫినైల్, ట్రై క్లోరో ఈథైన్. తొలిసారిగా 1873 లో కృత్రిమంగా ప్రయోగశాలలొ దీనిని తయారుచేసారు. ఇది “ ఆర్గానో క్లోరైడ్స్” అనే రసాయనాల తెగకు చెందినది. ఈతెగ రసయనాలు కీటక నాశను లు. 1939లో స్విస్ రసాయనికుడు పాల్ హెర్మన్ ముల్లర్ డి. డి. టి. పురుగులను చంపగలదని, అదొక విషపదార్థమని కనుగొన్నాడు. రెండవ ప్రపంచ యుద్ధసమయంలో సైనికుకులు, పౌరులు మలేరియా బారిన పడకుండా ఆవ్యాధి కారకమైన దోమలను చంపడానికి వాడారు.డిడిటిని వాడకపోతే యుద్ధం వల్లకంటే ఎక్కువగా మలేరియావల్ల ఎక్కువమంది సైనికులు చని పోయే వారు. నిజమేకదామరి.డి.డి.టి. కిగల కీటకనాశన స్వభావాన్ని కనుగొన్నందుకు పాల్ హెర్మన్ ముల్లర్ కి 1948లో నోబెల్ బహుమతి పొందాడు. ఇంకేముంది! మహ బాగుంది అనుకొంటూ , పంటపొలాలలో చల్లుతూ వాటిపై చేరే పురుగులను చంపగా దిగుబడులు ఎక్కువయాయి.ఇంకా సంతోషం కదా! . డి.డి.టి “ అటామిక్ బాంబ్ ఆఫ్ పెస్టిసైడ్స్” అంటూ శాస్త్రవేత్తల నుండి, జనాలనుండి ప్రశంసలనందుకొంది. 1950 లనాటికి ఒక దశలో ఏడాదికి 220 మిలియన్ పౌండ్ల డి.డి.టి ని యు. ఎస్ ఉత్పత్తి చేసుకోవలసి వచ్చిందటే దాని వాడుక ఎంతగా పెరిగిందో ఊహించండి.

1962 వచ్చేసరికి ఈ పరి స్థితి తారు మారైంది. “ డిడిటి తోసహా ఆతరహా రసాయనాలన్నీ కీటక నాశనులు’ కాదు, “ జీవ నాశనులు” అంటూ రేచల్ కార్సన్ వర్ణించింది. రేచల్ కార్సన్ వైజ్ఞానికురాలు, రచయిత్రి కూడా , ఈమె 1962లో సై లెంట్ స్ప్రిం గ్ ( Silent Spring) పేరుతో ఒక పుస్తకాన్ని ప్రచురించింది. అందులో ఆమె ఈ పురుగుల మందుల విపరీతపు వాడుక ప్రకృతి సమతుల్యాన్ని బాగా దెబ్బతీసిన వైనాన్ని వివరించింది. 1967లో యు ఎస్ వారి ‘ ఎన్విరాన్ మెంట్ డిఫెన్స్ ఫండ్’ పురుగుల మందుల వాడుక ఎంత సురక్షిమో తెలుసు కోవాలని సమీక్ష వేసింది. ఫలితాలు తెలిసేసరికి అందరికీ గుండె దడపుట్టింది. దాంతో 1972లో డి డి టి. వాడకాన్ని యు ఎస్ వారి ‘ఎన్విరాన్ మెంట్ ప్రొటెక్షన్ ఏజెన్సి’ వారు నిషేదించారు. డి.డి.టి వల్ల పర్యావరణానికి కలుగుతున్న హాని తెలిసేసరికి ఏకంగా ఎన్ని సంవత్సరాలు పట్టిందో కదా!

ఇంతకీ అసలేంజరిగిందంటే , డి.డి.టి నీటిలో కరగదు. కానీ సులభంగా ఆర్గానిక్ ద్రావణులలొ, నూనెలలో, క్రొ వ్వు లలో కరుగుతుంది. క్రొవ్వులలో కరిగేస్వభావంచేత ఇది జీవుల కొవ్వుకణజాలలోకి ( fatty tissues) ప్రవేశించి, అక్కడ రాను రానూచేరూతూవుంది. ఇలా చేరడాన్ని జీవ సంచితం (bioaccumulation) అంటారు. జీవ సంచిత వల్ల నీటిలోని వృక్ష ప్లవకం నుండి ( Phytoplanktons) నీటి ప్రవాహాలలో కొట్టుకొంటూ పోయే జూ ప్లాన్కటాన్ల (zooplanktons) ద్వారా గాజు రొయ్యలు ( crayfish), కప్పలు, చేపలలో చేరి అక్కడ నుండి వీటిని తినే జంతువుల కొవ్వుకణజాల లోకి చేరాయి. ఆహారచక్రానికి పైనున్న జీవులలో డిడిటి స్థాయి ఎక్కువగా కనిపించింది. మరీ ముఖ్యంగా రాబందులు, గెద్దలు, డేగలు, గూళి - సాళువ డేగలు (condors), గూడకొంగలు (pelicans) ఇంకా-ఇతర మాంసాహారులైన, వేటాడే

పక్షుల శరీరాలలో సాపేక్షంగా ఈ జీవ సంచిత విష పదార్థం(bio accumulative toxin) చాలా ఎక్కువ స్థాయిలో వెళ్ళి చేరింది. ఇలా ఆహార చక్రంలోకి ప్రవేశించడం వల్ల క్రౌంచ పక్షుల (ఒక రకం డేగలు) సంతతి బాగా తగ్గి పోయినట్లు శాస్త్రజ్ఞులు గుర్తించారు . పంటపొలాల లో వాడడంవల్ల కూడా ఆహార గొళుసులోచేరి అక్కడ ప్రోగయి పోయింది . ఆహార చక్రంలో పైనే వున్న మనుషుల మీద కూడాదీని ప్రభావాన్ని గుర్తించడం జరిగింది. యు ఎస్ వారి 'ఎన్విరాన్ మెంట్ ప్రొటెక్షన్ ఏజెన్సి( EPA)' వారు మనుషులలో డిడిటి విషప్రభావంవల్ల లివర్ క్యాన్సర్, పునరుత్పత్తి, నాడీవ్యవస్థల పనితీరు దెబ్బతినడం వంటివి తలెత్తుతాయని పేర్కొంది. యు ఎస్ లో దీని వాడుకను నిలిపివేసాక పరిసరాలలో, జంతువులలో దీని గాఢత తగ్గింది. కానీ, డిడిటికి గల హఠముగా వుండే (Persistence,) లక్షణంవల్ల( నిలవ వుండే) అదివరకటిరోజులవాడుకలోని డిడిటి పరిసరాలలో చేరినది ఇంకా మిగిలివుంది .

డిడిటి ని, దానితో పాటు పరిసరలలో చేరి నిలవ వుండిపోయే ఇతర కాలుష్యాలను ( persistent organic pollutants ) (POPs) అదుపు పెట్టే విషయంలో 1996 నుడి EPA అంతర్జాతీయ రాయబారాలలో పాల్గొంటొంది, యు. ఎన్. ఇ. పి. (United Nations Environment Programme) వారి ఆధ్వర్యంలో పలు దేశాలు కలసి భౌగోళిక స్థాయిలో POP ల తయారీ, వాడుకల నిషేధం లేదా, అదుపులో పెట్టడం పై ఒప్పందాన్ని కుదుర్చుకొన్నాయి. ఈ ఒప్పందాన్ని Stockholm Convention on POPs అంటారు . మొత్తం 12 POP ల లో డిడిటి ఒకటి . ఎక్కడైతే మలేరియా మరీ వుధృతంగా వ్యాప్తి చెందే పరిస్థితి వుందో అక్కడ ఆవ్యాధివల్ల చనిపోయే వారు కొన్ని లక్షలలో వుండవచ్చు కాబట్టి డిడిటి వాడుకకు అటువంటి దేశాలకు కొన్ని మినహాయింపులను ఇచ్చింది. 2006 సెప్టెంబర్ మాసంలో లో World Health Organization (WHO) ఆఫ్రికా దేశాల వారు తమ ఇండ్లలో డిడిటిని వాడుకోవచ్చునని చెప్పింది. మలేరియా ని అదుపులోపెట్టడానికి తప్పించి మిగిలిన ఏ సందర్భాలలోనూ డిడిటి ని నిషేధించింది. కానీ భారత దేశం, చైనా, దక్షిణ అమెరికా, ఆఫ్రికా, మలేషియాలు ఇంకా డీడిటి ని మలేరియా అదుపుకు వ్యసయరంగాలలో కీటక నాశనిగా వాడుతున్నాయి .

2016 నుండి భరత దేశంలోని న్యూ ఢిల్లీ లో United Nations Environment Programme లో తన విభాగాన్ని పెట్టింది. 2018 జూన్ నెలలో భారత దేశపు ఆథిధ్యంలో 'Beat Plastic Pollution' అంశం భూమికగా World Environment Day ని నిర్వహించింది .

మనం వ్యక్తి గత స్థాయిలో పరిసరాలను కాపాడ డానికి అలవాటు పడాలి. వ్యక్తిగత వాహనాలైన కారులు మోటార్ బైకులు, స్కూటర్లు వంటి వాటికి బదులుగా, రైలులు, బస్సులు, సిటి బస్సులు, మెట్రో రైలులను వాడుకోవాలి. ఓమాదిరి దూరం వున్న ప్రదేశాలకు బైసికిల్ ళ్లను వాడాలి. మరీ దగ్గర ప్రదేశాలకు నడిచి వెళ్లాలి. దీని వల్ల వాయుకాలుష్యం తగ్గుతుంది. పెట్రోల్, డీజెల్ ఆదా అవుతాయి. ఇంటిలోను, ఆఫీసులూ, స్కూళ్లూ కాలేజీలు, విశ్వవిద్యాలయాలలో చేరే చెత్తను విచక్షణతో తడి, పొడి , గాజు, ప్లాస్టిక్, బ్యాటరీలు, ఎలెక్ట్రానిక్ చెత్తలను వేరువేరువిభాగాలలొ సంగ్రహిస్తూ నేరుగా చక్రీయవ్యవస్థలకు చేరేలా ఏర్పాట్లు చేసుకోవాలి.పురపాలక సంఘంవారికి సహాయకంగా,బాధ్యతతో ప్రతీపౌరుడూ వ్యవహరించాలి. రోడ్ల పైన, దారులలోఎక్కడపడితే మూత్రవిసర్జన, ఉమ్మి వేయడం వంటి దురలవాట్లను మానుకొనడంద్వారా కూడా ప్రతీ వ్యక్తీ పర్యావరణాన్ని కాపాడినవాడవుతాడు.

***

సంప్రదింపులు :

How do chemical substances affect the environment? Proceedings of rspb. royalsocietypublishing.org/content/185/1079/127

International Journal of Advanced Research (IJAR) (2016), Volume 4, Issue 5, 1800-1806

https://www.epa.gov/ingredients-used-pesticide-products/ddt-brief-history-and-status


LI-NING LI-NING


I&PR
I&PR

RNI No. TELTEL/2011/39497 SEPTEMBER2019 Postal No. HSE/1043/2017-19

Date of Publishing: 1st September Date of Posting: 8th September






Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001